www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 199
మంగళవారం | 4-11-2025
పేజీలు: 14
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా.10:36 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: రేవతి మ.12:34 తదుపరి అశ్విని; వర్జ్యం: తె.6:09 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8:34-9:19, రా.9:48-10:37; అమృతఘడియలు: ఉ.10:25-11:51, తె.3:20-4:44; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:18; సూర్యాస్తమయం: 5:38
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యమకంకర

1) కంకరలో చిక్కుకొని విలవిల్లాడుతున్న ఓ ప్రయాణికురాలు

2) ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

3) బస్సును ఢీకొట్టి ఒరిగిపోయిన టిప్పర్

4) ప్రమాదంలో మరణించిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు (ఫైల్)



టిప్పర్.. టెర్రర్

ఓవర్ లోడ్ కంకరతో ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనం 19 మంది దుర్మరణం

వికారాబాద్-హైదరాబాద్ హైవేపై ఘోర ప్రమాదం

ఘటనకు ముందు పలు వాహనాల్ని దాటిన టిప్పర్

గుంతను తప్పించబోయి బస్సు మీదకు నేరుగా..

డ్రైవర్ వెనక ఉన్న బస్సు భాగం నుజ్జునుజ్జు

టిప్పర్ ఒరిగిపడి కంకర కుప్పలా మారిన బస్సు

కంకర మీదపడి.. ఊపిరాడక ఎక్కువ మంది మృతి

అరగంటలోపే అందర్నీ వెలికితీసినా దక్కని ప్రాణాలు

8 మంది మృతదేహాలపై ఎలాంటి గాయాలూ లేవు

మృతుల్లో 13 మంది మహిళలు, ఒక పసికందు

ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతోంది! టిప్పర్ చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళుతోంది! రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఉన్న మూల మలుపు వద్ద రెండూ ఎదురెదురుగా వచ్చాయి! 40 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్‌లో 55 టన్నుల కంకర వేశారు! లారీ బాడీని మించి కంకరను ఓవర్ లోడ్ చేశారు! దానికితోడు టిప్పర్ అతి వేగంగా దూసుకొచ్చింది! మూల మలుపులో ఓ చిన్న గుంతను డ్రైవర్ చూశాడు! దానిని తప్పించడానికి ప్రయత్నించాడు! అంతే.. అతి వేగంగా ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు! అతి వేగం కారణంగా లారీ బ్యాలెన్స్ తప్పింది! లారీ బాడీ మొత్తం బస్సువైపు ఒరిగింది! అందులోని కంకర బస్సులో కుప్పగా పడిపోయింది! దాదాపు 20-30 టన్నుల కంకర మీద పడడంతో బస్సులో కుడివైపు ముందు భాగంలో కూర్చున్నవాళ్లు దాని కింద సజీవ సమాధి అయిపోయారు! ప్రమాదం కంటే కంకర కారణంగా ఎక్కువమంది దుర్మరణం పాలయ్యారు! రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఘోర విషాదమిది!!



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ చేవెళ్ల/ మొయినాబాద్/పరిగి)

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో వికారాబాద్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయాలపాలయ్యారు. కంకర లోడ్‌తో వేగంగా వెళుతున్న టిప్పర్ వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును నేరుగా ఢీకొని, కుడివక్క ఆరు సీట్లను నుజ్జు నుజ్జు చేసి, 55 టన్నుల కంకర లోడుతో బస్సుపై ఒరిగి పోయింది. పై నుంచి పోసినట్లుగా టన్నుల కొద్దీ కంకర మీద పడటంతో బస్సులో అనేక మంది అందులోనే సజీవ సమాధి అయ్యారు. టిప్పర్ డ్రైవర్

మిగతా 10వ పేజీలో...

మృతుల కుటుంబాలకు రూ. 7 లక్షలు

క్షతగాత్రులకు రూ.2 లక్షలు: పొన్నం

ప్రమాదంపై విచారణకు ఆదేశం

రూ.2 లక్షలు, రూ.50 వేల చొప్పున ప్రకటించిన పీఎంవో

ప్రయాణికులకేదీ ప్రమాద బీమా?

సేఫ్టీ సెస్ పేర ప్రయాణికుల నుంచి రూ.1 వసూలు చేస్తున్న ఆర్టీసీ

అయినా దక్కని బీమా ధీమా

12

రాకాసి రహదారి!

జాతీయ రహదారి 163లో ప్రమాదకరంగా 46 కిలోమీటర్లు

పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ఇరుకు రహదారి

వందల్లో ప్రమాదాలు, మృతులు.. రోడ్డు విస్తరణకు సర్కార్ నిర్ణయం

రోడ్డుపై ఉన్న మర్రిచెట్లకు హాని అంటూ ఎన్‌జీటీలో పర్యావరణ ప్రేమికుల పిటిషన్.. ఏళ్ల తరబడి రహదారి విస్తరణకు ఆటంకం

తాజాగా కేసు వెకేట్.. పనులు మొదలుపెట్టాలంటూ ఎన్‌జీటీ తీర్పు

త్వరలో పనులు ప్రారంభించే ప్రయత్నాలు.. ఇంతలోనే ప్రమాదం

ఈ విషాదానికి బాధ్యులెవరంటున్న బాధిత కుటుంబాలు

12



కిక్కిరిసిన ప్రయాణాలు.. ప్రమాదంలో ప్రాణాలు!

బస్సుల్లో పరిమితికి మించి జనం

కొండగట్టు ఘోర ప్రమాదం తర్వాతా పాఠాలు నేర్వని ఆర్టీసీ

తాజా ప్రమాదంలోనూ 45 సీట్ల బస్సులో 72 మంది ప్రయాణం

అయ్యో.. బిడ్డల్లారా..

ముగ్గురు అక్కాచెల్లెళ్ల దుర్మరణం

పెళ్లికి వచ్చి వెళ్తుండగా విషాదం

హృదయవిదారకంగా రోదించిన తల్లిదండ్రులు

11



ఇప్పుడు కాకపోతే.. ఎస్ఎల్‌బీసీ

ఎప్పటికీ పూర్తి కాదు

రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్ టన్నెల్ పనులను పదేళ్లు పడావు పెట్టారు

కాంగ్రెస్‌కు పేరొస్తుందని, కమీషన్లు రావని కేసీఆర్, హరీశ్‌రావు కుట్ర చేశారు

అధునాతన సాంకేతికతతో రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తాం

ప్రాజెక్టు పూర్తయితే పైసా ఖర్చు లేకుండా 3 లక్షల ఎకరాలకు నీరు: సీఎం రేవంత్

ఎస్ఎల్‌బీసీ వద్ద 'హెలీబార్న్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే' ప్రారంభం



సర్వేను పరిశీలిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

మహబూబ్‌నగర్/ నాగర్‌కర్నూల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం నిర్మాణం ఇప్పుడు కాకపోతే ఇక ఎప్పటికీ పూర్తి కాదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు ప్రాంత బిడ్డలుగా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లిలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఔట్‌లెట్ వద్ద 'హెలీబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ జియో ఫిజికల్ సర్వే'ను ప్రారంభించారు. ప్రత్యేక పరికరాలను అమర్చిన హెలికాప్టర్ ముందు వెళుతూ

మిగతా 9వ పేజీలో...

ప్రైవేటు కాలేజీల

బంద్ ప్రశాంతం

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల మూత

మాది జీవన్మరణ సమస్య.. అన్నింటికీ సిద్ధమయ్యాం

కనీసం రూ.5వేల కోట్ల బకాయిలు విడుదల చేయాల్సిందే

రెండేళ్లలో ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలే

ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘాల సమాఖ్య ఆరోపణ

తొలిరోజు 98శాతం కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయని వెల్లడి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో సోమవారం నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ సహా అన్ని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ చేపట్టాయి. సెలవులు ఇస్తున్నామని ఆదివారమే విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాయి. కొన్ని విద్యా సంస్థలు తమ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను ఇళ్లకు పంపేశాయి. ఫీజు బకాయిల విడుదల చేయాలంటూ కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ప్రైవేటు కాలేజీల సంఘం ఆధ్వర్యంలో

మిగతా 3వ పేజీలో...



రాజస్థాన్‌లో ట్రక్కు బీభత్సం..

19 మంది మృతి

మద్యం మత్తులో డ్రైవర్.. 5 కి.మీ.ల మేర వాహనాలన్నింటినీ ఢీకొట్టిన వైనం

పలు వాహనాలను ఈడ్చుకెళ్లిన ట్రక్కు

2



అమెరికా ముడిచమురు భారీగా దిగుమతి

అక్టోబరులో రోజుకు సగటున 5.75 లక్షల బ్యారెళ్లు

2022 తర్వాత గరిష్ఠస్థాయిలో దిగుమతి చేసుకున్న భారత్

2



పాక్ అణు పరీక్షలు చేస్తోంది

రష్యా, ఉత్తర కొరియా, చైనా కూడా చేస్తున్నాయ్

ఆ విషయాన్ని గుట్టుగా ఉంచుతున్నాయి

మేం అలాకాదు.. బహిరంగంగా చెబుతాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్య

వాషింగ్టన్, బీజింగ్, నవంబరు 3: దాదాపు మూడు దశాబ్దాల తర్వాత అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభిస్తున్నామని ఇటీవలే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు షాకిచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆయన ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. తామే కాదు.. చాలా దేశాలు అణ్వాయుధాలను

మిగతా 2వ పేజీలో...

పాక్‌కు 8 చైనా జలాంతర్గాములు

2

భారత నేవీకి చెక్ పెట్టే వ్యూహం

2026లో మొదటిది అందే చాన్స్

అనిల్ అంబానీ

ఆస్తుల జప్తు

వాటి ముఖ విలువ 7,500 కోట్లు

అనిల్ నివాసముండే ముంబై ఇల్లు సహా దేశవ్యాప్తంగా ఆస్తులు స్వాధీనం

మనీలాండరింగ్ కేసులో జప్తు చేస్తున్నట్లు ప్రకటించిన ఈడీ

మంచిరేవుల 76 ఎకరాలు కూడా?

న్యూఢిల్లీ, నవంబరు 3: అనిల్ అంబానీ రిలయన్స్ గ్రూప్ సంస్థలకు సంబంధించిన రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. మనీలాండరింగ్ కేసులో ఈ ఆస్తులను జప్తు చేస్తున్నట్లు అక్టోబరు 31న ఈడీ ప్రకటించింది. ఈ ఆస్తుల్లో అనిల్ అంబానీ నివాసం ఉంటున్న పాలీ హిల్స్ నివాసం, అతని గ్రూపు సంస్థల

మిగతా 2వ పేజీలో...



ఆదిలాబాద్‌లో బతుకమ్మను ఎత్తుకున్న కవిత

బీఆర్ఎస్ మంచి చేస్తే మంచి..

చెడు చేస్తే చెడు అంటాం

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ వద్దని నిపుణులు చెప్పారు

కాంగ్రెస్‌కు ఏటీఎంగా ప్రాణహిత-చేవెళ్ల

3

'జనం బాట'లో భాగంగా ఆదిలాబాద్ పర్యటనలో తెలంగాణ జాగ్రుతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు

ఆన్‌లైన్ గేమ్స్‌కు కానిస్టేబుల్ బలి



సందీప్

- రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య
- వాట్సాప్ గ్రూప్‌లో సూసైడ్ నోట్
- సంగారెడ్డి పట్టణంలో ఘటన

3

కోకాపేటలో ఎకరం..

రూ. 99 కోట్లు

ధర ఖరారు చేసిన హెచ్ఎండీఏ

14

42 ఎకరాల భూ వేలానికి ప్రకటన

24,28, డిసెంబరు 3,5 తేదీల్లో ఈ-వేలం

రూ.6 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా

భారత్‌కు తొలి మహిళా ప్రపంచ కప్
లక్షలాది మంది యువతకు స్ఫూర్తి

▸ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు



న్యూఢిల్లీ, నవంబరు 3: క్రీడల నుంచి స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) విద్య వరకు మహిళలు సత్తా చాటుతున్నారని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన ప్రపంచ కప్ పోటీల్లో భారత మహిళా జట్టు అద్భుత విజయం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ విజయం దేశంలోని లక్షలాది మంది యువతకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో తొలిసారి నిర్వహించిన సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్(ఈఎస్‌టీఐసీ) సదస్సు-2025లో ప్రధాని ప్రసంగించారు. "ఈ సదస్సు పూర్తిగా సైన్స్‌కు సంబంధించిందే. అయినా, ముందుగా.. టీమిండియా మహిళలు సాధించిన అద్భుత విజయాన్ని ప్రస్తావించాలి. ఇది భారతకు దక్కిన తొలి మహిళా ప్రపంచ కప్. మహిళా జట్టులోని ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నా." అని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ మహిళలు విశేషంగా రాణిస్తున్నారని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా నూతన ఆవిష్కరణల విషయంలో దూసుకుపోతున్నారని, ఈ క్రమంలో పేటెంట్‌ల కోసం దరఖాస్తు చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. "పదేళ్ల కిందటి వరకు పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్న మహిళల సంఖ్య ఏడాదికి 100లోపే ఉండేది. కానీ, ఇప్పుడు ఏటా 5 వేల మందికి పైగా తమ ఆవిష్కరణల పేటెంట్ల కోసం దరఖాస్తు చేస్తున్నారు." అని మోదీ తెలిపారు. కాగా, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, వాటిని ప్రోత్సహించే లక్ష్యంతో రూ.లక్ష కోట్లతో రిసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్(ఆర్డీఐ) పథకానికి మోదీ శ్రీకారం చుట్టారు.

శబరిమల బంగారం చోరీపై రెండో కేసులో ఉన్నికృష్ణన్ అరెస్టు

▸ ద్వారాల పుత్తడి కూడా అపహరించినట్టు ఆరోపణ

పథనంథిట్ట, నవంబరు 3: శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో బంగారం చోరీ సంఘటనకు సంబంధించి నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టిని సోమవారం పోలీసులు మరో కేసులో అరెస్టు చేశారు. గతంలో ద్వారపాలక విగ్రహాల తొడుగులకు ఉన్న బంగారాన్ని మాయం చేశారన్న కేసులో అరెస్టు చేయగా, ప్రస్తుతం ద్వారబంధాలకు ఉన్న పుత్తడినీ అపహరించారన్న కేసులో అరెస్టు చేశారు. శ్రీకోవిల్‌లో ఉన్న బంగారం రేకులకు మరమ్మతులు చేయిస్తానని, అందుకు ప్రాయోజకుడిగా వ్యవహరిస్తానని చెప్పి పుత్తడిని అపహరించినట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఉన్నికృష్ణన్‌ను సోమవారం రన్నీలోని కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం పది రోజుల కస్టడీకి పంపించింది.

ఎన్నికల్లో తాయిలాలుగా డ్రగ్స్

▸ రూ.24.61 కోట్ల విలువైన మాదకద్రవ్యాల పట్టివేత

న్యూఢిల్లీ, నవంబరు 3: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు తాయిలాలుగా నగదు, మద్యం, గృహోపకరణాలు వంటివి ఇవ్వడం ఇప్పటివరకు చూశాం. తాజాగా వీటి జాబితాలో డ్రగ్స్ చేరడం విస్మయం కలిగిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలు జరగనున్న బిహార్ తదితర రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు రూ.24.61 కోట్ల విలువైన మాదకద్రవాలను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం వెల్లడించింది. సీజ్ చేసిన తాయిలాల మొత్తం విలువ రూ.108.19 కోట్లకు పైగా ఉంటుందని పేర్కొంది. వీటిలో రూ.9.62 కోట్ల నగదు, రూ.42.14 కోట్ల మద్యం, రూ.5.8 కోట్ల బంగారం, వెండి, రూ.26 కోట్ల విలువైన ఉచిత వస్తువులు తదితరాలున్నాయని తెలిపింది.

మృత్యుంజయుడు కాదు.. జీవచ్ఛవం

▸ విశ్వకుమార్ రమేశ్‌ను ఆదుకోని ఎయిర్ ఇండియా



లండన్, నవంబరు 3: విశ్వకుమార్ రమేష్.. ఎంతో అదృష్టవంతుడని అప్పట్లో అందరూ అనుకున్నారు. అహ్మదాబాద్‌లో జూన్ 21న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ ఏకైక వ్యక్తి అతడే కావడంతో అందరూ ఆయనను ప్రశంసించారు. గాలిలోకి ఎగిరిన కొద్ది క్షణాల్లోనే విమానం కూలడంతో 241 మంది మరణించగా, 11ఏ సీటు వద్ద కూర్చొన్న ఒక్క రమేష్ మాత్రం తప్పించుకున్నాడు. అయితే, ప్రస్తుతం ఆయన పరిస్థితి చూస్తే దారుణంగా ఉంది. ప్రమాదానికి బాధ్యత వహించాల్సిన ఎయిర్ ఇండియా ఆదుకోవడం లేదని కుటుంబ సభ్యులు వాపోయారు. బ్రిటిష్ పౌరుడైన ఆయనకు అహ్మదాబాద్‌లో చికిత్స చేసిన అనంతరం తిరిగి బ్రిటన్‌లోని లీసెస్టర్‌కు పంపించారు. ఆయన ప్రస్తుతం పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ) బాధపడుతున్నా పట్టించుకునే వారే లేరు. అతడు రోజంతా మౌనంగా ఉండిపోతూ భార్య, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడడం లేదు.

రష్యా సాయంతో ఇరాన్‌లో 8 అణు విద్యుత్ ప్లాంట్లు

టెహ్రాన్, నవంబరు 3: అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా ఇరాన్ చర్యలు తీసుకుంది. రష్యా సాయంతో తమ దేశంలో కొత్తగా ఎనిమిది అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించనున్నామని వెల్లడించింది. స్వచ్ఛమైన, స్థిరమైన ఇంధన ఉత్పత్తిని విస్తరించుకునే చర్యల్లో భాగంగా ఈ ప్లాంట్లు నిర్మిస్తామని ఇరాన్ అణుశక్తి సంస్థ (ఏఈవోఐ) చీఫ్ మొహమ్మద్ ఇస్లామి ఆదివారం ప్రకటించారు. బుషెహర్ ప్రావిన్స్‌లో నాలుగు, ఉత్తర, దక్షిణ తీర ప్రాంతాల్లో మరో నాలుగు అణు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రష్యాతో ఒప్పందం కుదిరిందని ఆయన వెల్లడించారు. ఆ ప్లాంట్ల ద్వారా 20 వేల మెగావాట్ల అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు లక్ష్యం అణ్వాయుధాలను తయారు చేయడం కాదని.. అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకేనని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పష్టం చేశారు.

ఈడీ కేసులో అనిల్ అంబానీ
ఆస్తుల జప్తు




ఈడీ స్వాధీనం చేసుకున్న ముంబైలోని అనిల్ అంబానీ ఇల్లు

మంచిరేవులలో 76 ఎకరాలు కూడా?

హైదరాబాద్‌లోని మంచిరేవులలో 76.2 ఎకరాలను 2007లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం రిలయన్స్ ఇన్‌ఫ్రాకు కేటాయించింది. అప్పట్లో ఈ సంస్థ ఆ భూమి కోసం రూ.517 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. అయితే, కేవలం రూ.250 కోట్లు చెల్లించింది. 2014లో ఇక్కడే వంద అంతస్తుల భవనం కడుతున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు రిలయన్స్ ఇన్‌ఫ్రా ఆస్తులను జప్తు చేసిన వాటిలో హైదరాబాద్ ఆస్తులు కూడా ఉండటంతో మంచిరేవుల 76.2 ఎకరాల భూములే జప్తు చేసినట్లు భావిస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

పేరు మీద ఉన్న భవనాలు ఉన్నాయి. ఢిల్లీలోని మహారాజా రంజిత్‌సింగ్ మార్గ్‌లో ఉన్న పెద్ద ప్లాట్‌తో పాటు ఢిల్లీ, నోయిడా, గాజియాబాద్, ముంబై, పుణె, థానె, హైదరాబాద్, చెన్నై, తూర్పు గోదావరి ప్రాంతాల్లో రిలయన్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ పేరుతో ఉన్న రియల్ ఎస్టేట్ భూములను జప్తు చేసినట్లు ఈడీ ప్రకటించింది. నవీ ముంబైలోని ధీరూబాయ్ అంబానీ నాలెడ్జి సిటీలో ఉన్న 132 ఎకరాల భూమి విలువే రూ.4,462 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈడీ చర్యపై రిలయన్స్ ఇన్‌ఫ్రా స్పందిస్తూ, ఆస్తులు తాత్కాలికంగా జప్తు చేసిన విషయం నిజమేనని, అయితే తమ కార్యకలాపాల మీద, ఉద్యోగుల మీద ఈ చర్య ప్రభావం ఏ మాత్రం ఉండబోదని తెలిపింది. ప్రజల నుంచి సేకరించిన సొమ్మును రిలయన్స్ హోంఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా సొంత అవసరాలకు మళ్లించారన్నది ఆరోపణ. 2017-19 మధ్యకాలంలో ఎస్‌బ్యాంక్ రూ.2,965 కోట్లు రిలయన్స్ హోంఫైనాన్స్ లిమిటెడ్‌లో, రూ.2,045 కోట్లు రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో పెట్టుబడి పెట్టింది. 2019 డిసెంబరు కల్లా ఈ రెండు సంస్థల నుంచి రావాల్సిన మొత్తాలను నిరర్ధక ఆస్తులుగా ప్రకటించింది. అప్పటికి రిలయన్స్ హోంఫైనాన్స్ నుంచి రూ.1353.5 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ నుంచి రూ.1,984 కోట్లు తిరిగి చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. నిజానికి ఇవి ఎస్ బ్యాంకు సొమ్ము కూడా కాదు. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ నిప్పన్ మ్యూచువల్ ఫండ్స్‌కు చెందినవి. ప్రజల నుంచి సేకరించిన సొమ్ము అది. సెబీ నిబంధనల ప్రకారం మ్యూచువల్ ఫండ్స్ సొమ్మును అనిల్ అంబానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టడం కుదరదు. కానీ, దానికి ఎస్ బ్యాంకు ముసుగు వేసి అనిల్ అంబానీకి చెందిన రెండు సంస్థల్లో పెట్టుబడులు పెట్టించారు. వాటి ద్వారా అనిల్ అంబానీ ఇతర కంపెనీలకు సాధారణ అవసరాల కార్పొరేట్ రుణాలు ఇచ్చారు. దరఖాస్తు ఇచ్చిన రోజే వందల కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసినట్లు ఈడీ గ్రహించింది. దరఖాస్తు, మంజూరు, ఒప్పందం, నిధుల బదిలీ ఒకేరోజు జరిగాయి. కొన్నిసార్లు రుణం మంజూరు కాక ముందే నిధుల బదిలీ జరిగిపోయింది. క్షేత్ర తనిఖీని పూర్తిగా ఎత్తేశారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్నపుడు గ్రూప్ సంస్థల్లో అవకతవకలు బయటకు వచ్చాయి. 2010-12 మధ్య కాలంలో ఆర్‌కామ్ దేశీయ, విదేశీ సంస్థల నుంచి రూ.40,000 కోట్ల అప్పులను తీసుకుంది. వాటిని తీర్చేక్రమంలో ఎక్కడా డీఫాల్ట్ కాకుండా చూసేందుకు అనిల్ రిలయన్స్ గ్రూపునకు సంబంధించిన కంపెనీల నుంచి రూ.13,600 కోట్లను మళ్లించారు. అందులో 12,600 చెల్లింపులకే ఖర్చు పెట్టారు. ఒక రూ.800 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉంచారు. పలు దఫాలుగా రూ.600 కోట్లను అక్రమ పద్ధతుల్లో విదేశాలకు తరలించారు.



ఆ నిబంధన వద్దే వద్దు

న్యాయ విద్యార్థులకు కనీస హాజరుపై ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 3: కనీస హాజరుశాతం లేదన్న సాకుతో పరీక్షలు రాయకుండా న్యాయ విద్యార్థులకు అనుమతి నిరాకరించొద్దని దేశంలోని న్యాయ కళాశాలలకు ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. విద్యార్థులకు తప్పనిసరి హాజరుశాతం నిబంధనపై ఆందోళన వ్యక్తం చేసిన జస్టిస్‌లు ప్రతిభా ఎం సింగ్, అమిత్ శర్మలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం తీర్పు చెబుతూ.. ఈ హాజరు శాతం నిబంధనను సవరించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)కి సూచించింది. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి కానివ్వవద్దని పేర్కొంది. కనీస హాజరు శాతం లేనందున 2016 ఆగస్టులో పరీక్షలు రాసేందుకు కళాశాల యాజమాన్యం అనుమతి నిరాకరించడంతో అదేనెల 10న సుశాంత్ రోహిల్లా ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో సుమోటో పిటిషన్‌పై హైకోర్టు ఈ తీర్పునిచ్చింది.

నిషేధాల వల్ల నేపాల్‌లో ఏమైందో చూడండి!

▸ పోర్న్ వీడియోలు చూడటంపై నిషేధం విధించాలన్న పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 3: దేశంలో పోర్న్ వీడియోలు చూడటంపై నిషేధం విధించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నేపాల్‌లో జెన్-జీ ఉద్యమాన్ని పరోక్షంగా ప్రస్తావించింది. "నిషేధాల వల్ల నేపాల్‌లో ఏం జరిగిందో చూడండి" అని పిటిషనర్‌కు సూచించింది. సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మొదట ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ఒప్పుకోలేదు. అయితే, తర్వాత నాలుగు వారాలయ్యాక విచారిస్తామని తెలిపింది.

రాజస్థాన్‌లో ట్రక్కు బీభత్సం.. 19 మంది మృతి!

జైపూర్, నవంబరు 3 : రాజస్థాన్‌లోని జైపూర్‌లో మద్యం మత్తులో ఉన్న ఒక డంపర్ ట్రక్కు డ్రైవర్ సోమవారం రహదారిపై బీభత్సం సృష్టించాడు. వరుసగా 5కి.మీ దూరం పలు వాహనాలపైకి దూసుకుపోవడంతో 19 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. జైపూర్‌లోని లోహమండి రోడ్డుపై వేగంగా వచ్చిన ట్రక్కు అదుపు తప్పి ఎదురుగా వస్తోన్న పలు వాహనాలపైకి దూసుకుపోయింది. ట్రక్కు డ్రైవర్ బాగా మద్యం మత్తులో ఉన్నాడని, 5కి.మీ. వరకు ఎదురుగా వచ్చిన ప్రతి వాహనాన్ని ఢీకొట్టుకుంటూ వెళ్లాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పోలీసులు ట్రక్కు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని మద్యం మత్తులో ఉన్న విషయాన్ని నిర్ధారించేందుకు వైద్య పరీక్షలకు తరలించారు. ప్రధాని మోదీ ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారికి రూ.2,00,000, గాయపడిన వారికి రూ.50,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

9 రాష్ట్రాలు.. 3 యూటీల్లో నేటి నుంచే 'సర్'

న్యూఢిల్లీ/చెన్నై, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఓటరు సమగ్ర సవరణ(సర్) ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) మంగళవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. 9 రాష్ట్రాలు, 3యూటీల్లో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో 51 కోట్ల మంది ఓటర్లు పాలుపంచుకోనున్నారు. ఈ రెండో దశ 'సర్' ప్రక్రియ కిందకు వచ్చే యూటీలు, రాష్ట్రాలు ఏవనేది ఈసీ వర్గాలు వెల్లడించాయి. అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పాండిచ్చేరి యూటీ జాబితాలో, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లు రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. సర్ ప్రక్రియ అనేక దశల్లో కొనసాగనుంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ మంగళవారం మొదలై డిసెంబరు 4వ తేదీ వరకు కొనసాగుతుంది. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను డిసెంబరు 9వ తేదీన, తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఈసీ విడుదల చేస్తుంది. స్వాతంత్ర్య భారతంలో 'సర్' ప్రక్రియను ఈసీ చేపట్టడం ఇది తొమ్మిదోసారి. చివరిగా 2002-04 మధ్య చేపట్టింది. మరోవైపు, తమిళనాడులో 'సర్' ప్రక్రియను అడ్డుకోవాలంటూ అధికార డీఎంకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమిళనాట ఆరుమాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పరిస్థితుల్లో అత్యవసరంగా సర్ ప్రక్రియను చేపట్టడం ప్రజాప్రాతినిధ్య చట్టానికి వ్యతిరేకమని ఆ పిటిషన్‌లో భారతి తెలిపారు.

పారదర్శకంగా 'సర్': ఈసీ

'సర్' ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఈసీ మద్రాస్ హైకోర్టుకు నివేదించింది. మృతులు, నివాసం మారినవారు, అర్హతలేనివారు, రెండు ప్రాంతాల్లో ఓటుహక్కు కలిగిన వారి పేర్లను తొలగించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలంటూ టీ నగర్‌కు చెందిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, తాంబరం అన్నాడీఎంకే న్యాయవాది వినాయగం వేర్వేరుగా దాఖలు చేసిన పిల్‌పై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు.. ఈసీని వివరణ అడిగిన విషయం తెలిసిందే. భారత ఎన్నికలసంఘం తరపున స్టాండింగ్ కౌన్సిల్ నిరంజన్ రాజగోపాలన్ హాజరయి దీనిపై వివరణ ఇచ్చారు.

అమెరికా నుంచి భారీగా ముడిచమురు

న్యూఢిల్లీ, నవంబరు 3: పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చవగ్గా వస్తున్న చమురునే పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న భారతదేశం.. కిందటి నెలలో (అక్టోబరు) అమెరికా నుంచి భారీగా ముడిచమురును దిగుమతి చేసుకుంది. అక్టోబరు 27వ తేదీనాటికి సగటున రోజుకు 5,75,000 బ్యారెళ్ల చొప్పున కొనుగోలు చేసింది! ప్రముఖ డేటా అండ్ అనలిటిక్స్ సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం 2022 తర్వాత భారత్ అమెరికా నుంచి ఈ స్థాయిలో చమురు దిగుమతి చేసుకోవడం ఇదే. నవంబరులో కూడా ఈ జోరు కొనసాగుతుందని.. రోజుకు 4 లక్షల నుంచి 4.75 లక్షల బ్యారెళ్ల క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటుందని మార్కెట్ నిపుణుల అంచనా. అక్టోబరుకు ముందు అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు.. సగటున రోజుకు 3 లక్షల బ్యారెళ్ల దాకా ఉండేవి. అయితే.. రష్యా నుంచి చమురు కొనొద్దంటూ ట్రంప్ మనదేశంపై తెస్తున్న ఒత్తిడి ఈ పెరుగుదలకు కారణం కాదని.. ఆర్థిక పరిస్థితులే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. అమెరికా ముడిచమురు (డబ్ల్యూటీఐ-వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్) ధర బ్రెంట్ ముడిచమురు ధర కన్నా తక్కువగా ఉండడం, చైనాలో చమురు డిమాండ్ తగ్గిపోవడంతో భారత రిఫైనరీలు అమెరికా నుంచి ముడిచమురు దిగుమతులను పెంచాయి. అలాగని రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు ఏమీ తగ్గలేదు. సెప్టెంబరుతో పోలిస్తే అక్టోబరులో రష్యా నుంచి చమురు దిగుమతులు పెరిగాయి.

అమెరికా దాడి చేసేలా ఉంది.. ఆయుధాలు ఇవ్వండి

▸ రష్యా, చైనా, ఇరాన్‌లకు వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో లేఖలు

వాషింగ్టన్, నవంబరు 3: తమ దేశానికి సమీపంలో, కరీబియన్ సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలను మోహరించిన నేపథ్యంలో రష్యా, చైనా, ఇరాన్‌ల సాయం కోరుతూ నికోలస్ మదురో లేఖలు రాశారు. అమెరికా తమపై దాడి చేయవచ్చని అందులో ఆందోళన వ్యక్తం చేశారు. క్షిపణులు, రాడార్లు అందజేయాలని, తమ యుద్ధ విమానాలకు మరమ్మతులు చేయాలని పుతిన్, జిన్‌పింగ్‌లను కోరారు. ఇటీవల ఇరాన్‌లో పర్యటించిన వెనెజువెలా మంత్రి సెలెస్టినో.. ఆ దేశం నుంచి సాయుధ డ్రోన్లు, ఆయుధాల సరఫరాపై చర్చించారు. మరోవైపు సైన్యాన్ని, ఆయుధాలను తరలించేందుకు వీలు కల్పించే 'ఇల్యూషిన్ ఐఎల్-76' రవాణా విమానాన్ని రష్యా తాజాగా వెనెజువెలాకు అందజేసిందని ఫ్లైట్ రాడార్24 వెబ్‌సైట్ తెలిపింది. అయితే, ఇప్పటికిప్పుడు వెనెజువెలాపై యుద్ధం చేసే ఆలోచనేదీ లేదని, కాకపోతే మదురోకు రోజులు దగ్గరపడ్డాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

పాక్ అణు పరీక్షలు చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)



పరీక్షిస్తున్నాయని.. ఆ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని సంచలన ప్రకటన చేశారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్ సహా ప్రపంచంలో అనేక దేశాలు రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించారు. 'కానీ.. ఆయా దేశాలు వాటి గురించి మాట్లాడడం లేదు. మేం మాత్రం అలాకాదు. ఏదైనా బహిరంగంగానే చెబుతాం' అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా, చైనా వద్ద ఉన్న అణ్వాయుధాల కంటే తమ వద్ద ఎక్కువే ఉన్నాయని ట్రంప్ తెలిపారు. తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయవచ్చన్నారు. అయితే.. అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి తాను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడానని ట్రంప్ తెలిపారు. అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాలంటూ ట్రంప్ తాజాగా జారీచేసిన ఆదేశాలపై అమెరికా ఇంధనశాఖ కార్యదర్శి క్రిస్ రైట్ వివరణ ఇచ్చారు. తాము జరపబోయే అణుపరీక్షల్లో ఎలాంటి విస్ఫోటాలు ఉండవని స్పష్టం చేశారు. అణ్వాయుధాలకు సంబంధించి ఇతర వ్యవస్థలన్నీ నిర్దేశిత లక్ష్యం మేరకు పనిచేస్తున్నాయో లేదో తెలుసుకునేందుకే ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, చైనా రహస్యంగా అణ్వాయుధాలను పరీక్షిస్తోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆ దేశం తీవ్రంగా ఖండించింది. తమ దేశం ఎల్లప్పుడూ శాంతియుత అభివృద్ధి మార్గానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. అణ్వాయుధాల విషయంలో 'ముందుగా వినియోగించకూడదు' అనే విధానానికి కట్టుబడి ఉన్నామని, చైనా అణు వ్యూహం పూర్తిగా రక్షణాత్మకమైనదని పేర్కొంది.

చైనా నుంచి పాక్‌కు 8 జలాంతర్గాములు

ఆపరేషన్ సిందూర్ తర్వాత తన నౌకాదళ సామర్థ్యాన్ని పెంచుకోవాలని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో భారత నౌకాదళానికి పోటీనిచ్చేలా తమకు దాడి సామర్థ్యం కలిగిన 8అత్యాధునిక హ్యాంగోర్ క్లాస్ జలాంతర్గాములను సరఫరా చేయాలని చైనాను పాక్ కోరింది. వాటిలో మొదటిది వచ్చే ఏడాది పాక్ నేవీకి అందుతుందని ఇరు దేశాల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. భారత నేవీకి పోటీగా చైనా నుంచి ఎనిమిది దాడి జలాంతర్గాములను కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని 2015లోనే పాకిస్థాన్ రక్షణ మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. ఈ ఒప్పందం విలువ 5 బిలియన్ డాలర్ల వరకూ ఉంటుందని, 2028 నాటికి ఈ సబ్‌మెరైన్ల అప్పగింత పూర్తవుతుందని భావిస్తున్నట్టు తెలిపింది.

బిజినెస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	115
వరంగల్	107	గుంటూరు	121
కరీంనగర్	107	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	123
విశాఖపట్నం	111	అనంతపురం	123
గోదావరి	115		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,170 ▲	1,12,900 ▲	1,68,000 ▲
విజయవాడ	1,25,000 ▲	1,17,000 ▼	1,53,000 ▲
విశాఖపట్నం	1,24,510 ▲	1,13,000 ▲	1,68,000 ▲
రాజమండ్రి	1,23,160 ▲	1,12,900 ▲	1,51,000 ▲
ప్రొద్దుటూరు	1,21,400 ▲	1,11,690 ▲	1,53,000 ▲
ముంబై	1,20,780 ▲	1,10,630 ▲	1,49,300 ▲

ఎయిర్‌టెల్ లాభం రెండింతలు

25.7 శాతం పెరిగిన ఆదాయం



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సెప్టెంబరు 30వ తేదీతో ముగిసిన వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి అద్భుతమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. అనుబంధ సంస్థలతో కలిసి (కన్సాలిడేటెడ్) ఈ కాలానికి కంపెనీ రూ.52,145 కోట్ల ఆదాయంపై రూ.8,651 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఎయిర్‌టెల్ ఆదాయం 25.7 శాతం పెరగ్గా, నికర లాభం మాత్రం రెండింతలకు పైగా పెరిగింది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే మాత్రం కంపెనీ ఆదాయ వృద్ధిరేటు 5.4 శాతానికే పరిమితం అయింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ దేశీయ ఆదాయం 22.6 శాతం వృద్ధితో రూ.38,690 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం (ఆర్పూ) 9.9 శాతం వృద్ధితో రూ.233 నుంచి రూ.256కు పెరిగింది. దేశీయ ఆదాయంతో పాటు ఆఫ్రికాలోని అనుబంధ సంస్థల పనితీరు మెరుగుపడడం క్యూ2లో మంచి పనితీరు కనబరిచినట్టు ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్, ఎండీ గోపాల్ విఠల్ చెప్పారు.

62.4 కోట్ల మంది ఖాతాదారులు : సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి దేశ, ఆఫ్రికా దేశాల్లోని ఎయిర్‌టెల్ ఖాతాదారుల సంఖ్య 62.4 కోట్లకు చేరింది. ఇందులో 45 కోట్ల మంది దేశీయ ఖాతాదారులు కాగా, మిగతా 17.4 కోట్ల మంది ఆఫ్రికా దేశాల్లోని ఖాతాదారులు. రెండో త్రైమాసికంలో అదనంగా 9.5 లక్షల మంది పోస్టు పెయిడ్ ఖాతాదారులు చేరడంతో వారి సంఖ్య 2.75 కోట్లకు చేరింది. గత ఏడాది కాలంలో స్మార్ట్‌ఫోన్ డేటా ఖాతాదారుల సంఖ్య కూడా 2.22 కోట్ల మేర పెరిగినట్టు తెలిపింది.

సెన్సెక్స్ 40 పాయింట్లు అప్

ముంబై: స్తబ్దుగా సాగిన ట్రేడింగ్‌లో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 39.78 పాయింట్లు పెరిగి 83,978.49 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 41.25 పాయింట్ల వృద్ధితో 25,763.35 వద్ద ముగిసింది.

ఫ్యాబెక్స్ స్టీల్ రెండో ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక ఫ్యాబెక్స్ స్టీల్ స్ట్రక్చర్స్ కంపెనీ తెలంగాణలోని చిట్యాల వద్ద తన రెండో ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. రూ.120 కోట్ల పెట్టుబడితో 40 ఎకరాల్లో 50,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి కూడా ప్రారంభించినట్టు తెలిపింది.

భారత్ బయోటెక్ సీఆర్‌డీఎంఓ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సెల్ అండ్ జీన్ థెరపీ ఆధారిత ఔషధాల కాంట్రాక్టు రీసెర్చి డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (సీఆర్‌డీఎంఓ) రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం జినోమ్ వ్యాలీలో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అనుబంధ సంస్థ 'నూసిలియాన్ థెరాపెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించింది.

వొడాఫోన్ ఐడియాపై టీజీహెచ్ ఆసక్తి!

రూ.52,800 కోట్ల వరకు పెట్టుబడులు?
ఇరువర్గాల మధ్య పురోగతిలో చర్చలు

న్యూఢిల్లీ: భారీ అప్పులు, నష్టాలతో సతమతం అవుతున్న వొడాఫోన్ ఐడియాలో వాటా కొనుగోలుకు న్యూయార్క్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టిల్‌మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ (టీజీహెచ్) ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. 400-600 కోట్ల డాలర్ల (సుమారు రూ.35,000-52,800 కోట్లు) పెట్టుబడుల ద్వారా వీఐ యాజమాన్య, నిర్వహణ హక్కులు చేజిక్కించుకోవాలని టీజీహెచ్ భావిస్తున్నట్లు ఓ ఆంగ్లమీడియా కథనం వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య చర్చలు పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఆదిత్య బిర్లా క్యాపిటల్, వొడాఫోన్ పీఎల్‌సీ వీఐ ప్రమోటర్లుగా ఉన్నాయి. ప్రతిపాదిత పెట్టుబడుల ద్వారా వీఐ ప్రమోటర్‌గా ఈ రెండు గ్రూపుల స్థానాన్ని టీజీహెచ్ భర్తీ చేయాలనుకుంటోంది. ప్రస్తుతం వీఐలో ఆదిత్య బిర్లా క్యాపిటల్ 9.50%, వొడాఫోన్ పీఎల్‌సీ 16.07% వాటాలు కలిగి ఉన్నాయి. కంపెనీ చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ రుసుము, ఏజీఆర్ బకాయిలను ఈక్విటీగా మార్చుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కంపెనీలో అతి పెద్ద (48.99 శాతం) వాటాదారుగా అవతరించింది. వీఐకి ప్రభుత్వం నుంచి మరింత ఊరట లభించడంపై టీజీహెచ్‌తో ఒప్పందం ఆధారపడి ఉన్నట్లు తెలిసింది.

వొడాఫోన్ ఐడియా షేరు 10 శాతం అప్

బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేరు ధర సోమవారం ఒకదశలో 14.20% ఎగబాకి రూ.9.97 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 9.28 శాతం లాభంతో రూ.9.54 వద్ద ముగిసింది. పెట్టుబడుల కోసం టీజీహెచ్‌తో వీఐ చర్చలు జరుపుతోందన్న వార్తలతోపాటు ఏజీఆర్ బకాయిలకు మరింత ఊరట కల్పించే విషయంలో కేంద్రానికి సుప్రీంకోర్టు స్వేచ్ఛనివ్వడంతో షేరు భారీగా ర్యాలీ తీసింది.

గ్లాండ్ ఫార్మా లాభం రూ.184 కోట్లు

హైదరాబాద్: సెప్టెంబరు త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా రూ.1,487 కోట్ల ఆదాయంపై రూ.184 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర లాభం 12 శాతం పెరిగింది. సీడీఎంఓ విభాగం సెనెక్సి అద్భుత పనితీరు ఇందుకు ప్రధాన కారణమని కంపెనీ తెలిపింది. కొత్త ఉత్పత్తులతో అక్టోబరు నుంచి 2026 మార్చి మధ్య మరింత మెరుగైన పనితీరు కనబరుస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీనివాస్ సాదు అన్నారు.

బీఆర్ఎస్ మంచి చేస్తే మంచి..
చెడు చేస్తే చెడు అంటాం

» కాంగ్రెస్ ఏటీఎంగా ప్రాణహిత-చేవెళ్ల: కవిత

ఆదిలాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని మంచే అంటాం. చెడు చేస్తే చెడే అంటాం" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించడం సరైంది కాదని నిపుణులే చెప్పారని, అందుకే ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని చెప్పారు. బీఆర్ఎస్ చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెడుతోందని కవిత మండిపడ్డారు. ప్రాణహిత చేవెళ్లను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా మార్చుకుందని విమర్శించారు. రెండు రోజుల జనం బాట కార్యక్రమంలో భాగంగా మొదటి రోజైన సోమవారం ఆమె ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. మార్కెట్లో పత్తి కొనుగోళ్లను పరిశీలించి, జైనథ్ మండలంలో దెబ్బతిన్న తర్నం బ్రిడ్జిని సందర్శించారు. అనంతరం పెన్‌గంగా నదిపై నిర్మించిన కొరాటా-చనకా బ్యారేజి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలోని కొమురంభీం కాలనీ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో 50వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు గత ప్రభుత్వం కొరాటా-చనకా బ్యారేజి నిర్మాణాన్ని ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పూర్తిచేయడం లేదన్నారు. ప్రాణహిత-చేవెళ్ల రీడిజైన్‌లో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్‌లో పలు ప్రాజెక్టులను చేపట్టారని పేర్కొన్నారు.

ఓటుకు నోటుపై
సమగ్ర విచారణ అవసరం

» జనవరిలో సుదీర్ఘ వాదనలు వింటాం : సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో సమగ్ర విచారణ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. జనవరి రెండోవారంలో ఇరుపక్షాలకు సంబంధించిన సుదీర్ఘ వాదనలు వింటామని తెలిపింది. ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియామావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021 జూలై 22న రేవంత్‌రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 2021 ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు పిటిషన్లపై సోమవారం ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రేవంత్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. తొలుత లూథ్రా వాదనలు వినిపిస్తూ.. 'ఓటుకు నోటు' వ్యవహారంలో రేవంత్ రెడ్డిపై దాఖలైన కేసు చెల్లుబాటు కాదని చెప్పారు. 2015లో కేసు నమోదు చేసినందున, ఆనాటి చట్టాలే వర్తిస్తాయని, 2018లో చేసిన సవరణల ప్రకారం విచారించకూడదని వివరించారు. ఈ అంశంపై సుదీర్ఘ వాదనలు వింటామని చెబుతూ కేసును జనవరి రెండోవారానికి ధర్మాసనం వాయిదా వేసింది. జనవరి 12వ తేదీన విచారణకు వచ్చే అవకాశముంది.

ప్రైవేటు కాలేజీల బంద్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

ధర్నా చేశారు. కాగా, హైదరాబాద్‌లో బాచుపల్లి, గండిపేట ప్రాంతాల్లోని రెండు పేరున్న కళాశాలలు, మైసమ్మగూడలోని ఓ మాజీ మంత్రికి చెందిన విద్యా సంస్థలు సోమవారం బంద్‌కు దూరంగా ఉన్నాయి.

హామీ నిలబెట్టుకోనందునే బంద్: ఫాతీ

రాష్ట్రంలోని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల్లో 98శాతం మేర తొలిరోజు బంద్‌లో పాల్గొన్నాయని ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘాల సమాఖ్య (ఫాతీ) ప్రకటించింది. మంగళవారం నుంచి వందశాతం కాలేజీలు పాల్గొంటాయని తెలిపింది. ఫాతీ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రమేశ్‌బాబు మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోవడంతో మరో మార్గం లేక సమ్మెకు దిగామని చెప్పారు. ఫీజు బకాయిలు అడిగితే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం బాధాకరమని పేర్కొన్నారు. "పెద్దన్నలా అండగా ఉండాల్సిన ప్రభుత్వం విజిలెన్స్ పేరుతో బెదిరించడం సరికాదు. ఏవైనా కాలేజీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను దుర్వినియోగం చేశాయని ప్రభుత్వం భావిస్తే.. దానికి కారణం కాలేజీల యాజమాన్యాలు కాదు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జారీచేసిన తహసీల్దార్లే కారణం. ప్రభుత్వం వారిని కూడా బాధ్యులను చేయాలి" అని రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. సిబ్బందికి జీతాలు కూడా ఇచ్చుకోలేని దుస్థితిలో విద్యా సంస్థల యాజమాన్యాలు ఉన్నాయని.. అలాంటి పరిస్థితుల్లో నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక రెండేళ్ల పాటు ఎలాంటి ఒత్తిడీ చేయకుండా ఓపిక పట్టామని చెప్పారు. కాలేజీల యాజమాన్యాలకు ఇది జీవన్మరణ సమస్య అని, అన్నింటికీ సిద్ధమయ్యే సమ్మెకు దిగామని పేర్కొన్నారు. గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన రూ.1,500 కోట్లు నిధుల విడుదల, ఫాతీ ప్రతినిధులతో కమిటీ, సీఎంతో సమావేశం ఏర్పాటు మూడు హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. మొత్తం రూ.10వేల కోట్ల బకాయిల్లో కనీసం సగం మేర రూ. 5వేల కోట్లు విడుదల చేశాకే ప్రభుత్వంతో చర్చలు ఉంటాయని, అప్పటివరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8న 30వేల మంది సిబ్బందితో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహిస్తామని.. ఈ నెల 11న 10లక్షల మంది విద్యార్థులతో భారీ ఆందోళన చేపడతామని రమేశ్‌బాబు తెలిపారు. ఇక ఫాతీ ఉపాధ్యక్షుడు అలీజాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది విద్యారంగానికి కేటాయించిన రూ.23,700 కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ఎక్కడ ఖర్చు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.


కరీంనగర్‌లో నిరసన తెలుపుతున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు

జేఎన్టీయూ స్పాట్ అడ్మిషన్లపై 'ఫీజు' ఎఫెక్ట్!

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ)లో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియపై ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభావం కనిపించింది. వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఖాళీగా ఉన్న 112కుపైగా పీజీ సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులు పెద్ద సంఖ్యలోనే వచ్చినా.. శనివారం ఏడు, సోమవారం మరో ఏడు సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. పీజీఈసెట్ నిబంధనల ప్రకారం.. ఎంటెక్ స్పాట్ అడ్మిషన్ల కోసం అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, అలా లేని వారికి సీట్లు కేటాయించేందుకు వీలు కాలేదని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదంటూ కాలేజీలు తమకు బీటెక్ సర్టిఫికెట్లను ఇవ్వలేదని అభ్యర్థులు వాపోయారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు కానిస్టేబుల్ బలి

» రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య
» వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సూసైడ్ నోట్

సంగారెడ్డి క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికట్టాల్సిన కానిస్టేబుల్ తానే ఆ వ్యసనం బారిన పడ్డాడు. రూ.లక్షల్లో ఆడి నష్టపోయాడు. చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. వాటిని తీర్చలేక.. అప్పులిచ్చిన వాళ్ల ఒత్తిడి తట్టుకోలేక చావే దిక్కనుకున్నాడు. రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంగారెడ్డిలో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మండల కేంద్రమైన కల్హేర్‌కు చెందిన కొటారి సందీప్‌కుమార్ (25) సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. 2024 బ్యాచ్‌కు చెందిన సందీప్‌కుమార్ కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. బంధువులు, స్నేహితులవద్ద రూ.లక్షల్లో అప్పులు చేశాడు. బాకీ తీర్చమని తీవ్ర వత్తిడి రావడంతో భరించలేక పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి సాయిలు పదిహేనేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు, తల్లి, చెల్లి ఉన్నారు. సందీప్‌కు ఇంకా వివాహం కాలేదు. సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మా.. చెల్లీ నన్ను క్షమించండి

మా అమ్మను, చెల్లిని ఎవరూ ఏమీ అనకండి.. ప్లీజ్ నేను ఉన్నన్ని రోజులు వాళ్లకు నరకం చూపించా... నేను ఇంకా ఉంటే వాళ్లు బాధ పడుతూనే ఉంటారు.. సారీ అమ్మా... చెల్లీ.. అంటూ సందీప్‌కుమార్ వాట్సాప్‌లో సూసైడ్ నోట్ రాశాడు. ఈ పోస్టు పెట్టేందుకే సోమవారం సందీప్‌కుమార్ వెల్‌విషర్స్ పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు.

ఆ రివాల్వర్ ఎక్కడిది?

అతను ఆత్మహత్యకు ఉపయోగించిన రివాల్వర్ ఎక్కడిదనేది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసు స్టేషన్‌లోని బ్యారక్ స్టోర్ నుంచి ఎవరికీ తెలియకుండా తీసుకొచ్చాడా? విధుల్లో ఉండగా ఉన్నతాధికారులు అప్పగించినదా? అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నీటి మధ్యే 10 రోజులు సావాసం

» నల్లగొండ జిల్లా డిండి వాగులో చిక్కుకున్న గొర్రెల కాపర్లు
» డ్రోన్‌తో నిత్యావసర సరుకులు అందజేసిన అధికారులు

డిండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వారు ముగ్గురు గొర్రెల కాపరులు.. నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి వాసులు బద్దెల వెంకటయ్య, రగడంపల్లి పెద్దయ్య, సిగ వెంకటయ్య 10 రోజుల క్రితం 300 గొర్రెలు, మేకలను మేపుకు రావడానికి అడవికెళ్లారు. కానీ, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో డిండి (దుందుభి) వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంలో దాని మధ్యలో ఉన్న మట్టి దిబ్బపై చిక్కుకుపోయారు. చుట్టూ వరద నీరు ప్రవహిస్తుండటంతో ఎటూ వెళ్లలేక అక్కడే ఉండిపోయిన ముగ్గురు జీవాల కాపర్లు తమ వెంట తీసుకెళ్లిన నిత్యావసర సరుకులు అయిపోవడంతో గ్రామస్తులు డిండి తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు. గొర్రెల కాపరుల పరిస్థితిని తెలుసుకున్న దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ తదితరులు సోమవారం డిండి వాగు దగ్గరకు చేరుకున్నారు. డ్రోన్ సాయంతో గొర్రెల కాపర్లకు నిత్యావసర సరుకులు పంపారు.


నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్న డ్రోన్

పత్తి సేకరణకు ఇన్ని ఆంక్షలా?

» ఎకరానికి 7క్వింటాళ్ల పరిమితి సరికాదు
» సీసీఐ వ్యవహారంపై తుమ్మల ఆగ్రహం, కేంద్రానికి లేఖ
» జిన్నింగ్ మిల్లుల వద్ద రైతుల ఆందోళన
» 6 నుంచి పత్తి కొనుగోళ్లు బంద్ : మిల్లర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): కేంద్ర ప్రభుత్వ విధానాలు, సీసీఐ నిబంధనలు పత్తి రైతులను గోస పెడుతున్నాయని, తేమశాతం, ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితి, కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్‌తో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇతర అధికారులతో పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ రైతులకు ఇబ్బందిగా మారిందని అన్నారు. తేమ శాతం 8-12 శాతం పెట్టడం, వర్షాలతో తేమ శాతం పెరగటంతో సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకునే పరిస్థితి లేదని, తద్వారా కనీస మద్దతు ధర రావడం లేదని తుమ్మల ఆందోళన వ్యక్తంచేశారు. ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని సీసీఐ నుంచి రాష్ట్రానికి వచ్చిన లేఖపై స్పందించిన మంత్రి కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఎలాంటి పరిమితి లేకుండా రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలను ఎత్తివేయాలని లేఖలో పేర్కొన్నారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని కూడా లేఖలో పేర్కొన్నారు. కాగా, సీసీఐ అధికారులు కఠిన నిబంధనలు విధించడంపై సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మంత్రి తుమ్మలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. అలాగే మాజీమంత్రి జోగు రామన్న రైతులతో కలిసి సీసీఐ జిల్లా మేనేజర్‌కు వినతి పత్రాన్ని అం దజేశారు. అలాగే పలుచోట్ల పత్తి రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద సోమవారం ఆందోళనలు చేపట్టారు. తాండూరులోని ఓంకార్ కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగారు. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని తిప్రాస్‌పల్లి వద్ద విజయ్ కాటన్ ఇండస్ట్రీస్ ముందు రాస్తారోకో చేపట్టారు. గద్వాల జిల్లా ఉండవల్లిలోని వరసిద్ధి వినాయక కాటన్‌మిల్లు ఎదుట జాతీయ రహదారిపై పత్తి రైతులు రాస్తారోకో చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయిపల్లి శివారులోని బాలాజీ ఇండస్ట్రీ మిల్లు ముందు, రాయిచూర్ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి రైతులు చిన్నఅడిశర్లపల్లి సమీపంలో కోదాడ-జడ్చర్ల 167వ జాతీయ రహదారిపై సోమవారం ధర్నాకు దిగారు. కాగా, రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను ఈ నెల 6 నుంచి నిలిపివేస్తున్నట్లు తెలంగాణ కాటన్(మిల్లర్స్ అండ్ ట్రేడర్స్) అసోసియేషన్ ప్రకటించింది. మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తెలిపారు.

నువ్వొద్దని సీఎంకు చెప్పా..
వేరే శాఖ చూసుకో..

» బాధ్యతలు చేపట్టేముందు కలిసిన అధికారితో మంత్రి
» ఊహించని వ్యతిరేకతతో వెనుదిరిగిన అధికారి

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'నువ్వు నా శాఖలో పనిచేయలేవు.. ఆ పోస్టులో జాయిన్ కావొద్దు.. వేరే శాఖ చూసుకో.. కావాలంటే సాయం చేస్తా'.. అంటూ ఓ అధికారితో మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. సర్కారు ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టబోయే ముందు సోమవారం మర్యాదపూర్వకంగా ఆయనను కలవడానికి వెళ్లిన అధికారికి ఎదురైన చేదు అనుభవమిది. సాక్షాత్తు ప్రభుత్వ ఉత్తర్వులను అదే సర్కారులో భాగమైన మంత్రి ఏకపక్షంగా అడ్డుకోవడం తీవ్ర చర్చకు దారితీసింది.

ఉన్నతాధికారులు చేరాలని సూచించినా..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల 31న 8మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడంతో పాటు కొందరికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు మహారాష్ట్ర సరిహద్దులోని ఓ జిల్లాలో పని చేస్తున్న అధికారిని బదిలీ చేస్తూ.. కీలకమైన శాఖ బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన విధుల్లో చేరాల్సి ఉంది. అంతకుముందు సంబంధిత మంత్రిని మర్యాదపూర్వకంగా కలవడానికి వెళ్లిన ఆయనకు ఊహించని పరిణామం ఎదురైంది. 'నువ్వు ఈ శాఖలో పనిచేయలేవు.. వేరేది చూసుకో' అని మంత్రి అడ్డుకున్నట్లు సమాచారం. అయినప్పటికీ ఉన్నతాధికారులు ఆయనను జాయిన్ కావాలని సూచించినా.. ఆ శాఖ మంత్రికే ఇష్టం లేనప్పుడు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ఆయన విధుల్లో చేరలేదు.

సర్కారును ధిక్కరించడమేనా?

ఈ అధికారిని నియమించేటపుడు సర్కారు మంత్రి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదా? ఆదేశాలు ఎలా ఉన్నా తన మాట చెల్లాల్సిందేనని అమాత్యుడు భావిస్తున్నారా? తుదకు ఈ వైఖరి ప్రభుత్వాన్ని ధిక్కరించడమే అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి తన నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి 'నేను సీఎంకు చెప్పా' అనే పదాన్ని ఉపయోగించినట్లు తెలిసింది. వాస్తవానికి సీఎంకు అభ్యంతరముంటే.. ఆ అధికారికి నియామక ఉత్తర్వులు వచ్చేవే కావు. బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్న ఉన్నతాధికారిని.. అదీ మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంలో జాయిన్ కావొద్దని హుకుం జారీ చేయడంతో ఆ మంత్రిపై అధికారవర్గాల్లో తీవ్రచర్చకు దారి తీసింది.

వెళ్లిపోతానని ఆరేడు నెలలుగా కోరుతున్నా..

ప్రస్తుతం అదే శాఖలో కొనసాగుతున్న అధికారి మాతృశాఖకు వెళ్లేందుకు ఆరేడు నెలలుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పలుమార్లు మంత్రిని కూడా అభ్యర్థించినట్లు తెలిసింది. తన స్థానంలో కొత్త అధికారికి బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంతలో ఆయన రావడం లేదని తెలిసి సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేశారు. ఈ పోస్టులో కొనసాగడానికి నలుగురైదుగురు పోటీపడుతుండగా.. మంత్రి ఆశించిన వ్యక్తికి దక్కకపోవడం వల్లే ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారనే ప్రచారం జరుగుతోంది.

ఫారం-సి
నోటిఫికేషన్
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద, సెక్షన్ 10ఎ మినహాయింపు ననుసరించి)
(రూల్ 6/12 చూడుము)
తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్: ఇ/2580/2025 తేది : 03.11.2025
సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్: బి/5456/2025 తేది : 03.11.2025
గెజిట్ నంబర్: వికెబి - 39/2025 తేది : 03.11.2025

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా వికారాబాద్ జిల్లాలో దుద్యాల్ మండలం హకీంపేట గ్రామం పరిధిలో మొత్తం ఎకరము 32.21 గుంటలు భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ వికారాబాద్ వారు భావించుచున్నారు.

తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలు & వాణిజ్యం (IP & INF) శాఖ TGIIC ద్వారా పారిశ్రామిక వాడ ఏర్పాటు కొరకు భూసేకరణ, పునరావాసం మరియు పునస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం 2013 యొక్క అధ్యాయం II మరియు III క్రింద ఉన్న నిబంధనల నుండి చట్టంలోని అధ్యాయం IIIA లోని సెక్షన్ 10ఎ ప్రకారం మినహాయించడానికి నోటిఫికేషన్ జారీ చేసి తెలంగాణ రాష్ట్ర గెజిట్ నెం. 186-ఎ, తేది: 29.10.2025లో ముద్రించబడింది. అందువల్ల ఆ చట్టంలోని II & III అధ్యాయాల క్రింద ఉన్న అన్ని కార్యకలాపాలు నిర్వహించబడలేదు. బాధిత కుటుంబాల పునరావాసం మరియు పునస్థాపన కోసం వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిర్వాహకుడిగా నియమితులయ్యారు.

అందువలన పైన తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు వికారాబాద్ జిల్లా, దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామ పరిధిలో మొత్తం ఎకరము 32.21 గుంటలు విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

గ్రామము: హకీంపేట మండలం: దుద్యాల్ జిల్లా: వికారాబాద్

క్ర.సం.	సర్వే నెం.	భూ స్వభావం	భూ వర్గీకరణ	సేకరించవలసిన విస్తీర్ణం (ఎకరాలు-గుంటలు)	పట్టాదారుని పేరు	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	బావులు: రకము	సంఖ్య	కట్టడాలు: రకము	ఇతర వివరాలు
1	195/అ1	పట్టా	మెట్ట	0.08	గడిగె బాల్‌రాజ్ తండ్రి బాలప్ప	స.నం. 205& 196	స.నం. 193& 199	స.నం. 196	స.నం. 193, 194 & 206	-	-	-	-
2	195ఆ	పట్టా	మెట్ట	0.11	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 205& 196	స.నం. 193& 199	స.నం. 196	స.నం. 193, 194 & 206	-	-	-	-
3	195ఇ	పట్టా	మెట్ట	0.20	వీరభద్రప్ప తండ్రి మాణిక్యప్ప	స.నం. 205& 196	స.నం. 193& 199	స.నం. 196	స.నం. 193, 194 & 206	-	-	-	-
4	195ఈ	పట్టా	మెట్ట	0.19	శంకరమ్మ భర్త బాలప్ప	స.నం. 205& 196	స.నం. 193& 199	స.నం. 196	స.నం. 193, 194 & 206	-	-	-	-
5	195ఉ	పట్టా	మెట్ట	0.19	గడిగె సుశీలమ్మ భర్త బాలప్ప	స.నం. 205& 196	స.నం. 193& 199	స.నం. 196	స.నం. 193, 194 & 206	-	-	-	-
6	196/అ2	పట్టా	మెట్ట	0.07	గడిగె బాల్‌రాజ్ తండ్రి బాలప్ప	స.నం. 197& 204	స.నం. 195& 199	స.నం. 197& 199	స.నం. 195	-	-	-	-
7	196ఆ	పట్టా	మెట్ట	0.08	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 197& 204	స.నం. 195& 199	స.నం. 197& 199	స.నం. 195	-	-	-	-
8	196ఇ	పట్టా	మెట్ట	0.15	వీరభద్రప్ప తండ్రి మాణిక్యప్ప	స.నం. 197& 204	స.నం. 195& 199	స.నం. 197& 199	స.నం. 195	-	-	-	-
9	196ఈ	పట్టా	మెట్ట	0.15	శంకరమ్మ తండ్రి బాలప్ప	స.నం. 197& 204	స.నం. 195& 199	స.నం. 197& 199	స.నం. 195	-	-	-	-
10	196ఉ	పట్టా	మెట్ట	0.15	గడిగె సుశీలమ్మ భర్త బాలప్ప	స.నం. 197& 204	స.నం. 195& 199	స.నం. 197& 199	స.నం. 195	-	-	-	-
11	197	పట్టా	మెట్ట	1.15	దొడ్డి ఇబ్రాములు తండ్రి ఎల్లప్ప	స.నం. 201	స.నం. 199	స.నం. 198	స.నం. 196	-	-	-	-
12	198	పట్టా	మెట్ట	1.19	దొడ్డి ఇబ్రాములు తండ్రి ఎల్లప్ప	స.నం. 201	స.నం. 199	స.నం. 200	స.నం. 197	-	-	-	-
13	199అ/1	పట్టా	మెట్ట	1.20	దొడ్డి ఇబ్రాములు తండ్రి ఎల్లప్ప	స.నం. 198	స.నం. 252	స.నం. 200	స.నం. 195, 196 &197	-	-	-	-
14	199అ/2	పట్టా	మెట్ట	0.10	సద్ది ఆశోక్‌రాజు తండ్రి శంకరయ్య	స.నం. 198	స.నం. 252	స.నం. 200	స.నం. 195, 196 &197	-	-	-	-
15	199ఆ	పట్టా	మెట్ట	0.35	శంకరమ్మ తండ్రి బాలప్ప	స.నం. 198	స.నం. 252	స.నం. 200	స.నం. 195, 196 &197	-	-	-	-
16	199ఇ	పట్టా	మెట్ట	0.35	గడిగె సుశీలమ్మ భర్త బాలప్ప	స.నం. 198	స.నం. 252	స.నం. 200	స.నం. 195, 196 &197	-	-	-	-
17	200/అ/1	పట్టా	మెట్ట	5.27	వీరభద్రప్ప తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 252	స.నం. 252	స.నం. 198, 199 &201	-	-	-	-
18	200/అ/2	పట్టా	మెట్ట	0.05	శ్యామ విశ్వేశ్వర్ తండ్రి పర్వయ్య	స.నం. 252	స.నం. 252	స.నం. 252	స.నం. 198, 199 &201	-	-	-	-
19	200/ఆ	పట్టా	మెట్ట	5.32	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 252	స.నం. 252	స.నం. 198, 199 &201	-	-	-	-
20	201/అ	పట్టా	మెట్ట	1.05	శంకరమ్మ భర్త బాలప్ప	స.నం. 200 & 202	స.నం. 197& 198	స.నం. 200	స.నం. 204	-	-	-	-
21	201/ఆ	పట్టా	మెట్ట	1.20	గడిగె సుశీలమ్మ భర్త బాలప్ప	స.నం. 200 & 202	స.నం. 197& 198	స.నం. 200	స.నం. 204	-	-	-	-
22	201/ఇ	పట్టా	మెట్ట	0.15	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 200 & 202	స.నం. 197& 198	స.నం. 200	స.నం. 204	-	-	-	-
23	202/అ	పట్టా	మెట్ట	0.20	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
24	202/ఆ	పట్టా	మెట్ట	0.20	వీరభద్రప్ప తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
25	202ఇ/1/1/1/1/1	పట్టా	మెట్ట	0.07	ఏదుల అంజయ్య తండ్రి హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
26	202ఇ/1/1/1/1/2	పట్టా	మెట్ట	0.07	ఏదుల చంద్రయ్య తండ్రి హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
27	202ఇ/1/1/1/2	పట్టా	మెట్ట	0.07	ఏ. లక్ష్మీనారాయణ తండ్రి హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
28	202ఇ/1/1/2	పట్టా	మెట్ట	0.07	ఏ. రమేష్ తండ్రి హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
29	202ఇ/1/2	పట్టా	మెట్ట	0.07	ఏ. వెంకటేశం తండ్రి హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
30	202/ఈ/1/2	పట్టా	మెట్ట	0.09	ఏదుల రాములు తండ్రి హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
31	202/ఈ/2	పట్టా	మెట్ట	0.07	ఏదుల కృష్ణ తండ్రి పెద్ద హన్మయ్య	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
32	202ఉ	పట్టా	మెట్ట	0.04	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
33	202ఊ	పట్టా	మెట్ట	0.04	వీరభద్రప్ప తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 201	స.నం. 200	స.నం. 203	-	-	-	-
34	203	పట్టా	మెట్ట	2.01	మల్లికార్జున్ తండ్రి మాణిక్యప్ప	స.నం. 252	స.నం. 204	స.నం. 202	స.నం. 207	-	-	-	-
35	204	పట్టా	మెట్ట	2.13	వీరభద్రప్ప తండ్రి మాణిక్యప్ప	స.నం. 203	స.నం. 196	స.నం. 201	స.నం. 205&206	-	-	-	-
36	205/1	పట్టా	మెట్ట	0.13	ఇ. వెంకట్రాములు తండ్రి సాయప్ప	స.నం. 206	స.నం. 195	స.నం. 204	స.నం. 206	-	-	-	-
37	205/2	పట్టా	మెట్ట	0.13	కమ్మరి శేఖర్ తండ్రి సాయప్ప	స.నం. 206	స.నం. 195	స.నం. 204	స.నం. 206	-	-	-	-
38	205/3	పట్టా	మెట్ట	0.14	కమ్మరి కాశప్ప తండ్రి సాయప్ప	స.నం. 206	స.నం. 195	స.నం. 204	స.నం. 206	-	-	-	-
39	205/4	పట్టా	మెట్ట	0.13	కమ్మరి మోనయ్య తండ్రి సాయప్ప	స.నం. 206	స.నం. 195	స.నం. 204	స.నం. 206	-	-	-	-
మొత్తం విస్తీర్ణం ఎ-గుంటలు				32.21									

ఈ ప్రకటన భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు నష్టపరిహారం పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహారం పొందే హక్కు చట్టం, 2013 (చట్టం నెం. 30/2013) లోని సెక్షన్ 11(1) లోని నిబంధనల క్రింద సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయుటకు జారీ చేయబడినది.

భూమి ప్లాన్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయం, వికారాబాద్/సబ్ కలెక్టర్ కార్యాలయం, తాండూర్ డివిజన్, వికారాబాద్ జిల్లాలో ఏ పని రోజునైనా కార్యాలయ పనివేళలో తనిఖీ చేసుకోవచ్చును. ఏ భూమిలోనైనా ప్రవేశించి, భూమిని సర్వే చేసి, లెవెల్స్ తెలుసుకునేందుకు, సబ్ సాయిల్‌లోకి త్రవ్వేందుకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టంలోని సెక్షన్ 12లో ఏర్పాటు చేసిన మరియు నిర్దేశించిన ప్రకారం వారి పని తగు విధంగా నిర్వహించేందుకు అవసరమగు అన్ని ఇతర చర్యలు తీసుకునేందుకు సబ్ కలెక్టర్, తాండూర్ డివిజన్, వికారాబాద్ జిల్లా మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్- కమ్ - అప్రాప్రియేట్ గవర్నమెంట్ అధికారం ఇచ్చింది.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలుక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్ట్ పేజ్ నిర్మాణానికి అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గానీ లేదా ఉపయోగించుట చేయవలెను.

చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద కలెక్టర్ ఏ ఒక్క ముందస్తు ఆమోదం లేకుండా ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి ఏ వ్యక్తి అట్టి భూమిపైన ఎటువంటి వ్యవహారం అంటే అమ్మకం / కొనుగోలు మొదలగునవి చేయరాదు. లేదా అట్టి భూమిపై ఎటువంటి రుణబారాలు కల్పించరాదు.

భూసేకరణకు అభ్యంతరాలు ఏవైనా ఉంటే మరియు నష్టపరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ప్రయోజనం గల/ ప్రభావానికి గురైన వ్యక్తులందరి నుండి క్లెయిమ్‌ను చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజులలోగా ప్రయోజనం గల వ్యక్తులు జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో దాఖలు చేయవచ్చును.

సం/-	సం/-	సం/-	సం/-
తహశీల్దార్ దుద్యాల్ మండలం	సబ్ కలెక్టర్/ భూసేకరణ అధికారి, తాండూర్ డివిజన్	అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వికారాబాద్ జిల్లా	జిల్లా కలెక్టర్ వికారాబాద్ జిల్లా

DIPR RO.NO:796/LA-PP/ADVT/AGENCY/2025-26

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

క్రికెట్‌లో కొత్త అధ్యాయం


నలభై రెండు సంవత్సరాల క్రితం చరిత్రాత్మక లార్డ్స్ మైదానంలో చోటు చేసుకున్న మహాద్భుతం యావత్ భారత క్రికెట్ రంగం స్థితిగతులనే మార్చివేసింది. 1983 ప్రపంచ కప్ పోటీల్లో అనామక జట్టుగా అడుగుపెట్టిన కపిల్ దేవ్ సారథ్యంలోని టీమిండియా అంతిమ సమరంలో దిగ్గజ ఆటగాళ్లున్న వెస్టిండీస్ జట్టును ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. మహిళల క్రికెట్‌లోనూ ఇలాంటి మరపురాని ఘట్టం కోసం ఎదురుచూసిన భారతీయుల స్వప్నం ఇప్పుడు సాకారమైంది. క్రీడా మైదానంలో మన అమ్మాయిలు విజయనాదం చేశారు. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళల వన్డే ప్రపంచకప్‌లో చాంపియన్లుగా నిలిచారు. ఈ విజయం భారత మహిళా క్రికెట్‌లో ఒక గొప్ప అధ్యాయానికి నాంది కానున్నది.

వన్డే ప్రపంచ కప్‌లో గతంలో రెండు పర్యాయాలు తుది మెట్టుపై పరాజితులుగా మిగిలి వేదనను అనుభవించిన భారత మహిళల జట్టు మూడో ప్రయత్నంలో ఫలితాన్ని రాబట్టి అందరి కళ్లల్లోనూ ఆనందాన్ని నింపింది. ఈసారి జగజ్జేతగా నిలవడంలో సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు జట్టులోని సభ్యులంతా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు. గ్రూప్ దశ పోటీల్లో బ్యాట్‌తో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బంతితో దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్ అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో జెమీమా రోడ్రిగ్స్ ఛేదనలో వీరోచిత సెంచరీతో ఆకట్టుకుంటే, అసలైన తుదిపోరులో దక్షిణాఫ్రికాపై షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, ఆల్‌రౌండర్‌గా దీప్తి శర్మ ప్రతిభ భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టాయి. జట్టు విజయంలో కడప జిల్లాకు చెందిన బౌలర్ శ్రీచరణి రాణించడం తెలుగువారు గర్వించదగ్గ విశేషం. ఇంతటి అద్భుత ప్రదర్శన కనబరచిన జట్టు సభ్యుల్లో చాలామంది దిగువ మధ్యతరగతి స్థాయి నుంచి వచ్చినవారే. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్ స్థాయికి ఎదిగిన హర్మన్‌ప్రీత్, కార్పెంటర్ అయిన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలుపెట్టిన అమన్‌జోత్, మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక కష్టాలు ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కూతురు క్రాంతి గౌడ్...వారిలో కొందరు మాత్రమే. భారతీయుల ప్రపంచ కప్ కలను సాకారం చేసిన టీమిండియా క్రీడాకారిణుల వెనుక ఇలాంటి త్యాగాలు, పోరాటాలు, కన్నీళ్లకు కొదవే లేదు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా పట్టుదలతో జట్టుకోసం శ్రమించి ప్రపంచ క్రికెట్‌లో భారత జట్టును నిలబెట్టిన మన అమ్మాయిల ఆట ప్రశంసనీయం.

గతంలో సరైన ఆదరణకు నోచుకోని మహిళా క్రికెట్‌ను బీసీసీఐ తన చేతుల్లోకి తీసుకున్నాక వసతులు, పారితోషికాలు మెరుగయ్యాయి. పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని బీసీసీఐ ప్రవేశపెట్టడం మహిళా క్రికెట్‌లో ఓ ముందడుగు. పురుషుల ఇండియన్ ప్రీమియర్ లీగ్ తరహాలో మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టింది. ప్రతిభావంతులైన యువ క్రికెటర్లను వెలుగులోకి తీసుకొచ్చి వారు ఆర్థికంగా కుదురుకునేలా చేసింది. ఈ క్రమంలోనే మిథాలీ రాజ్, జులన్ గోస్వామి లాంటి సీనియర్ల ప్రేరణతో నవతరం క్రీడాకారిణులు సత్తా చాటుతుండడంతో అమ్మాయిల క్రికెట్‌కు అభిమానులూ పెరిగారు. వారి మ్యాచ్‌లు వీక్షించేందుకు స్టేడియాలకు ప్రేక్షకులు పోటెత్తారు. ఈ ఉత్సాహంతో మన క్రికెటర్లు మరింత శ్రమించి ఐసీసీ ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వరుసగా రెండుసార్లు అండర్–19 జట్టు ప్రపంచ కప్పు నెగ్గడం, ఇప్పుడు సీనియర్ జట్టు ప్రపంచ చాంపియన్‌షిప్‌తో క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటుకోవడం.. మహిళల క్రికెట్‌లో భారత్ ఉజ్వల భవితకు తార్కాణాలు.

ప్రోత్సాహం ఉండాలే కానీ, అద్భుతమైన విజయాలు అందించగలమని కొన్నాళ్లుగా మన అమ్మాయిలు నిరూపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఖో ఖో ప్రపంచ కప్‌లో పురుషులతో పాటు భారత మహిళల జట్టు విజేతగా నిలిచింది. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో షూటర్ మనూ భాకర్ రెండు పతకాలతో విశ్వవేదికపై సత్తా చాటింది. లండన్ విశ్వక్రీడల్లో బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ కాంస్యం, టోక్యోలో వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రజతం, బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ కాంస్యం, బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు వరుస ఒలింపిక్స్‌ల్లో రజత, కాంస్య పతకాలు, ప్రపంచ చెస్ యవనికపై కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్, వైశాలి మెరుపులు.. ఇలా, ఆట ఏదైనా విశ్వ క్రీడావనిలో తమదైన ప్రతిభాప్రదర్శనతో అబ్బురపరుస్తుండడం భారత నారీ శక్తి ప్రభంజనానికి నిదర్శనం. ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందని గురజాడ అన్నారు. మహిళాక్రికెటర్లు క్రికెట్‌క్రీడ భావిచరిత్రను నిర్ణయాత్మకంగా తీర్చిదిద్దుతారని ఆశించడంలో తప్పులేదు.

జొహ్రాన్.. మీరా.. మమ్దానీ.. సంస్కృతీ మథనం!




■ రాహుల్ కుమార్

"సంస్కృతి అనే పదాన్ని నేను విన్నప్పుడు నా పిస్టల్‌ను పేల్చటానికి సిద్ధంచేస్తాను" ఒక నాజీ రచయిత రాసిన నాటకంలో ఒక సైనికుడు అన్న మాటలవి. 1930ల నాటి జర్మనీలో నెలకొంటున్న పరిస్థితులను ఆ మాటలు కళ్లకుకడతాయి. సంస్కృతి అంటే సంప్రదాయాలూ, విశ్వాసాలూ అలవాట్లూ, పండుగలూ, నోములూ, ధర్మాధర్మ ఆలోచనలూ, ఇహలోక–పరలోక చింతనలుగా ఆ రచయిత భావించలేదు. అసలు అట్లాంటి సంస్కృతితో నాజీలకు ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ 1930ల నాటికి సంస్కృతికి ఆ అర్థం మారింది. పరిధి విస్తృతమైంది. భిన్న భావాలు సంఘర్షించే క్షేత్రంగా, హేతుబద్ధ ఆలోచనలకు వేదికగా, ప్రజాస్వామ్య చింతనకు కేంద్రంగా, సమానత్వ భావనకు స్ఫూర్తినిచ్చే ఇంధనంగా సంస్కృతి ఉండాలనే భావన ఆలోచనాపరుల్లో అప్పటికే బలపడింది. అట్లాంటి సంస్కృతి గురించి మాట్లాడినా, కోరుకున్నా వేళ్లు పిస్టల్ ట్రిగ్గర్ మీదకు వెళ్లే విధంగా నాజీలు పాలించారు.

ఇప్పుడు అటువంటి భయానక పరిస్థితుల్లేవు. కానీ వాటి ఛాయలూ, ధోరణులూ చాలా చోట్ల కనపడుతున్నాయి. భావప్రకటనా స్వేచ్ఛకు తిరుగులేదనుకునే అమెరికా కూడా వీటి ప్రభావానికి లోనవుతోంది. విశ్వవిద్యాలయాల్లో భావాలపై నిఘాలు పెరుగుతున్నాయి. సోషల్‌మీడియాలో భిన్నాభిప్రాయాలు ప్రకటించే వారి జాబితాలు తయారవుతున్నాయి. ఇజ్రాయెల్ విమర్శకులకు విద్యాలయాల్లో సీట్లు ఇవ్వకూడదనే ఆదేశాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతను కట్టడిచేయలేని విద్యాసంస్థలకు నిధులు నిలిపేసే చర్యలూ మొదలయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకాస్త ముందుకు వెళ్లి తనతో తీవ్రంగా విభేదించే వారందరినీ వామపక్షవాద పిచ్చివాళ్లుగా ముద్ర వేస్తున్నారు. న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థిగా పోటీచేస్తున్న భారత సంతతికి చెందిన జొహ్రాన్ మమ్దానీకీ ఈ శాపనార్థాలు తప్పలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో 34 ఏళ్ల జొహ్రాన్ న్యూయార్క్ ఎన్నికల్లో గెలిస్తే అమెరికాలో అదొక మేలిమలుపు అవుతుంది! మరికొన్ని గంటల్లో అక్కడ పోలింగ్ మొదలవుతుంది. ఫలితం ఎలా ఉన్నా జొహ్రాన్ మాత్రం ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా ఎదురొడ్డి నిలబడ్డారు. తమ శ్రమతో, నైపుణ్యంతో, ఆలోచనలతో అమెరికా గడ్డను సుసంపన్నంచేసే వారందరికీ సమానావకాశాలు ఉండాలనీ, సమానహక్కులు దక్కాలనీ, సంపద వికేంద్రీకరణ జరగాలన్న వాదనతో ప్రచారం చేశారు. డెమొక్రాటిక్ సోషలిస్టుగా చెప్పుకొనే జొహ్రాన్ ఎన్నడూ తన భావాలనూ దాచుకోలేదు. బహుశా తల్లిదండ్రుల ప్రభావం జొహ్రాన్ మీద గాఢంగా ఉండివుండొచ్చు.

> రాజకీయ ప్రమేయాలూ ప్రసక్తీ లేకుండా ఒక మతమంతా, ఒక సంస్కృతి అంతా నిరంకుశానికి అనుకూలమనీ, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమనీ, ఆధునిక జీవితానికి అడ్డంకి అనీ సూత్రీకరణలు చేయటం నిర్హేతుకం. సంస్కృతుల మధ్య సంఘర్షణగా రాజకీయాలనూ, రాజ్యవ్యవస్థలనూ చూడటం అవివేకం అవుతుంది. సంస్కృతిని జడపదార్థంగా పరిగణించటమూ, అవసరాలకు అనుగుణంగా మారలేని అశక్తతలోకి ఒక మతం కూరుకుపోయిందని భావించటమూ మనుషుల మధ్యా, సమూహాల మధ్యా పూడ్చలేని అగాధాన్నే సృష్టిస్తుంది. అదే ఈనాటి అసలైన ముప్పు.

ప్రముఖ దర్శకురాలు మీరానాయర్, ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీ.. జొహ్రాన్‌కు తల్లిదండ్రులు. సలాంబాంబే, మిసిసిపీ మసాలా, కామసూత్ర, మాన్‌సూన్ వెడ్డింగ్ లాంటి సినిమాలకు మీరా దర్శకత్వం వహించారు. భారతీయ సినిమాకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకుని రావటంలో మీరా పాత్రను విస్మరించలేం. మనల్ని మానవసంబంధాల లోతుల్లోకి తీసుకువెళ్లటమే కాదు.. భిన్న సంస్కృతుల కలయికనూ, దుర్భర పరిస్థితుల్లోనూ మనుషుల్లో తన్నుకుని వచ్చే ఆత్మస్థైర్యాన్నీ, సంప్రదాయ, పాశ్చాత్య ప్రభావాల పరస్పర రాపిడిలో ఎదురయ్యే జీవన సంఘర్షణలనూ మీరా నాయర్ అద్భుతంగా చిత్రీకరించారు. మనుషుల జీవితాల్లోని వ్యక్తావ్యక్త అంశాలపై, అనుభూతులపై, ఆకాంక్షలపై, ఆరాటాలపై, అమానవీయాలపై, అసాంఘిక ప్రవృత్తులపై, పథభ్రష్టత్వాలపై ఎంతోకొంత వెలుతురు ప్రసరింపచేసి, మనలో సహానుభూతినీ, సానుభూతినీ, విశాలతనూ, విచారాన్నీ, అంతర్గత మథనాన్నీ పెంచటమే కళ పరమార్థం అనుకుంటే దానికి మీరానాయర్ ఖచ్చితంగా తోడ్పడ్డారు.

ఇక మహమూద్ మమ్దానీ అయితే మనం ప్రపంచ రాజకీయాలను చూసే తీరుని మార్చివేయటంలో కీలక పాత్రను పోషించారు. బిన్‌లాడెన్ నేతృత్వంలోని ఇస్లామిక్ తీవ్రవాదులు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలను విమానాలతో ఢీకొట్టించి (11–09–2001) వేలమందిని చంపివేసిన తర్వాత.. అమెరికా నుంచి ఆరంభమైన ఉధృత ప్రచారం సంస్కృతులూ, మతాల మధ్య అసంబద్ధ చీలికను తెచ్చింది. ఇస్లాం సంస్కృతిలోనే తీవ్రవాదాన్నీ, నిరంకుశత్వాన్నీ పెంచిపోషించే తత్వం ఉందనీ.. ఆధునిక జీవనాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ పరిరక్షించుకోటానికి ఆ సంస్కృతితో యుద్ధంచేయక తప్పదనే భావాలకు విపరీత ప్రాచుర్యం లభిస్తున్న నేపథ్యంలో మహమూద్ మమ్దానీ 2005లో ప్రభావవంతమైన పుస్తకాన్ని రాశారు. దాని పేరు మంచి ముస్లిం–చెడ్డ ముస్లిం (గుడ్ ముస్లిం, బ్యాడ్ ముస్లిం). ఆ పుస్తకం కలగచేసిన ప్రభావం అంతా ఇంతా కాదు. అమెరికా ప్రయోజనాలను సమర్థించే వారిని మంచి ముస్లింలు గానూ, వ్యతిరేకించే వారందరినీ చెడ్డ ముస్లింలు గానూ వర్గీకరించటంలో ఉన్న ప్రమాదాన్ని ఎత్తిచూపటంతో పాటు అసలు ఇస్లామిక్ టెర్రరిజాన్ని పాలుపోసి పెంచింది అమెరికానేనని గట్టి ఆధారాలతో మమ్దానీ విశ్లేషించారు.

మనిషిలోని బలహీనతలను అధిగమించి ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించటానికి నిరంతర పోరాటం చేయాలని చెప్పే జిహాద్ మూల భావనను పెద్ద ఎత్తున రాజకీయాలకు అన్వయించి, రాజకీయ లక్ష్యాల సాధనకు ఉపయోగించటం ప్రచ్ఛన్నయుద్ధకాలంలో (కోల్డ్‌వార్) మొదలైందనీ, అందుకు కావాల్సిన సాధన సంపత్తిని సమకూర్చటంతోపాటు, అవసరమైన ప్రచారమూ అమెరికా సారథ్యంలోనే సాగిందనీ మమ్దానీ వివరించారు. ఏ దేశంలోనైనా ప్రభుత్వానికి కమ్యూనిజం పట్ల ఎంతో కొంత అనుకూలత ఉందన్న నిర్ధారణకు అమెరికాకు వస్తే.. అక్కడ సోవియట్ రష్యా ప్రభావం పెరిగే ప్రమాదం ఉందని అనిపిస్తే మతవాద శక్తులనూ, తెగల మధ్య ఉండే విభేదాలనూ రెచ్చగొట్టటం అనేక సందర్భాల్లో జరిగింది. లక్షల మంది ఆ చర్యలకు బలి అయ్యారు. వియత్నాం యుద్ధంలో (1975) అమెరికా ఓడిపోయిన తర్వాత ఆఫ్రికా, అమెరికా, ఆసియా ఖండాల్లో సాగించిన పరోక్ష యుద్ధాల్లో మతాన్నీ, తెగలనూ ఉసిగొల్పటం ఒక విధానంలా సాగింది. ఇరాన్‌లో 1953లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని సీఐఏ కూలగొట్టింది. ఈజిప్టు, సిరియా, ఇరాక్, అల్జీరియాల్లో లౌకిక, జాతీయవాద, సోషలిస్టు శక్తులు 1950–60ల్లో బలంగా ఉండేవి. వాటిని బలహీనపర్చటానికి ఇస్లామిక్ ఛాందస వర్గాలకు చేదోడుగా నిలిచింది. 1979లో ఇరాన్‌లో వచ్చిన విప్లవంతో నిర్ఘాంతపోయిన అమెరికా షియాల నుంచి సున్నీలకు ప్రమాదం ఉందనే ప్రచారాన్ని చాపకింద నీరులా వ్యాపింపచేసింది. నియంతృత్వ, వంశపారంపర్య ప్రభుత్వాలున్న సున్నీ దేశాల్లో ఇరాన్ విప్లవాన్ని బూచీగా చూపించి మతశక్తులు బలోపేతం కావటానికి తోడ్పడింది. ఇక ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా సేనల ప్రవేశంతో ఇస్లాం ప్రమాదంలో పడిందన్న నినాదంతో 'పవిత్రయుద్ధం' కోసమంటూ 40 ముస్లిందేశాల నుంచి దాదాపుగా లక్ష మందికి పైగా ముజాహిద్‌లను సమీకరించింది. వందల సంఖ్యలో మదర్సాలు ఏర్పాటు చేసింది. ప్రజాస్వామ్య స్థాపన నినాదంతో, బహుళపార్టీ రాజకీయ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యంతో జనాలను సమీకరించటం అమెరికాకు ఇష్టంలేదు. అలాంటి భావజాలం బలపడితే ముస్లిందేశాల్లో తిరుగుబాట్లు వస్తాయి. ప్రజాప్రాతినిధ్యంలేని సర్కార్లు కూలిపోతాయి. అమెరికా ఆధిపత్యానికి సవాళ్లు ఎదురవుతాయి. అందుకే తన రాజకీయ లక్ష్యాల కోసం మతశక్తులనూ సంకుచిత ప్రయోజనాలను కాంక్షించే తెగలనూ ప్రోత్సహించింది. మత్తుపదార్థాల కారిడార్లను ఏర్పరిచి టెర్రరిస్టు కార్యకలాపాల కోసం సీఐఏ నిధులు ఎలా సమీకరించిదన్న సమాచారాన్ని కూడా మమ్దానీ ఉదాహరణలతో పేర్కొన్నారు. 1985లో ముజాహిద్‌లలో కొందరిని ఏకంగా శ్వేతసౌధానికి ఆహ్వానించారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్‌రీగన్ చేసిన వ్యాఖ్యలను చూస్తే ముజాహిదీన్ పట్ల ఎలాంటి అభిప్రాయం ఉండేదో స్పష్టంగా తెలుస్తుంది. అమెరికా రాజ్య స్థాపక పితామహులకు ఉన్న నైతిక ఔన్నత్యం ముజాహిద్‌లకు ఉందని రీగన్ వ్యాఖ్యానించారు. ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించాల్సిందిగా మొదట సౌదీ పాలక కుటుంబాన్నే అమెరికా కోరింది. దాన్ని తిరస్కరించినప్పటికీ సౌదీ పాలకులూ సీఐఏ కలిసి సంయుక్తంగానే బిన్‌లాడెన్‌ను ఆఫ్ఘన్ పోరాటానికి ఎంపిక చేశాయి. మరోవైపు ముజాహిదీన్ శిక్షణా కేంద్రంగా మారిన పాకిస్తాన్‌లో ఐఎస్ఐ ఆధిపత్యం ప్రభుత్వంపై పెరిగిపోయింది. మతశక్తుల పట్టు పాక్ సమాజంపై ఎక్కువైంది. ఆఫ్ఘనిస్తాన్‌లో విజయం సాధించిన ముజాహిద్‌లు కశ్మీర్‌లో కూడా దాన్ని పునరావృతం చేయగలమన్న భరోసాతో అక్కడా కార్యకలాపాలను మొదలుపెట్టారు. 40దేశాల నుంచి ఆఫ్ఘాన్‌కు వచ్చిన ముజాహిద్‌లు తిరిగి తమ దేశాలకు వెళ్లి అలజడులు ఆరంభించారు. ఆయుధాలను ఇచ్చి, సంకుచితత్వంలో తర్ఫీదులిచ్చి, పవిత్రయుద్ధాలకు డాలర్లను పంచి.. ఆ తర్వాత అమెరికా చేతులు దులుపుకున్నా తీవ్రవాదం హఠాత్తుగా మాయమైపోలేదు. 1990ల తర్వాత జరిగిన పరిణామాలన్నీ దాన్నే చాటిచెబుతున్నాయి. తాను సృష్టించిన శక్తులే తనమాట వినని పరిస్థితి అమెరికాకు వచ్చింది. విధ్వంసక శక్తిగా లాడెన్ మారటమే అందుకు నిదర్శనం.

> ఇప్పుడున్న పరిస్థితుల్లో 34 ఏళ్ల జొహ్రాన్ న్యూయార్క్ ఎన్నికల్లో గెలిస్తే అమెరికాలో అదొక మేలిమలుపు అవుతుంది! మరికొన్ని గంటల్లో అక్కడ పోలింగ్ మొదలవుతుంది. ఫలితం ఎలా ఉన్నా జొహ్రాన్ మాత్రం ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా ఎదురొడ్డి నిలబడ్డారు.

ఇస్లాంపేరిట మతతత్వాన్ని నరనరాన ఎక్కించటం వెనుక రాజకీయం ఉంది. ఆధిపత్యాన్ని నిలుపుకోవాలన్న వ్యూహం ఉంది. ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టటం వెనుకా, లౌకిక లక్ష్యాలున్న రాజకీయ పార్టీలను బలహీనపరచటం వెనుకా సుదీర్ఘ చరిత్ర ఉంది. అందుకే రాజకీయ ప్రమేయాలూ ప్రసక్తీ లేకుండా ఒక మతమంతా, ఒక సంస్కృతి అంతా నిరంకుశానికి అనుకూలమనీ, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమనీ, ఆధునిక జీవితానికి అడ్డంకి అనీ సూత్రీకరణలు చేయటం నిర్హేతుకం. సంస్కృతుల మధ్య సంఘర్షణగా రాజకీయాలనూ, రాజ్యవ్యవస్థలనూ చూడటం అవివేకం అవుతుంది. సంస్కృతిని జడపదార్థంగా పరిగణించటమూ, అవసరాలకు అనుగుణంగా మారలేని అశక్తతలోకి ఒక మతం కూరుకుపోయిందని భావించటమూ మనుషుల మధ్యా సమూహాల మధ్యా పూడ్చలేని అగాధాన్నే సృష్టిస్తుంది. అదే ఈనాటి అసలైన ముప్పు. 2005లో మమ్దానీ చేసిన హెచ్చరిక ఈనాటి భారతావనికి నూటికి నూరుపాళ్లూ వర్తించే విధంగా మన రాజకీయాలు మారిపోతున్నాయి. ఇక్కడా సంస్కృతుల మధ్య అగాధాల సృష్టికి ప్రయత్నాలు తీవ్రంగా సాగుతున్నాయి. సంస్కృతుల మధ్య విభజన రేఖలను పెంచటమే కొందరికి పనిగా మారింది. ఘాతుకాలకు పాల్పడినవారూ, విష భావజాలాలను సృష్టించినవారూ చరిత్రను మరచిపోవాలని అనుకుంటారు. భవిష్యత్తులో ఇవి జరగకూడదని కోరుకునేవారే చరిత్రను నిరంతరం గుర్తు చేసుకుంటూ మానవీయ సమాజం కోసం తపనచెందుతారు. అమెరికా పాలకులకు చరిత్రమరపు ఎక్కువవ్వటంతోనే గతంలోని పాపాలపై ప్రాయశ్చిత్తం లేకుండా వ్యవహరిస్తున్నారన్నదే మమ్దానీ ఆవేదన!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఎల్ఐసీ పెట్టుబడులకు ఢోకా లేదు!

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గౌతమ్ అదానీ కంపెనీలో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టింది అంటూ అమెరికన్ పత్రిక వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన కథనం ఆధారంగా మన దేశ మీడియా ఎల్ఐసీ గురించి పలు అపోహలతో కూడిన ప్రచారాన్ని సాగిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో అయితే, అతిత్వరలో ఎల్ఐసీ మునిగిపోతుందని ప్రచారం జరిగింది. వాషింగ్టన్ పోస్టు కథనం వెలువడిన మరుక్షణమే ఆదానీ సంస్థలో జరిగిన పెట్టుబడుల గురించి ఎల్ఐసీ పత్రికా ప్రకటన జారీ చేసింది కానీ ఈ ప్రకటనలోని అంశాలన్నీ సంపూర్ణంగా మీడియా ప్రచారంలోకి తేలేదు. ఎల్ఐసీ చట్టం: 1938 సెక్షన్ 27ఎ ప్రకారం మొత్తం నిధులలో 85శాతం ప్రభుత్వ ఆమోదం ఉన్న (గవర్నమెంట్ అప్రూవ్డ్) సెక్యూరిటీలలోను బాండ్లలోను పెట్టే నిబంధన ఉన్నది. మిగతా 15శాతం నిధులను మార్కెట్ అనుకూలతలను బట్టి ఇతర మార్గాల్లో పెట్టుబడులుగా పెట్టే వెసులుబాటు ఉన్నది. ఎల్ఐసీ ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ ప్రైవేట్ కంపెనీలో పెట్టుబడులు పెట్టకూడదన్న నిబంధన ఏమీ లేదు. అయితే ఎల్ఐసీ పెట్టుబడులను నిర్దేశించడానికి సంస్థాగతంగా ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అజమాయిషీ ఉంటుంది. అన్ని నిర్ణయాలూ బోర్డ్ ఆమోదంతోనే జరుగుతాయి. నిర్ణయాలు పక్షపాతంతో జరిగినట్టు ఎప్పుడూ వెల్లడి కాలేదు. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది– స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన తర్వాత ఇప్పటివరకూ ఎల్ఐసీ నామమాత్రమైన నష్టాన్ని కూడా చవిచూడలేదు. దీనికి ప్రధాన కారణం ఎల్ఐసీ ఒక దీర్ఘకాలిక పెట్టుబడిదారు అయివుండటం. అంటే మార్కెట్లో ఎన్ని ఒడుదుడుకులు ఏర్పడినా సుదీర్ఘ కాలంలో పెరుగుదల తథ్యం.



ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడం ద్వారా ఏ కంపెనీకీ నిధులు బదిలీ చేయడం జరగదు. సాధారణంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలినప్పుడు ప్రభుత్వ పెద్దల నుండి సూచనప్రాయ సందేశాలు ప్రజలకు వచ్చినట్టుగానే కంపెనీలకు కూడా వస్తాయి. అలాంటి సందర్భంలో మార్కెట్లను స్థిరపరచడానికి, కొన్ని కంపెనీల షేర్లు తక్కువ రేటుకు అందుబాటులో ఉన్న సందర్భంలో ఎల్ఐసీ వంటి సంస్థలు ముందుకొచ్చి ఆ షేర్లను కొనుగోలు చేస్తాయి. తర్వాత కాలంలో రెట్లు పెరగడం ద్వారా సంస్థ లాభపడి పాలసీదార్లకు పెద్ద మొత్తంలో బోనస్‌లు చెల్లించగలుగుతుంది. ఉదాహరణకు ఐడీబీఐ బ్యాంకులో పెట్టుబడులు పెట్టమని ప్రభుత్వం ఆదేశిస్తే, ఎల్ఐసీ ఆ పని పూర్తి చేసింది. ఆ తర్వాత కొంతకాలం ఐడీబీఐ షేర్ రేటు స్టాక్ మార్కెట్లో పడిపోయినా, ఇప్పుడు ఎల్ఐసీ కొనుగోలు చేసిన రేటుకు ఒకటిన్నర రెట్లు పెరిగింది. ఇలా గతంలో కూడా గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, యూటీఐ, సత్యం కంప్యూటర్స్ వంటి వాటి రేట్లు మార్కెట్లో తక్కువ ధర పలుకుతున్నప్పుడు ఎల్ఐసీనే కాక అనేక ఇతర సంస్థలు కూడా కొనుగోలు చేసి తాము లాభం పొందడమే కాక మార్కెట్‌లోనూ స్థిరత్వాన్ని నెలకొల్పారు. స్టాక్ మార్కెట్లను స్థిరంగా ఉంచడానికి ఎల్ఐసీ ఒక ప్రభుత్వరంగ సంస్థగాను, చిన్న మొత్తాలను పొదుపులుగా సేకరించి పెట్టుబడులుగా మార్చే సంస్థగాను ఇలాంటి పని బాధ్యతాయుతంగా నెరవేరుస్తూ ఉన్నది. అంతేగాక, కొత్తగా మార్కెట్‌లో నమోదవుతున్న కంపెనీలను ప్రోత్సహించడానికి కూడా ఎల్ఐసీ లాంటి సంస్థలు పరిమితులకు లోబడి ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌లో పెట్టుబడులు పెడుతూ ఉంటాయి. ఈ ధోరణిని అనుసరించి– ప్రస్తుతం అదాని సంస్థలో ఎల్ఐసీ పెట్టినవి పెట్టుబడులే గాని నిధుల బదలాయింపు కాదు.

ఎల్ఐసీ ఒక పటిష్టమైన ప్రభుత్వ రంగ సంస్థ. కేవలం 3.5శాతం మాత్రమే వాటాలను స్టాక్ మార్కెట్లో విక్రయించింది. రానున్న రోజుల్లో మరో 10శాతం వరకు వాటాలను మార్కెట్‌లో ఉంచాలని, ఆ తదుపరి కాలంలో మొత్తంగా 25శాతం వాటాలను మార్కెట్లో ఉంచాలని సెబీ నిబంధనలు ఉన్నవి. ఇలా వాటాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగితే ప్రైవేట్ పెట్టుబడి పెరిగిపోతే, ఆ తరువాతి నిర్ణయాల్లో అధికారులపై ప్రభావం కచ్చితంగా ఉంటుంది. అలాంటప్పుడు ఎల్ఐసీ పెట్టుబడులకు ఇప్పుడున్న నిబంధనలు వర్తింపజేయడానికి కష్టం అవుతుంది. అందుచేతనే కాబోలు ఇన్సూరెన్స్ చట్ట సవరణలను సమూలంగా మార్పు చేయాలని, తద్వారా ఇప్పుడు ఏదైతే సెక్షన్ 27ఏ పెట్టుబడులను నిర్దేశిస్తున్నదో, దానిని పూర్తిగా మార్చివేసి ఇష్టానుసారంగా ఇన్వెస్ట్‌మెంట్ చేసుకునే వెసులుబాటును కల్పించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రయత్నాలు సఫలీకృతమైతే అప్పుడు ప్రభుత్వం లేదా ప్రైవేట్ ప్రాబల్యంతో జరిగే నిర్ణయాలు ఎల్ఐసీ పెట్టుబడులను కచ్చితంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతానికి ఎల్ఐసీ పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగానే ఉన్నది కాబట్టి తన నిధుల ఇన్వెస్ట్‌మెంట్‌ను నిబంధనలకు లోబడే కంపెనీలలో పెట్టుబడులుగా పెడుతున్నది.

డోనాల్డ్ ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడైన తర్వాత యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్స్ (యుఎస్‌టీఆర్) ద్వారా భారత ఇన్సూరెన్స్ మార్కెట్‌ను నిర్దేశిస్తున్న ఐఆర్‌డీఏఐకి సూచనలు చేసే సాహసం చేస్తున్నది. ఇలా విదేశీ ఆర్థిక పెట్టుబడి ప్రాబల్యం పెరిగిన దరిమిలా, స్వదేశంలో జరుగుతున్న పెట్టుబడులపై ఆరా తీస్తూ వాషింగ్టన్ పోస్టు సదరు కథనాన్ని ఆశ్రిత పెట్టుబడి బదలాయింపుగా ప్రచురించినట్లు మనకు అర్థమవుతోంది. అందుచేత మీడియా సంస్థలు గానీ ప్రభుత్వ రంగ ఉన్నతిని కోరే మేధావులు గానీ దేశ అత్యున్నత సంస్థ ఎల్ఐసీ విధి విధానాలను లోతుగా అధ్యయనం చేకుండా దుష్ప్రచారాలకు ఆశ్రయమిస్తే– ప్రజల్లో గందరగోళం నెలకొని ప్రభుత్వరంగ ఉనికికే ప్రమాదంగా పరిణమిస్తుంది.

● జి. తిరుపతయ్య

యూనివర్సిటీ లేని జిల్లా!

ఆదిలాబాద్ జిల్లాలో అటవీసంపద, సున్నపురాయి, మాంగనీస్ నిక్షేపాలు, విస్తృతమైన పత్తిసాగు పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉన్నాయి. వీటి వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పరిశోధనలు చేరుకుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయ వనరులు కూడా మెరుగుపడతాయి. ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ నెలకొల్పడం వల్ల జిల్లా వ్యాప్తంగా అనుబంధంగా డిగ్రీ కాలేజీలు, టెక్నికల్ విద్యా కోర్సులు పెరిగే అవకాశముంది. ఉన్నత చదువులతో మానసిక వికాసం మెరుగుపడుతుంది. అంతరించిపోతున్న గిరిజన కళలు, సంస్కృతి, భాషలపై పరిశోధనలు విరివిగా జరుగుతాయి. స్థానిక భాషా, సాహిత్యాలపై పరిశోధన, అధ్యయనాలు ఊపందుకుంటాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యూనిర్సిటీ కోసం యూజీసీ సర్వే చేసి ఇక్కడి ప్రాంతం అనుకూలమైనదిగా నిర్ణయించింది. 2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు జీఓ విడుదల చేసింది. తరువాత 2011లో కూడా అప్పటి ప్రభుత్వం యూనివర్సిటీ ఏర్పాటుకు జీఓ జారీ చేసింది. సుమారు 300 ఎకరాల భూమిని ఉట్నూర్‌లో ఐటీడీఏ కేటాయించింది. కాని అప్పటి రాజకీయ నాయకుల నిర్లక్ష్యం వల్ల మంజూరైన యూనివర్సిటీ ములుగు జిల్లాకు తరలిపోయింది.

2015 నుంచి సుమారు 4, 5 సంవత్సరాలు ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి సంఘాలు జేఏసీగా ఏర్పడి యూనివర్సిటీ సాధన కోసం తీవ్రమైన పోరాటాలు చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు, పికెటింగ్‌లు ఉధృతంగా చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల నుంచి రాష్ట్ర నాయకులపై ఒత్తిడి తెచ్చారు, అయినా అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పట్టించుకోలేదు.

విద్యారంగంలో సమైక్యాంధ్ర పాలకుల నిర్లక్ష్యం, వివక్ష స్వరాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఆదిలాబాద్‌పై కొనసాగడం చాలా విచారకరం. కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక గిరిజనుల కోసం మంజూరైన "కొరట చనకా" రిజర్వాయర్ పనులు కుంటుతూ నడుస్తున్నాయి. మంజూరైన విమానయానం, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ మధ్యలోనే ఆగిపోయాయి. మూతబడ్డ సీసీఐ పునరుద్ధరణ కోసం ఇప్పటి పాలకులకు చిత్తశుద్ధి కరువైంది. ఐటీ హబ్ పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇప్పటికైనా ఆదిలాబాద్ ప్రజల సుదీర్ఘ ఆకాంక్షను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుస్తాయని ఆశిద్దాం.

○ ఉదారి నారాయణ

నోబెల్ బహుమతుల్లో మన ఉనికి ఏదీ?

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా నోబెల్ బహుమతులు పశ్చిమ దేశాలకు– అందులోనూ ఎక్కువగా అమెరికా, యూరప్ దేశాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలకు లభించాయి. మానవజాతి మేలుకోసం మహత్తరమైన కృషి చేసిన వారికి ప్రతి ఏటా ఇచ్చే ఈ ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం మన భారతీయులకు ఎందుకు రావట్లేదు? ప్రపంచ వ్యాప్తంగా 1901 నుంచి 2025 మధ్య నోబెల్ విజేతలుగా నిలచిన 990 మంది వ్యక్తులలో కేవలం 12 మంది మాత్రమే భారతీయులు, భారత మూలాలు ఉన్నవారు ఉండటం నిరాశ కలిగించే విషయం. ఎందుకీ పరిస్థితి?



మరోవైపు పశ్చిమ దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాలు ప్రధానంగా అమెరికా, ఐరోపాకు చెందిన పలు విశ్వవిద్యాలయాలు అప్రతిహతంగా నోబెల్ బహుమతి విజేతల జైత్రయాత్రను కొనసాగిస్తు ఉండటం ఆశ్చర్యం కలిగించే విషయం. ఇందుకు ప్రధాన కారణం– రెండో ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా అత్యంత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలను ప్రపంచం నలుమూలల నుండి తన వైపునకు ఆకర్షించడం. ప్రపంచ యుద్ధాల తర్వాత అనేకమంది పరిశోధకులు అవకాశాల కోసం అమెరికాకు వలస వెళ్లారు. ఈ బ్రెయిన్ గెయిన్ అమెరికాకు వరంగా మారింది. అగ్రశ్రేణి ప్రతిభావంతులు, అత్యుత్తమ మేధావులు, ప్రతిభావంతులైన పరిశోధకులకు అమెరికన్ విశ్వవిద్యాలయాలు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలికాయి. ఫలితంగా శాస్త్ర పరిశోధనలు కొత్త పుంతలు తొక్కాయి.


అమెరికన్ విశ్వవిద్యాలయాల ప్రాంగణంలో బలమైన పరిశోధనల సంస్కృతి ఆవిర్భవించింది. అద్భుతమైన మౌలిక వసతులతో పాటు, పెద్ద ఎత్తున నిధులు సమకూర్చడంతో ఆయా శాస్త్ర రంగాల్లో ప్రాథమిక, మౌలిక పరిశోధనలు పెరిగాయి. శాస్త్రవేత్తలు తక్షణ ఫలితాల కోసం గాక దీర్ఘకాలిక ఆవిష్కరణల కోసం ప్రత్యేకంగా పనిచేయటం సాధ్యమైంది. స్వేచ్ఛ, సృజనాత్మకత, హేతుబద్ధత, విమర్శనాత్మక ఆలోచన పునాదులుగా అమెరికన్ విశ్వవిద్యాలయాలు బలమైన విజ్ఞాన కేంద్రాలుగా అవతరించాయి. 1901 నుండి 2025 వరకు అత్యధికంగా 427మంది నోబెల్ విజేతలు అమెరికా నుంచే రావటం గమనార్హం. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్, కాలిఫోర్నియా, చికాగో, కొలంబియా, ప్రిన్స్‌టన్, యేల్ విశ్వవిద్యాలయాలు నోబెల్ బహుమతి విజేతలకు శాశ్వత చిరునామాలుగా నిలిచాయి. విశ్వవిద్యాలయాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నోబెల్ విజేతలకు చోదకశక్తిగా మారింది. సాధారణంగా– భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్య శాస్త్రం, శరీర ధర్మ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం... తదితర రంగాలలో ప్రాథమిక, మౌలిక పరిశోధనలు, ఆవిష్కరణలు నోబెల్ బహుమతి విజయాలకు దారితీస్తాయి. అమెరికాలో 20వ శతాబ్దం మధ్యకాలం నుండి ఈ ప్రాథమిక, మౌలిక పరిశోధనలకు అపారమైన పెట్టుబడులు పెడుతున్నారు.

మన దేశంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. ఇక్కడ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల సంఖ్య విస్తృతంగా ఉన్నా అవి పలు సమస్యలతో నిత్యం సతమతమవుతూ ఉంటాయి. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన విశ్వవిద్యాలయాలు పరిశోధనల మీద ఆధారపడే వ్యవస్థలుగా కాక, పరీక్షల మీద, పాఠ్యాంశాల కంఠస్థం మీద ఆధారపడే వ్యవస్థలుగా రూపొందటంతో సమస్య మరింత జటిలమైంది. విజ్ఞాన శతాబ్దంగా పిలువబడుతున్న 21వ శతాబ్దంలో మన విశ్వవిద్యాలయాలు ఇంకా భావ దారిద్ర్యంతో, బూజుపట్టిన ఆలోచనలతో, సవర్ణ ఆధిపత్య అగ్రహార భావజాలంతో కునారిల్లుతున్నాయి. దీనికి తోడు అరకొర నిధులు, మౌలిక వసతుల కొరత, వివక్ష అణచివేత, ఆశ్రిత పక్షపాతం వంటివి వినూత్న పరిశోధనలకు, ఆవిష్కరణలకు ప్రధాన అవరోధంగా నిలుస్తున్నాయి. ఈ పరిస్థితి మారాలి.

అలాగే బడ్జెట్‌లో పరిశోధనలకు కేటాయిస్తున్న నిధుల మొత్తాన్ని పెంచాలి. అభివృద్ధి చెందిన దేశాలు తమ బడ్జెట్లో ఎక్కువ భాగం పరిశోధనలకు కేటాయిస్తున్నాయి. ఇజ్రాయిల్ 5.56శాతం, దక్షిణ కొరియా 4.9శాతం, అమెరికా 3.46శాతం, జపాన్ 3.3శాతం, చైనా 2.1శాతం పరిశోధనల కోసం ఖర్చు పెడుతున్నాయి. కానీ మన దేశం 0.64శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నది. భారతదేశ పరిశోధనా వ్యవస్థ ప్రధానంగా– అంతరిక్షం, రక్షణ, ఫార్మా, వ్యవసాయ రంగాల్లో కేంద్రీకృతమై గణనీయ అభివృద్ధిని సాధించింది. కానీ ప్రాథమిక మౌలిక పరిశోధనలు, ఆవిష్కరణలలో ఇంకా వెనుకబడే ఉంది. ఈ దిశగా మన దేశ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే సత్ఫలితాలను సాధించవచ్చు.

■ జె. సురేష్
ప్రొఫెసర్, వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్ editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 కనిష్ఠం 22.6

మృత్యు శకటాలు

ప్రాణం తీస్తున్న టిప్పర్లు



ప్రమాదానికి కారణమైన టిప్పర్ ఇదే

- మూడేళ్లలో 75 మంది మృతి
- సైబరాబాద్‌లో వాహనాల దూకుడు
- పరిమితికి మించిన లోడుతో హల్‌చల్
- పగటిపూటా టిప్పర్ల పరుగులు
- కళ్లెం వేయడంలో పోలీసుల వైఫల్యం

ప్రమాదకరంగా డ్రైవింగ్

అత్యంత నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా పగలు, రాత్రి తేడా లేకుండా కొందరు డ్రైవర్లు టిప్పర్లు నడుపుతున్నారు. సైబరాబాద్ సహా నగర శివారులోని పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద బండరాళ్లను, ఇసుకను, మట్టిని, కంకర, సిమెంట్‌ను టిప్పర్లలో తరలిస్తుంటారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకరమైన లోడ్‌తో వాహనాలను నడపడం, ప్రజల ప్రాణాల మీదికి తెస్తోంది. రోడ్డుపై టిప్పర్‌ను చూస్తేనే వాహనదారులు, ఆయా ప్రాంతాల్లోని సామాన్య ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



హైదరాబాద్ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలో జరిగిన ఘోర ప్రమాదం ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. కంకర లోడుతో వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొట్టడంతో 19 మంది దుర్మరణం చెందారు. టిప్పర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ తోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇలా కొందరి నిర్లక్ష్యం.. ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపుతోంది. పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వందల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదానికి బలి అవుతుండడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రమాదంతో దివ్యాంగులుగా మారి బతికినంత కాలం కొందరు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. ఆ కుటుంబాలకు దిక్కెవరు? దిక్కులు పిక్కటిల్లేలా విలపిస్తున్న మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఎవరు ఓదార్చగలరు?

3 ఏళ్లలో 75 మంది..

మూడేళ్లలో సైబరాబాద్ పరిధిలో కేవలం టిప్పర్ల వల్ల జరిగిన ప్రమాదాల్లో 75మంది మృతి చెందినట్లు పోలీస్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. క్షతగాత్రుల సంఖ్య 100కు పైగా ఉంది. ఇంత జరుగుతున్నా టిప్పర్ డ్రైవర్లు పట్టనట్లే ప్రవర్తిస్తున్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు.

పట్టించుకోని పోలీసులు

సైబరాబాద్ పరిధి చేవెళ్ల, శంకర్‌పల్లి, మోకిల, రాజేంద్రనగర్, శంషాబాద్, గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, కొండాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, నార్సింగి, కోకాపేట,

మిగతా 6వ పేజీలో..

అర్ధరాత్రి మైనర్ల డ్రైవింగ్

టిప్పర్లు నడుపుతున్న వారిలో మైనర్లు ఎక్కువగా ఉంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కొంతమంది యువకులు టిప్పర్లు, భారీ వాహనాలను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. టిప్పర్‌ల ఆగడాలను, జరుగుతున్న ప్రమాదాలను ఫొటోలు, వీడియోలు తీసి ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్‌ల బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు పెద్దగా పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.



కె.మురళీ కృష్ణ (ఫైల్)



హత్యకు గురైన మహ్మద్ గఫూర్ (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

పొడిచి.. పొడిచి చంపేశారు

- వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి హత్య
- నాచారం పారిశ్రామికవాడలో..
- కూకట్‌పల్లి బాలానగర్‌లో..
- పాతకక్షలే కారణమా?



తార్నాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు దారుణహత్యకు గురయ్యారు. గుర్తుతెలియని దుండగులు వారిని పొడిచి.. పొడిచి.. చంపేశారు. నిందితుల, హత్యకు గల కారణాలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాచారం పారిశ్రామికవాడలో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని ఇద్దరు దుండగులు సోమవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో ఉప్పల్‌లోని కళ్యాణ్‌పురి ప్రాంతానికి చెందిన కె. మురళీ కృష్ణ (45)ను కారులో తీసుకెళ్లారు. నాచారం పారిశ్రామికవాడలోని తెలంగాణ ఫుడ్స్ పరిశ్రమ సమీపానికి చేరుకున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో కారును పార్కు చేసిన దుండగులు అందులోనే మురళీ కృష్ణ ముఖంపై పిడిగుద్దులు గుద్దడమే కాకుండా వీపు భాగంలో, భుజంపై కత్తిపోట్లతో దాడి చేశారు. దాంతో మురళీకృష్ణ కారు దిగి పారిపోయాడు. దుండగులు అతడిని కొద్ది దూరం వెంబడించారు. అతను దొరకకపోవడంతో తిరిగి హడావిడిగా కారు ఎక్కి పారిపోయిన విజువల్స్ సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. కత్తిపోట్లకు గురైన మురళీ కృష్ణ తీవ్ర రక్తస్రావంతో 200 మీటర్ల దూరం పరుగెత్తి రోడ్డు పక్కన కుప్పకూలిపోయాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేస్తుండగా తుదిశ్వాస విడిచాడు. నాచారం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దుండగుల కోసం నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మురళీ కృష్ణ

మిగతా 6వ పేజీలో..

బస్టాపునకు సమీపంలో..

బాలానగర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలానగర్ పోలీస్ స్టేషను పరిధి ఐడీపీఎల్ బస్టాపునకు సమీపంలో సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని కత్తితో పొడిచి చంపినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. బాలానగర్ సీఐ నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లాలాగూడకు చెందిన మహ్మద్ గఫూర్ (29) ఐడీపీఎల్‌లో రక్తపు మరకలతో చనిపోయి ఉన్నాడు. పోలీసులు అతడు క్యాటరింగ్ చేసే వ్యక్తిగా గుర్తించారు. పాతకక్షలే హత్యకు కారణమై ఉంటాయని భావిస్తున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. మృతుడి సోదరుడు రషీద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డెత్ జర్నీ

మీర్జాగూడ వద్ద ఊహకందని విషాదం

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర టిప్పర్

చేవెళ్ల ఆస్పత్రిలో హాహాకారాలు.. ఆర్తనాదాలు

కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు



ఆంధ్రజ్యోతి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నవంబరు 3 : ఉదయాన్నే కళాశాలలకు వెళ్లాలని విద్యార్థినులు, పిల్లలను ఆస్పత్రికి తీసుకెళ్లాని తల్లిదండ్రులు, తన కూతురు డోలారోహణం తర్వాత తల్లిగారి ఇంటి నుంచి అత్తారింటికి వెళ్తున్న ఓ మహిళ.. డ్యూటీకి ఆలస్యమవుతుందని మరికొందరు.. ఇలా హడావుడిగా వేకువజామునే వికారాబాద్ జిల్లా తాండూరు బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సెక్కారు. ఇదే చివరి ప్రయాణమని తెలియని వారు పోటీపడి మరీ సీట్లలో కూర్చున్నారు. వెనుక వైపు వద్దంటూ పలువురు బస్సులోని ముందు సీట్లలో కూర్చున్నారు. సుమారు ఐదు గంటల సమయంలో బస్సు బయల్దేరింది. 6.40 గంటల సమయానికి బస్సు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపానికి చేరింది. మరో గంటన్నర సమయంలో అంతా గమ్యస్థానానికి (హైదరాబాద్‌కు) చేరుకునేవారు. అంతలోనే చేవెళ్ల నుంచి కంకర లోడ్‌తో అతివేగంగా ఓ టిప్పర్ మృత్యువును తన వెంటబెట్టుకొని తాండూరు వైపునకు దూసుకొచ్చింది. సరాసరి మీర్జాగూడ శివారకు రాగానే మూల మలుపు వద్ద బస్సును ఎదురుగా బలంగా ఢీకొట్టింది. భారీ లోడు, అతి వేగం కారణంగా టిప్పర్ అమాంతం బస్సును చీల్చుకుంటూ వెళ్లి ప్రయాణికులపై పడిపోయింది. టిప్పర్‌లోని కంకర కుప్ప మాదిరిగా ప్రయాణికులను కమ్మేసింది. దీంతో ఊపరాడక 19 మంది సజీవ సమాధి అయ్యారు. మరో 34 మంది తీవ్రంగా గాయపడ్డారు. పసిపాపతో సహా తల్లి, అక్కపెళ్లికి వచ్చి వెళ్తున్న ముగ్గురు తోబట్టువులు, ఇద్దరు చిన్నారులను అనాథాలను చేస్తూ తల్లిదండ్రులు..

మిగతా 6వ పేజీలో..

అత్తాకోడళ్ల దుర్మరణం

బ్రహ్మశంకర్ నగర్‌లో విషాదఛాయలు



గున్నమ్మ, కల్పన (ఫైల్)

బోరబండ, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతానికి చెందిన అత్తాకోడళ్ళు దుర్మరణం చెందడంతో బ్రహ్మశంకర్ నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం తన కూతురుని చూసేందుకు రెండురోజుల క్రితం బ్రహ్మశంకర్ నగర్‌కు చెందిన గంగుల గున్నమ్మ(65) తాండూరుకు వెళ్ళింది. అత్తను తీసుకొచ్చేందుకు ఆదివారం ఆమె కోడలు గంగుల కల్పన(45) తాండూరుకు బయలుదేరి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో చేవెళ్ల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అత్తాకోడళ్లు మృతి చెందారు. ఇద్దరి మృతదేహాలను సోమవారం మధ్యాహ్నం బ్రహ్మశంకర్ నగర్‌కు తీసుకొచ్చారు. అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా మాట్లాడే అత్తాకోడళ్ళు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల బస్తీ వాసులు కంటతడి పెట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మంత్రులు వివేక్ వెంకటస్వామి,అజారుద్దీన్

కాంగ్రెస్‌కు జన సమితి మద్దతు

బంజారాహిల్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ తెలిపారు. షేక్‌పేట ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓయూ కాలనీలో రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్‌లతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. తెలంగాణ జన సమితి పార్టీ కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు ఎన్నికలో ప్రచారం చేసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు పలకాలని కోరారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన ఘనత కోదండరామ్‌కు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నరసయ్య, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి హనుమంతు గౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు నిజ్జల రమేష్ ముదిరాజ్, సలీం పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటింగ్

నేడు ప్రారంభం.. 103 మంది దరఖాస్తు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వయోధికులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ నేడు ప్రారంభం కానుంది. అధికారుల బృందం ఇళ్ల వద్దకు వెళ్లి వారు ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనుంది. 85 ఏళ్ల దాటిన, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఈ సదుపాయం కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈ నేపథ్యంలో 84 మంది వయోధికులు, 19 మంది దివ్యాంగులు ఫారం-21లో ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కోసం దరఖాస్తు చేశారు. 4, 6 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 103 మందితో ఓటింగ్ చేయించనున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ సాయిరాం తెలిపారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి



హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్ (పని విధానంపై తనిఖీ) పూర్తయ్యింది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆది, సోమ వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో జరిగిన ఈవీఎంల కమిషన్‌ను ఎన్నికల పరిశీలకులు రంజిత్ కుమార్‌సింగ్, ఓంప్రకాష్ త్రిపాఠి, జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు.

పోలింగ్.. ట్రోలింగ్..!

ఎన్నికల వేళ సామాజిక వార్.. ఒకరిపై ఒకరు విమర్శలు

- ప్రత్యర్థులను దెబ్బతీసేలా వీడియోల ఎడిటింగ్
- గత వీడియో క్లిప్పులు ఇప్పటివిగా ప్రచారం
- ఏజెన్సీలతో ఒప్పందాలు.. కంటెంట్ రైటర్ల నియామకం
- ఎన్నికల నేపథ్యంలో జోరుగా ఆన్‌లైన్ సర్వేలు



బంజారాహిల్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవైనా.. క్షేత్రస్థాయిలో మాత్రమే కాదు.. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం తప్పనిసరి. ఇంటింటికీ తిరుగుతూ ఓటును అభ్యర్థించే నేతలు ఆన్‌లైన్‌లోనూ అదే స్థాయిలో కంటెంట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రత్యర్థులపై విమర్శలు.. తాము చేసిన పనులు.. గెలిపిస్తే చేయనున్న పనులను వివరిస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ప్రచారంపై మరింత దృష్టి సారించాయి ప్రధాన పార్టీలు. ప్రత్యర్థులు గతంలో మాట్లాడిన వీడియోలను తమకు అనుకూలంగా ఎడిట్ చేస్తూ వైరల్ చేస్తున్నాయి. ఇందుకు ప్రతిగా ఎదుటి పార్టీ/అభ్యర్థులు కూడా సమాధానమిస్తున్నారు. ఫ్యాక్ట్ చెక్ పేరిట వాస్తవ వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందుకోసం కొందరిని నియమించారు. పార్టీ సోషల్ మీడియా వారియర్లతో పాటు అభ్యర్థులూ కొందరిని రంగంలోకి దించారు. కృత్రిమ మేధ (ఏఐ)ను జూబ్లీహిల్స్ ఎన్నికల్లో వాడుతున్నారు.

ఇప్పుడంతా సోషల్ వార్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మొదటి నుంచి సోషల్ వార్ కీలకంగా మారింది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం అనంతరం కాంగ్రెస్ టికెట్టు విషయంలో అభ్యర్థుల మధ్య సోషల్‌వార్ నడిచింది. ఆ తరువాత అభ్యర్థుల ప్రకటన అనంతరం మూడు పార్టీల మధ్య సోషల్ వార్ నడుస్తోంది. ఉదాహరణకు సీఎం రేవంత్‌రెడ్డి 2023 ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడిగా మాట్లాడిన కొన్ని వ్యాఖ్యలను ప్రస్తుత ఎన్నికలకు సరిపోయేలా వీడియోలు తయారు చేసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో వైరల్ చేశారు. అంతెందుకు అక్టోబరు 31న సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో రహ్మత్‌నగర్, ఎల్లారెడ్డిగూడలో జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ రోడ్ షో షేక్‌పేటలో జరిగింది. వాస్తవానికి రెండు కార్యక్రమాల్లో ప్రజలకు సమకూర్చుకోవడంలో పార్టీలు సఫలీకృతం అయ్యాయి. కానీ పాత సభల్లో ఖాళీ కుర్చీలను వీడియోలుగా తీసుకొని వాటిని రోడ్‌షోతో జత కలిపి కార్యక్రమం విఫలమైందని ఇరు పార్టీలకు చెందిన సోషల్ మీడియాలు ప్రచారం చేస్తున్నాయి. అంతేకాదు అభ్యర్థుల మధ్య సోషల్ వార్ కొనసాగుతోంది.

లైక్‌లు, షేర్‌లు

కంటెంట్, ఎడిట్ చేసిన వీడియోలను వాట్సప్, ఎక్స్, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తున్న పార్టీలు.. వాటికి వచ్చే లైక్‌లు, షేరింగ్/ ఫార్వర్డ్‌లను బట్టి అంత క్లిక్ అయినట్టు భావిస్తున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల నుంచి సోషల్‌మీడియా కీలకంగా మారింది. పార్టీ నేతలు, అభ్యర్థులు ప్రసంగాల్లోని

మిగతా 6వ పేజీలో..



సిక్కుల శోభాయాత్ర 6

సైబర్ నేరాలకు సహకారం.. ముగ్గురి అరెస్ట్ 6




హస్తకళలు అంతరించిపోకుండా పరిరక్షించాలి 6

ప్రభుత్వ ఖాళీ స్థలాలు పరాధీనం

- హైడ్రా ప్రజావాణిలో 61 ఫిర్యాదులు

చదివేది ఒక చోట.. నామినల్ రోల్స్ మరో చోట



విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కరువు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనుమతి లేకుండా పాఠశాలలను నడిపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్నారు. తమ వద్ద చదువుతున్న పిల్లల నామినల్ రోల్స్‌ను ఇతర స్కూళ్ల నుంచి చూపిస్తూ దగా చేస్తున్నారు. అయితే ఇదంతా కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ స్థానిక విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ప్రైవేట్ స్కూళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కాలనీలు, బస్తీల్లో వందలాదిగా ఏర్పాటు చేస్తున్నారు. అర్హత లేని వారితో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ మొక్కుబడిగా నడిపిస్తున్నారు. కాగా, గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలల కారణంగా ఉన్నత చదువుల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నామినల్ రోల్స్‌లో ఇష్టారాజ్యం

జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 2,284 పాఠశాలలున్నాయి. ఇందులో 1,886 స్కూళ్లకే గుర్తింపు ఉండగా, మిగతా 398కి అనుమతి లేదని తెలిసింది. విద్యాశాఖ నుంచి ఎలాంటి గుర్తింపూ లేకున్నప్పటికీ నిర్వాహకులు దర్జాగా స్కూళ్లను నడిపిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి హైస్కూల్ వరకు అనుమతి లేకుండా నడుస్తున్న వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో యాజమాన్యాలు తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. వాస్తవంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యాశాఖకు సంబంధించిన యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్)లో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే గుర్తింపు లేని పాఠశాలల నిర్వాహకులు తమ వద్ద చదువుతున్న పిల్లల హాజరును తెలిసిన ఇతర స్కూళ్లలో ఉన్నట్లుగా చూపించి అక్కడి నుంచి విద్యాశాఖకు సమర్పిస్తున్నారు. ప్రధానంగా పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్‌ను ఇదే పద్ధతిలో అందజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు.

ఒక్కొక్కరి నుంచి రూ.2000 వసూలు

వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు

మిగతా 6వ పేజీలో..




కార్తీక దీపాలు

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని బోయిన్‌పల్లిలోని శ్రీ బోలో శంకర్ మందిరంలో నిర్వహించిన లక్ష దీపోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్







బీసీ నేతలపై కేసులు ఎత్తివేయాలి

- రిజర్వేషన్లపై హైకోర్టులో బలమైన వాదనలు వినిపించాలి
- బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్ కృష్ణయ్య

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా గత నెల 18న నిర్వహించిన రాష్ట్ర బంద్‌లో 350 మంది బీసీ నేతలపై పోలీసులు అక్రమ కేసులను పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో 3 పోలీస్ స్టేషన్ల పరిధిలో నల్గొండ, మిర్యాలగూడ, ఖమ్మం, ఆదిలాబాద్‌లో అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈ కేసులను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా ఎత్తివేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జైలు భరో కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, కార్యదర్శి భీమ్‌రాజ్ ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీ కుల సంఘాలు, బీసీ సంక్షేమ సంఘాల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఓటు చోరీపై పార్లమెంట్ సమావేశాలను బహిష్కరించి నిరసన తెలిపిన కాంగ్రెస్... బీసీ రిజర్వేషన్లపై ఎందుకు బహిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహారదీక్షలు, ర్యాలీలు, రాస్తా రోకోలు మండల, జిల్లా స్థాయిలో నిర్వహించి ప్రభుత్వాన్ని స్తంభింపజేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు రాందేవ్‌మోదీ, గోపి బోయ, నగేష్, లక్ష్మణ్, నరేష్‌గౌడ్, కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

మృత్యు శకటాలు

(5వ పేజీ తరువాయి)

తదితర ప్రాంతాలన్నీ ఖరీదైన ప్రాంతాలు. ఇక్కడ అనేక కంపెనీలు, పరిశ్రమలు కొలువుదీరాయి. వందల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల నిర్మాణాలు జరుగుతుంటాయి. కొండలు, గుట్టలతో కూడిన ప్రాంతాల నుంచి నిర్మాణ సమయంలో బయటకు తీస్తున్న పెద్ద పెద్ద బండరాళ్లు, మట్టిని తరలించడానికి వందల సంఖ్యలో టిప్పర్లను ఉపయోగిస్తున్నారు. ఆయా వాహనాలు పగలు, రాత్రి తేడా లేకుండా దూకుడుగా పరుగులు పెడుతున్నాయి. రాత్రి పది దాటిందంటే చాలు రహదారుల వెంట పదుల సంఖ్యలో టిప్పర్లు చక్కర్లు కొడుతుంటాయి. నిజానికి రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 6.00 గంటల వరకు సమయం పాలన పాటించాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు తిలోధకాలు ఇస్తున్న కొందరు అరాచకం సృష్టిస్తున్నారు. పెద్దపెద్ద బండరాళ్లను, కంకర, కచరా రాళ్లను టిప్పర్‌లో లోడ్ చేస్తున్న నిర్వాహకులు, డ్రైవర్లు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. వెనక ఉండే డోర్‌ను బిగించకుండా అజాగ్రత్తగా వాహనాలు నడుపుతున్నారు. కొంతమంది చిన్న డోర్లు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో బండరాళ్లు దొర్లి కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వెనుక నుంచి వచ్చే వాహనదారులు, ప్రజలు దుర్మరణం పాలవుతున్నారు. కేవలం చలానాలకు మాత్రమే పరిమితం అవుతున్న పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పొడిచి.. పొడిచి చంపేశారు

(5వ పేజీ తరువాయి)

కారు ఎందుకు ఎక్కాడు? అతడికి, దుండగులకు మద్యం మత్తులో ఘర్షణ జరిగిందా, పాతకక్షలే హత్యకు కారణామా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మురళీ కృష్ణకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. తన భర్త ఆదివారం ఉదయం 9:30 గంటల సమయంలో తన అన్నను కలవడానికి జిల్లెలగూడకు వెళ్లాడని, అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో తన మేనల్లుడి సెల్‌ఫోన్‌తో కాల్ చేసి రేపు ఉదయం ఇంటికి వస్తానని చెప్పాడని భార్య కొయ్యాడ తులసి రత్నం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలింగ్.. ట్రోలింగ్..!


(5వ పేజీ తరువాయి)

ప్రధానాంశాలు అత్యల్ప కాలంలో వేలమందికి చేరాలంటే సామాజిక మాధ్యమాల ద్వారానే సాధ్యం. దీనినే రాజకీయ పార్టీలు ప్రధాన ప్రచార మాధ్యమంగా వినియోగిస్తున్నాయి. ఫేస్‌బుక్‌లో షేరింగ్, వాట్సప్‌లో లింకులు, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపిస్తే సరిపోతుంది అని చాలా మంది అనుకుంటారు. నాయకులు పంపించే సమాచారం తక్కువ సమయంలో చేరవేసేందుకు డిజిటల్ మార్కెటింగ్ ఏజెన్సీలతోనూ అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. కొందరు వీడియోల ఎడిటింగ్, కంటెంట్ క్రియేషన్ కోసం పలు సంస్థల సేవలు వినియోగించుకుంటున్నాయి.

ఆన్‌లైన్ సర్వేలు

ఎన్నికలు వస్తున్నాయంటే గెలుపోటములపై జోరుగా సర్వేలు జరుగుతుంటాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లి ఓటు ఎవరికి వేస్తారు అనే ప్రశ్నలు వేసి సర్వే చేయడం ఓ విధానం. కచ్చితమైన సమాచారం రావాలంటే ప్రశ్నావళి తయారు చేసి వాటిని కిందిస్థాయి నుంచి సమాధానాలు చెప్పిస్తే సరైన సర్వే ఫలితాలు వస్తాయనే అభిప్రాయం ఉంది. ఏజెన్సీల ద్వారా రాజకీయ పార్టీలు ఈ విధానం అవలంబిస్తున్నాయి. ఇప్పుడు ఆన్‌లైన్ సర్వేలు జోరందుకున్నాయి. ఏదో ఒక యూట్యూబ్ చానెల్ లోగో పెట్టి ఈసారి ఎవరికి ఓటు వేస్తారు అంటూ ఆన్‌లైన్‌లోనే ప్రశ్నించి తమ వారితో ఓ డేటా రూపొందించి మార్కెట్‌లోకి పంపిస్తు న్నారు. పార్టీలకు అనుకూలంగా పని చేసే సోషల్ మీడియాలో ఈ ట్రిక్‌తో ఓట్లను కొల్లగొట్టే యత్నం చేస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. రోజుల తరబడి నిర్వహించే ఆన్‌లైన్ సర్వేలు వాస్తవానికి దూరంగా ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు.







పెట్రోల్ బంకులపై స్పెషల్ డ్రైవ్

- మీటర్ రీడింగ్, ఇంధన నాణ్యతను పరిశీలించిన పౌరసరఫరాల శాఖ అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో నాణ్యత, కొలతల నియంత్రణపై పౌరసరఫరా శాఖ అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర తూనికలు, కొలతల శాఖ అధికారులతో కలిసి హైదరాబాద్ జిల్లా పరిధిలోని పెట్రోల్ బంకుల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో బంకుల్లోని యంత్రాల మీటర్ల రీడింగ్, పంప్ సెటప్, నిల్వ పద్ధతులు, పంపింగ్ సమయంలో నిర్వహణ, ఇంధనం నాణ్యతను ప్రత్యేక బృందాలు పరిశీలించాయని హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా పరిధిలో 169 పెట్రోల్ బంకులు, 71 ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయని, తరచూ తనిఖీలు నిర్వహించి ఎలాంటి అక్రమాలు, అవకతవకలు లేకుండా ఉండేలా పౌరసరఫరాల శాఖ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు రజత గజవాహనం

- రూ.40లక్షల విలువైన 31కిలోల వెండితో తయారీ
- అందజేసిన ప్రవాస భారతీయులు శంకర్‌నారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు

భద్రాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన ప్రవాస భారతీయులు రజత గజ వాహనాన్ని సమర్పించారు. ప్రస్తుతం అమెరికాలోని బోస్టన్‌లో నివాసం ఉంటున్న శంకర్ నారాయణ-రాజ్యలక్ష్మి దంపతులు రూ.40 లక్షలు వెచ్చించి 31 కిలోల వెండితో గజ వాహనాన్ని తయారు చేయించారని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి చేతులమీదుగా అందుకున్న ఈవో సోమవారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. 2022లో శంకర్‌నారాయణణ,రాజ్యలక్ష్మి దంపతులు భద్రాద్రి రామయ్యను దర్శించి మంత్రముగ్ధులయ్యారని, ఈ క్రమంలో స్వామివారి సేవకు రజత గజ వాహనాన్ని సమర్పిస్తామని మొక్కుకున్నారని, ఇప్పుడు ఆ మొక్కు చెల్లించుకున్నారన్నారు. ఈ గజవాహనాన్ని స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో వినియోగిస్తామని ఈవో దామోదర్‌రావు, వైదిక సిబ్బంది వెల్లడించారు.


హైదరాబాద్ భక్తులు బహూకరించిన రజత గజ వాహనం

డెత్ జర్నీ

(5వ పేజీ తరువాయి)

ఇలా చాలా మంది కంకర కుప్ప కూరుకుపోయి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. మరికొంత మంది తల మాత్రమే బయటకు కనిపిస్తూ శరీరమంతా కంకరలో మునిగి సహాయం కోసం అర్థిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం రాష్ట్రాన్ని ఉలిక్కిపాటుకు గురి చేసింది. మృతదేహాలను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి సామూహికంగా పోస్ట్ మార్టమ్ ముగించి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న తీరు హృదయాన్ని ద్రవింపజేసింది. తల్లిదండ్రులను పోగుట్టుకున్న పిల్లలు, పిల్లలను పోగుట్టుకున్న తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన భార్యలు, భార్యలను కోల్పోయిన భర్తల రోదనలతో ఆస్పత్రి పరిసరాలు మారుమోగాయి.

కన్నీటి పర్యంతం.. ఊహకందని విషాదం

రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం పలు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ప్రమాదంలో తమ ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలు ఊహకందని విషాదాన్ని తలుచుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. మరో గంటన్నర సేపట్లో గమ్యస్థానాలను చేరుకుంటామన్న ధీమాతో ఉన్న ప్రయాణికుల్లో 19 మందిని మృత్యుశకటంలా వచ్చిన టిప్పర్ బలిగొంది. సోమవారం ఆర్టీసీ అద్దె బస్సులో తాండూరు నుంచి బయలుదేరిన ప్రయాణికుల్లో చాలా వరకు నిద్రకు ఉపక్రమించారు. మార్గమధ్యలో ధారూరు, వికారాబాద్, మన్నెగూడల్లో ప్రయాణికులు బస్సు ఎక్కారు. మీర్జాగూడ శివారులో బస్సును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో తాండూరు ప్రాంతానికి చెందిన మూడు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. కోలుకోలేనంతగా చితికిపోయాయి. తమ కుటుంబ సభ్యులను, పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన ఎల్లయ్య, ఆయన భార్య, బంధువుల రోదనలు అందరినీ కలచివేశాయి. తమ ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల ఆవేదన చూసి అక్కడున్న వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. అదే విధంగా ఈ ప్రమాదంలో తాండూరు పట్టణానికి చెందిన తండ్రి, కూతురుతో పాటు 40 రోజుల పసికందు ప్రాణాలు కోల్పోవడం అందరి హృదయాలను కలచివేసింది. యాలాల్ మండలం, హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు ఈ ప్రమాదంలో మృతి చెందడంతో వారి ఇద్దరు కూతుళ్ల భవానీ, శివలీలలు అనాథలుగా మారారు.

ఈ గుంతే ప్రమాదానికి కారణమా.?!



హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై మీర్జాగూడ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దగ్గర రోడ్డుపై ఉన్న పెద్ద గుంతే ఈ ప్రమాదానికి కారణమై ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మూలమలుపులో ఆర్టీసీ బస్సు- టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనను పరిశీలిస్తే రోడ్డుపై ఉన్న గుంతనే కారణం కావొచ్చని స్థానికులు చెబుతున్నారు. గుంతను తప్పించబోయి బస్సును ఢీకొట్టినట్లు భావిస్తున్నారు.

చదివేది ఒక చోట.. నామినల్స్ రోల్స్ మరో చోట..!

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. అయితే పరీక్షల ఫీజు చెల్లింపు మొదలుకాకముందే పలు యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నాయి. తమ స్కూల్‌కు గుర్తింపు లేకపోవడంతో ఇతర పాఠశాల నుంచి సదరు నిర్వాహకులు ఫీజు కట్టించాల్సి వస్తోంది. దీంతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే వారికి ఆదేశాలు కూడా జారీ చేసినట్లు తెలిసింది. హిమాయత్‌నగర్, ముషీరాబాద్, ఖైరతాబాద్, నాంపల్లి, సైదాబాద్, గోల్కొండ మండలాల్లోని పలు పాఠశాలల నిర్వాహకులు ఈ మేరకు ముందుకుసాగుతున్నట్లు సమాచారం. ప్రైవేట్ స్కూళ్లపై డిప్యూటీ ఐఓఎస్ (మండల విద్యాధికారి), డిప్యూటీ ఈఓల పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా పాఠశాలల ఇష్టారాజ్యం నడుస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ప్రశాంతంగా ప్రైవేట్ కళాశాలల బంద్

చాదర్‌ఘాట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా సంస్థలు చేపట్టిన బంద్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని దాదాపు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ పాటించాయి. గత నాలుగేళ్లుగా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య, ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీలు బంద్ చేస్తున్నట్లుగా కళాశాలల ముందు బోర్డులను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న మంత్రి గడ్డం వివేక్

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మద్దతు తెలపండి

● ఇమామ్‌ల సమావేశంలో మంత్రి గడ్డం వివేక్

నార్సింగ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): షేక్‌పేట్ జానకీనగర్‌లో మసీదు ఇమామ్‌లతో కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. ముఖ్యఅతిథిగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని ఇమామ్‌లను కోరారు. షేక్‌పేట అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మజ్లిస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం పాట్లు



ఓట్ల కోసం నాయకులకు పాట్లు తప్పడం లేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా షేక్‌పేట్ డివిజన్ బృందావన్ కాలనీలో ఓ లాండ్రీ షాపులో దుస్తులకు ఇస్త్రీ చేస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, సేవాదళ్ చైర్మన్ జితేందర్

- గోషామహల్, ఆంధ్రజ్యోతి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం

నేడు కలెక్టరేట్ల ముట్టడి

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 8 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని, వారి కార్యక్రమాలను అడ్డుకుంటామని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ హెచ్చరించారు. విద్యారంగంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయాల ముట్టడి వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, ప్రభాకర్, తిరుపతి, రాహుల్, ప్రీతమ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి.అజాముద్దీన్

నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడిన నూర్‌బాషా దూదేకుల కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 200 కోట్లు కేటాయించాలని తెలంగాణ ముస్లిం నూర్‌బాషా దూదేకుల బీసీ-బి వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి.అజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ రాజస్థ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, కార్యదర్శి బడేసాబ్, గౌరవాధ్యక్షుడు అహ్మద్ హుస్సేన్ తదితరులు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేట్‌లో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయించిందని, భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. నవీన్ యాదవ్ విజయానికి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తామన్నారు.



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ నాయకులు మొండ్ర కొమురయ్య

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

రాజేంద్రనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ డివిజన్ సిరిమల్లె గార్డెన్స్ ఫేజ్ - 1లో సోమవారం పారిశుధ్య సిబ్బంది 50 మందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీశంకర్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ లోకందయ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, ప్రశాంత్ నీమ్కర్, అనీష్, డేవిడ్ రాజు, సతీష్‌కుమార్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సమన్వయంతో పూర్తిచేయండి

అధికారులకు చార్మినార్ జోనల్ కమిషనర్ ఆదేశం

మదీన, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను అన్ని విభాగాలు సమన్వయంతో పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణ, పురోగతిపై సోమవారం ఫూల్‌బాగ్‌లోని తన కార్యాలయంలో అన్ని సర్కిళ్లకు చెందిన ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టాల్సిన పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్లకు చెందిన ఇంజనీరింగ్ విభాగం ఈఈలు సునీల్, దేవేందర్, సనావుద్దీన్, హరికిశోర్, వెంకటేశ్వర్లు, నరేందర్‌గౌడ్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి

విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

రాజేంద్రనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శివరాంపల్లిలో విద్యుత్ డీఈ కార్యాలయం, ఫిష్ బిల్డింగ్ వద్ద గల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం వద్ద సోమవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. శివరాంపల్లిలో జరిగిన కార్యక్రమంలో డీఈ పాల్గొని వినియోగదారుల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 12 మంది పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డివిజనల్ ఇంజనీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఈశ్వర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు గాయత్రి, సుధాకర్ బాబు, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సులేమాన్‌నగర్‌లో..

సులేమాన్‌నగర్‌లో విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో 30 మంది వినియోగదారులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్లు మల్లేశ్ రాజ్, దుర్గాప్రసాద్, నవీన్, ఇన్‌చార్జి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల నుంచి వినతిపత్రాలు తీసుకుంటున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ రామ్మోహన్

కాళికామాతకు డిప్యూటీ సీఎం సతీమణి పూజలు

చాంద్రాయణగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా కాళికామాతకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని సోమవారం ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం సమర్పించారు. కేశవగిరి చెన్నకేశవస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కె. బబిత ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో చెన్నకేశవస్వామి దేవాలయ మాజీ చైర్మన్ జుర్కి రాజేందర్, కాళికామాత దేవాలయం ప్రతినిధులు జగన్, బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కాళికామాతకు పూజలు చేసిన డిప్యూటీ సీఎం సతీమణి నందిని

నాంపల్లి మాతా ఆలయంలో..

అఫ్జల్‌గంజ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని మాతా దేవాలయంలో టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా సోమవారం పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కైలాస్ కేడియా, బల్లుభాయ్, ప్రశాంత్, అశోక్ గుప్తా, కైలాష్ గుప్తా, రాజు భాయి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున ఖర్గేతో నిజాం నవాబు సమావేశం



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతే న్యూ ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో నిజాం నవాబు నజాఫ్ అలీఖాన్ సమావేశమయ్యారు. తెలంగాణపై పలు విషయాలు చర్చించారు.

- చార్మినార్ ఆంధ్రజ్యోతి

'మున్నూరుకాపులు అభివృద్ధి చెందాలి'

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు కోరారు. సోమవారం కాచిగూడలోని సంఘం కార్యాలయంలో మహాసభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగడానికి రాజకీయాలకతీతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహాసభ ఉపాధ్యక్షులుగా చంద్రకాంత్, వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా మహేష్, రమేష్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్‌గా సతీష్, ప్రధాన కార్యదర్శిగా వరుణ్, కార్యవర్గ సభ్యుడిగా భాస్కర్‌ను నియమించారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా రమేష్, సంయుక్త కన్వీనర్‌గా శ్రీకాంత్, జగిత్యాల జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్, సంయుక్త కన్వీనర్‌గా రచనలను నియమించి నియామక పత్రాలను అందజేశారు.

స్తంభాలపై ట్రాన్స్‌ఫార్మర్లు

చాదర్‌ఘాట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరాఫరాకు ఆటంకం కలగొద్దు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మా ఇంటి చుట్టుపక్కల ఏర్పాటు చేయొద్దు. ఇదీ మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలోని ఇళ్ల యజమానుల తీరు. ఇలాంటి ఇబ్బందికరమైన, అభ్యంతరాల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం విద్యుత్ అధికారులకు కత్తి మీద సాములా మారింది. దీంతో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే స్తంభాలపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మూడుచోట్ల ఏర్పాటు

మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్తంభంపై ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశారు. విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు మంజూరైనా, అనువైన స్థలం లేకపోవడంతో జాప్యం జరుగుతోంది. విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను పరిష్కరించలేకపోతున్నారు. తాజాగా పరిమిత స్థలంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదనల్లో ప్రధానాంశం. ఈమేరకు సలీంనగర్, ఆస్మాన్‌ఘడ్, సైదాబాద్ సెక్షన్ల పరిధుల్లో ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్తంభాలపై ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆస్మాన్‌ఘడ్ సెక్షన్ పరిధిలోని గడ్డిఅన్నారంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను స్తంభంపై ఏర్పాటు చేయగా, సలీంనగర్ సెక్షన్‌లో రెండు ఏర్పాటు చేశారు. సైదాబాద్ సెక్షన్ పరిధిలో మరో రెండు, ఆస్మాన్‌ఘడ్ సెక్షన్‌లో మరొక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.



గడ్డిఅన్నారంలో స్తంభంపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మున్ముందు స్తంభాలపైనే ట్రాన్స్‌ఫార్మర్లు



ఇరుకైన వీధులు, బస్తీల్లో మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా మున్ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్తంభాలపైనే ఏర్పాటు చేయనున్నాం. 11 మీటర్ల ఎత్తైన స్తంభంపై 160కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇలా ఏర్పాటుతో పరిమిత స్థలంతోపాటు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశముంది.

- విష్ణువర్ధన్‌రెడ్డి, డీఈ, ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్



హరీష్‌రావుకు పరామర్శ

మాజీ మంత్రి హరీష్‌రావును అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల శ్రీనివాస్, సీహెచ్ సరిత, ఫ్యూచర్ లీడర్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయితేజరావు సోమవారం పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- బర్కత్‌పుర/చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి



మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tHiie0Cలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

రోడ్డు ప్రమాదం బాధాకరం : ఎమ్మెల్యే



రాజేంద్రనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, మీర్జాగూడ వద్ద రోడ్డు ప్రమాదం జరగడం బాధాకరమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అడగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు.

రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : కార్పొరేటర్



చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. ఈ సంఘటనపై విచారణ జరపాలని కోరారు.

రేపు మీరాలంమండిలో మహా అన్నకూట మహోత్సవం

చార్మినార్ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 5న మహా అన్నకూట మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది. సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొనే వారికి ఉచితంగా పూజా సామగ్రి అందజేస్తామన్నారు. మహా అన్నకూట మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు మహాభిషేకం, అలంకారం, శ్రీ చక్రార్చన, స్వామి వారికి రుద్రాభిషేకం, ఆంజనేయస్వామికి అభిషేకం, ఆకు పూజ, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఉదయం 10.30 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు గోపూజ, ఒంటి గంటకు తులసి పూజ, సాయంత్రం 5.30 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ, ఆకాశ దీపం, 6.30 గంటలకి మహా నైవేద్యం, 7 గంటలకి పంచహారతి, సామూహిక హారతి, 7.15 గంటలకు మహా అన్న కూట మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.



గోషామహల్‌లో ఫెన్సింగ్ లేకుండా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

గోషామహల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో ఆరు డివిజన్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ బద్దం సతీష్‌గౌడ్ కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న డబ్బాలను తొలగించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న స్విచ్ బోర్డులకు మూతలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.



యాసిర్‌ఖాన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్‌కు యాసిర్ ఖాన్ ఎంపిక

మదీన, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ టాలెంట్ అకాడమీకి జహనుమాలోని సెయింట్ మార్క్స్ బాయ్స్ టౌన్ హైస్కూల్ యాసిర్ ఖాన్ ఎంపికయ్యాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ షోరెడ్డి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ ఆరోగ్యం పస్సల, పీఈటీలు పాపిరెడ్డి, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడి మృతి

రాజేంద్రనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. అక్టోబరు 3వ తేదీన కాటేదాన్ రాంచరణ్ ఆయిల్ మిల్ సమీపంలో 65 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వృద్ధుడు ఆదివారం చనిపోయాడు. అతడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712568052, 9490617459 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో లక్ష్మీనారాయణ తదితరులు

ఉపగ్రహ ప్రయోగాలలో మిధాని పాత్ర కీలకం

చంపాపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇస్రో చేపడుతున్న స్వదేశీ ఉపగ్రహ ప్రయోగాలతో పాటు గగన్‌యాన్, చంద్రయాన్, మిస్సైల్స్ తయారీలో మిధాని పాత్ర ఎంతో కీలకమని ఐపీఎస్ విశ్రాంత అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 వారోత్సవాల ముగింపు సమావేశం సోమవారం మిధానిలో ఘనంగా నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ విజిలెన్స్ సీవీవో స్ఫూర్తిరెడ్డి, మిధాని డైరెక్టర్(ఉత్పత్తి, మార్కెటింగ్) పద విట్టన్‌బాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మెటలర్జికల్ ఉత్పత్తులలో మిధాని పేరుగాంచిందన్నారు. మిధాని ఉత్పత్తులను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయడంపట్ల ఉద్యోగులను ఆయన అభినందించారు. దేశం ఎకనామిక్, టెక్నికల్, కల్చరల్, పొలిటికల్ సూపర్‌పవర్‌గా ఎదగాలంటే విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం జాగృతి మ్యాగజైన్‌ను ఆయన ఆవిష్కరించారు. వారోత్సవాలను పురష్కరించుకొని మిధాని టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిధానిలోని వివిధ విభాగాల ఏజీఎం, జీఎం, ఉద్యోగులు పాల్గొన్నారు.

'చేవెళ్ల' మృతుల్లో కోఠి మహిళా వర్సిటీ విద్యార్థినులు


సాయిప్రియ, ఇ.నందిని, ముస్కాన్ (ఫైల్)

అఫ్జల్‌గంజ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల రోడ్డు ప్రమాద ఘటనలో తమ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు మృతిచెందడం బాధాకరమని కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ లోకపావని అన్నారు. కళాశాలలో సోమవారం సంతాప సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. తమ కళాశాలకు చెందిన బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న సాయిప్రియ, బీకాం ఫస్టియర్ చదువుతున్న ఈ.నందని, ఎంపీసీఈఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న ముస్కాన్‌లు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. వారి ఆత్మలకు శాంతికలగాలని ప్రార్థించారు. తోటి విద్యార్థినులు కన్నీరుమున్నీరయ్యారు. వారి మరణంతో మహిళా వర్సిటీలో విషాదఛాయలు అలముకున్నాయి.

నేటినుంచి విద్యార్థి దీక్షలు


బీసీ విద్యార్థి జేఏసీ లోగోను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 4నుంచి 8వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నట్లు బీసీ జేఏసీ కో-ఆర్డినేటర్ గుజ్జ సత్యం తెలిపారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ విద్యార్థి జేఏసీ లోగోను రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆవిష్కరింపచేసినట్లు తెలిపారు. 4న జ్యోతిరావు సావిత్రీబాయి పూలే మార్గదీక్ష, 5న సాహూ మహరాజ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ దీక్ష, 6న సాయన్న, కొండా లక్ష్మణ్‌బాపూజీ సమరదీక్ష, 7న బీపీ మండల్, కర్పూరీ ఠాకూర్ కార్యదీక్ష, 8న ఐలమ్మ, లక్ష్మీబాయి ఐక్యతా దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు సైదులు, రాజేష్, వంశీ, మధుయాదవ్ పాల్గొన్నారు.

'త్వరలో తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్'

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమగ్రత, అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలో తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నట్లు నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని తెలిపారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బలమైన ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు, రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి విధి, విధానాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఫ్రంట్ నేషనల్ వైస్ చైర్మన్‌గా ప్రియాంక రవిప్రకాష్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ ఏపీ చైర్మన్ చంద్రానంద్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, ఏపీ అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై నెల రోజుల పాటు
కేర్ అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ వ్యాప్తంగా నెలరోజులపాటు డయాబెటీస్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కేర్ ఆస్పత్రి సోమవారం వెల్లడించింది. మధుమేహాన్ని ముందుగానే గుర్తించడం, నివారించడం, తగిన సంరక్షణ తీసుకోవడం, అలాగే మధుమేహం వల్ల కలిగే సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా నివాస ప్రాంతాలు, ఐటీ పార్కులు, మాల్స్‌ల్లో ఉచిత డయాబెటిక్ స్ర్కీనింగ్ శిబిరాలు, ఉద్యోగుల కోసం 'మీ చక్కెరను తెలుసుకోండి' అంటూ అవగాహన కార్యక్రమాలు, పిల్లల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఆరోగ్యకరమైన పాఠశాల సెషన్‌లు నిర్వహిస్తున్నట్లు కేర్ ఆస్పత్రి జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజు నాయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాదల రక్షణ గురించి అవగాహన కల్పిస్తామని కేర్ ఆస్పత్రి వాస్కులర్ ఐఆర్ విభాగం క్లినికల్ డైరెక్టర్, విభాగాధిపతి డాక్టర్ పి.సి. గుప్తా తెలిపారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం
మంత్రుల నివాసాల ముట్టడి


ఎస్ఎఫ్ఐ విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసాలను ముట్టడించేందుకు వారు యత్నించారు. దాంతో బంజారాహిల్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. తక్షణమే బకాయిలు చెల్లించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల నివాసాలు ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విద్యార్థులు హెచ్చరించారు.

సిక్కుల శోభాయాత్ర



అఫ్జల్‌గంజ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిక్కుల తొలి మతగురువు గురునానక్ దేవ్‌జీ మహరాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా అఫ్జల్‌గంజ్, అశోక్‌బజార్ గురుద్వారా నుంచి సిక్కులు భారీ శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపైన గురునానక్ మత గ్రంథాన్ని ఏర్పాటు చేసి ప్రముఖ మత గురువులు, మహిళలు భక్తి పాటలు పాడుతూ ముందుకు సాగారు. యువకులు దారి పొడవునా కత్తి విన్యాసాలు, గట్కా, కర్రసాములను ప్రదర్శించారు. ఒంటెలు, గుర్రాలతో అఫ్జల్‌గంజ్ గురుద్వారా నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సిద్దంబర్‌బజార్, ఎంజె మార్కెట్, జాంబాగ్ పూల మార్కెట్ మీదుగా గౌలిగూడ నుంచి తిరిగి గురుద్వారా చేరుకుంది.


శోభాయాత్రలో పాల్గొన్న సిక్కులు




యువకుల కత్తి విన్యాసాలు

ప్రభుత్వ ఖాళీ స్థలాలు పరాధీనం

● హైడ్రా ప్రజావాణిలో 61 ఫిర్యాదులు

హైదరాబాద్‌సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసర స్థలాలు పరాధీనమవుతున్నాయని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సోమవారం బుద్ధభవన్‌లో జరిగిన ప్రజావాణిలో 61 ఫిర్యాదులు అందాయి. బాలాపూర్ మండలంలోని మల్లాపూర్ ఏఎంఆర్ టౌన్‌షిప్‌లో రెండు పార్కులు, రెండుచోట్ల రహదారులను ఆక్రమించారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సంగారెడ్డిలోని రామచంద్రాపురం సాయినగర్ కాలనీలో నాలా పక్కన ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఎస్ఆర్ నగర్ సర్వే నెంబర్ 102/1, 102/3లో 1550 చ.గల స్థలం పార్కు కోసం కేటాయించగా.. దానిని ఆక్రమిస్తున్నారన్నారని, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు అలుగు ఎత్తు పెంచడంతోపాటు నాలుగు తూములు మూసి వేయడంతో తమ ఇళ్లు, పంట పొలాలు నీట మునుగుతున్నాయని అధికారులకు స్థానికులు వివరించారు. చెరువు నుంచి దిగువకు నీరు వెళ్లకపోవడంతో కుమ్మరికుంట, బందం కొమ్ము, శాంబునికుంట, ఇసుక బావి చెరువులు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పోచారం మునిసిపాలిటీ అన్నోజిగూడ సర్వే నెంబర్ 44, 45లో పాఠశాల భవన నిర్మాణం కోసం కేటాయించిన 1987 చ.గల స్థలం అన్యాక్రాంతమవుతున్నదని శ్రీ వెంకటసాయి కాలనీ వాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మణికొండ సర్వే నంబర్ 75లో ఖాళీగా ఉన్న 1.10 ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమార్కుల పాలుకాకుండా చూడాలని, మాదాపూర్ గుట్టల బేగంపేటలో మేడికుంటను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారి

హస్తకళలు అంతరించిపోకుండా పరిరక్షించాలి


హస్తకళలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న హస్త కళలను పరిరక్షించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రత్యేకమైన హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లను, చేనేత ఉత్పత్తులను పుణ్య క్షేత్రాలు, ఎయిర్ పోర్టులు రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసి బాగా ప్రమోట్ చేయాలని సూచించారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుమారు 150 హస్త కళల, చేనేత ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11మంది హస్తకళల కళాకారులకు రాష్ట్ర స్థాయి అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల రాణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నవారే దేశద్రోహులు

● సీజేఐపై దాడికి నిరసనగా
17న చలో ఢిల్లీ


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

పంజాగుట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఉంటూ భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న వారు, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్న వాళ్లే దేశద్రోహులని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై దాడికి నిరసనగా ఈ నెల 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నతమైనదిగా ఉన్న సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి దళితుడైన బీఆర్ గవాయ్ మీద దాడి జరిగి నెల రోజులు కావస్తున్నా నేటికీ చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. ఢిల్లీ పోలీసులు, న్యాయవ్యవస్థ, జాతీయ మానవహక్కుల కమిషన్ ఈ దాడిని సుమోటోగా ఎందుకు స్వీకరించలేదని ఆయన ప్రశ్నించారు. జస్టిస్ బీఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ దేశ రాజధానిలో లక్షలాదిమందితో చేపట్టే దళితుల ఆత్మగౌరవ ర్యాలీకి దళిత, అణగారిన వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ,ఎస్. నరేంద్రబాబు మాదిగ, వెంకటస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తనపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై ఏ సిట్టింగ్ జడ్జితోనైనా విచారణకు సిద్ధమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ప్రతి సవాల్ విసిరారు. ఇల్లు, కాలేజీ, సీలింగ్ ల్యాండ్, మఠం ల్యాండ్, కేపీహెచ్‌పీ భూములపై విచారణ చేయాలని, ఈ విషయంలో తాను భయపడే వ్యక్తిని కాదని అన్నారు. అలాగే అరికపూడి గాంధీ ఎస్టేట్ ఎవరిదో విచారణ జరిపిద్దామని డిమాండ్ చేశారు. సోమవారం కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'మీ పాత్ర లేకుండానే సర్వేనంబర్ 57 ప్రైవేట్ భూమి అవుతుందా..' అని ఎమ్మెల్యే గాంధీని ప్రశ్నించారు. 'పేదల భూములు కూలిస్తే కరెక్టు.. మీ భూములు కూలిస్తే హైడ్రా తప్పు ఎలా అవుతుంది. హైడ్రా కమిషనర్ చేసేది తప్పా.. అలా అయితే మీకు వ్యతిరేకంగా హైడ్రా హైకోర్టులో ఎందుకు పోరాడుతుందని..' అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసి పూర్తి విచారణ జరిపించండని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే అయి ఉండి ప్రీ లాంచ్ పేరిట అనుమతి లేని ప్లాట్లను విక్రయించింది ఎవరని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో కుటుంబ విషయాలు మాట్లాడటం తగదని హితవు పలికారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు


గుర్తుతెలియని వ్యక్తి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి మైసమ్మగుట్ట, వందన హోటల్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తుతెలియని (40) వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలై అపస్మారకస్థితికి చేరుకోగా.. 108 వాహనంలో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇతని గురించి ఆచూకీ తెలిస్తే 8712662705, 8712662183 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వెస్టర్న్ సిడ్నీ వర్సిటీతో ప్రొ.జయశంకర్ వర్సిటీ ఒప్పందం


అవగాహన ఒప్పందాలను మార్చుకుంటున్న ఇరు వర్సిటీల ఉప కులపతులు ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ప్రెసిడెంట్ జార్జ్ విలియం

రాజేంద్రనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సును సంయుక్తంగా అందించేందుకు వీలు కల్పించే కీలక ఒప్పందంపై వెస్టర్న్ సిడ్నీ వర్సిటీ, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతులు సంతకాలు చేశారు. దేశంలోనే తొలిసారిగా అందించే ఈ నాలుగేళ్ల సంయుక్త కోర్సులో విద్యార్థులు మూడేళ్ల రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలోను, మరో ఏడాది సిడ్నీలోని వెస్టర్న్ సిడ్నీ వర్సిటీలోనూ విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుంది. 40మంది విద్యార్థులు ఏడాది పాటు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలో చదువుకునే అవకాశాన్ని ఈ ఒప్పందం కల్పించనుందని ప్రొ.జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఆసక్తి కలిగిన విద్యార్థులు మరో ఏడాది చదివి ఎంఎస్సీ డిగ్రీ పొందే అవకాశం ఉందని అన్నారు.

వచ్చేనెల 19 నుంచి బుక్ ఫెయిర్


లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం. చిత్రంలో కె.రామచంద్రమూర్తి, తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు3(ఆంధ్రజ్యోతి) హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవం డిసెంబరు 19నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు కవి యాకూబ్ ప్రకటించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు సంబంధించిన లోగోను ఎమ్మెల్సీ కోదండరాం, సీనియర్ ఎడిటర్ కె. రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దోమల్‌గూడ ఎన్టీఆర్ స్టేడియం వేదికగా జరిగే పుస్తక ప్రదర్శనలో ఏపీ, తెలంగాణతో పాటు జాతీయ స్థాయి ప్రచురణ కర్తలు, పంపిణీదారుల నుంచి మొత్తం 260కు పైగా స్టాళ్లు కొలువుదీరనున్నట్లు తెలిపారు. స్టాల్ నిర్వహణకు నవంబరు 1 నుంచి 30వ తేదీ వరకు బాగ్‌లింగంపల్లి, ఎంహెచ్ భవన్‌లోని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. స్టాళ్ల లాటరీ వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. మిగతా వివరాలకు 7337411846, 9490099081, 9948106008 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, సంయుక్త కార్యదర్శి మంచి పుస్తకం సురేష్, కోశాధికారి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు
టీమ్‌వర్క్ ముఖ్యం

ఆంకో-న్యూట్రి సమ్మిట్‌లో డాక్టర్ సుబ్బారెడ్డి


సమ్మిట్‌లో మాట్లాడుతున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ కేర్‌లో మెరుగైన ఫలితాలను ఇవ్వడానికి క్లినిషియన్లు, ఇతర సపోర్టివ్ థెరపిస్టులు ఒక బృందంగా పనిచేయాలని ఐఏపీఎన్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారెడ్డి సూచించారు. ఇండియన్ అసోసియేషన్ ఫర్ పేరెంటల్ అండ్ ఎంటరల్ న్యూట్రిషన్, తెలంగాణ చాప్టర్ సహకారంతో సోమవారం బసవతారం ఆస్పత్రి ఆవరణలో ఆంకో-న్యూట్రి సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో క్యాన్సర్ సంరక్షణలో క్లినికల్ న్యూట్రిషన్ అభివృద్ధి చెందుతున్న పాత్రపై దృష్టి పెట్టి చర్చించారు. ఈ సందర్భంగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె. కృష్ణయ్య మాట్లాడుతూ వైద్యరంగంలో పురోగతిని తెలుసుకోవడానికి, రోగులకు మెరుగైన సంరక్షణ అందించడానికి ఈ సమ్మిట్ ఉపయుక్తమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అకాడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కె.కల్పనరఘునాథ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. ఫణి కోటేశ్వరరావు, క్లినికల్ న్యూట్రిషన్ డైటెటిక్స్ విభాగం చీఫ్ డైటీషియన్ వి. ప్రశాంతి సూర్యనారాయణ, అంతర్జాతీయ, జాతీయ వైద్యులు, వైద్య విద్యా అధ్యాపకులైన డాక్టర్ వెనెస్సా పుచ్చ(మెక్సికో), డాక్టర్ దేబ్‌జ్యోతి ధార్, డాక్టర్ దిలీప్ కుమార్ గుడిపూడి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కలను కాంగ్రెస్ సాకారం చేసింది

దళితుల ఆత్మగౌరవ సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్


అభివాదం చేస్తున్న మంత్రులు దామోదర్ రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు

బంజారాహిల్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దళితులు 30ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమైనదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో సోమవారం నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మార్గదర్శకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. దళితుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు అందరూ ఐక్యంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పేదల కోసం ఆనాటి ఇందిరమ్మ నుంచి నేటి రాహుల్‌గాంధీ తరం వరకు పోరాటం చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధిలో కూడా కాంగ్రెస్ కీలకంగా పనిచేస్తుందని, ఇలాంటి తరుణంలో జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీకే మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.రియాజ్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, పలు దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో 105 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

సైబర్ నేరాలకు సహకారం.. ముగ్గురి అరెస్ట్


రమేష్‌రెడ్డి, శ్రీను, శ్రీధర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరిస్తున్న ముగ్గురిని హైదరాబాద్ సైబర్ క్రైం అధికారులు అరెస్ట్ చేశారు. గుంటూరు తమ్మారెడ్డినగర్‌కు చెందిన రమేష్‌రెడ్డి(25), విశాఖపట్నం ఇందిరానగర్‌కు చెందిన గుండి శ్రీను(31), విజయవాడ గొల్లపూడికి శ్రీనివాసనగర్‌కు చెందిన గుర్రెపుకొండ శ్రీధర్ (43)లు పలువురి బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ఇచ్చి సహకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకుల నుంచి పెట్టుబడి పేరుతో వసూలు చేసిన డబ్బును వీరి ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. ఈ ముగ్గురు తమ ఖాతాల్లోకి వచ్చిన డబ్బును సైబర్ నేరగాళ్లకు పంపుతున్నారు. ఇలా డబ్బు బదిలీ చేసినందుకు గాను 10 నుంచి 20 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నారు. ఇటీవల నమోదైన 3 కేసుల విచారణలో, బాధితుల ఖాతా నుంచి డబ్బు దాదాపు రూ.54.04 లక్షలు వీరి ఖాతాల్లోకి బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ డబ్బులో కమీషన్ తీసుకొని మిగతా సైబర్ నేరగాళ్లకు చేరవేసినట్లు తేలడంతో సైబర్ క్రైం అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మొబైల్స్, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

1000 ఎకరాల్లో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు

» ఉన్న 300 ఎకరాలకు అదనంగా 700 ఎకరాల సేకరణ

» భూ సేకరణకు కలెక్టర్‌కు ఆదేశాలు.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

» ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో ముందడుగు : మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో ప్రతిపాదించిన విమానాశ్రయాన్ని 1,000 ఎకరాల్లో నిర్మించనుంది. ప్రస్తుతం అక్కడున్న ఏరోడ్రోమ్ పరిధిలోని సుమారు 300 ఎకరాల భూమికి అదనంగా మరో 700 ఎకరాలను సేకరించనుంది. ఆదిలాబాద్ జిల్లాలో జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్ అభివృద్ధి కోసం 700 ఎకరాల భూమిని సేకరించాలని ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సానుకూల నివేదిక ఇచ్చిన నేపథ్య ంలో ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియపై దృష్టిసారించింది. ఇక ఆదిలాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణంతో ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వాణిజ్య ం, పర్యాటకం, పరిశ్రమలు, అత్యవసర రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో ఇది కీలక అడుగు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంతో ముందుకెళ్తుందని తెలిపారు. కాగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులో భారత వాయుసేనతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. అటు ఎయిర్‌ఫోర్స్, ఇటు ప్రయాణికుల విమానాల రాకపోకలకు జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌ను నిర్మించనున్నారు. ఎయిర్‌ఫోర్స్, ప్రయాణికుల విమానాలు వేర్వేరు టెర్మినళ్ల వైపు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం ట్యాక్సీబేస్, లింక్‌బేస్ విధానంలో రన్‌వేను నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఎయిర్‌బస్-320 విమానాలు వచ్చేలా నిర్మించనున్నారు. పగలు-రాత్రి (డే అండ్ నైట్) విమానాలు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. సివిల్ ఏవియేషన్ విభాగంతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు మార్గం సుగమం కాగా.. తాజాగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి.

ఏవియేషన్ కార్పొరేషన్‌కు జేఎండీ నియామకం

తెలంగాణ ఏవియేషన్ కార్పొరేషన్(టీఎస్ఏసీఎల్)కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా రోహిత్ గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక నెల ముందు నోటీసు ఇచ్చి ఈ పదవికి సంబంధించిన కాంట్రాక్టును ఉపసంహరించుకునే హక్కు ప్రభుత్వానికి ఉన్నట్లు స్పష్టం చేసింది. ఆయన పదవిలో ఉన్నంత కాలం పూర్తి జీతభత్యాలు, అలవెన్సులు, అధికార సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. రోహిత్ గౌడ్ 18.08.2025 తేదీ నుంచే ఈ పదవిలో విధులు చేపట్టినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫ్రాన్స్ సంస్థతో ఈసీఐఎల్ ఒప్పందం

కుషాయిగూడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈసీఐఎల్ సంస్థ ఫ్రాన్స్‌కు చెందిన ప్రోయెంజిన్ ఎస్ఏఎస్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసే రసాయన యుద్ధ కారకాల గుర్తింపు పరికరాల తయారీ దిశగా ఈ ఒప్పందం కుదిరింది. ఈసీఐఎల్ డైరెక్టర్(టెక్నికల్) అనేష్ కుమార్ శర్మ, ప్రోయెంజిన్ ఎస్ఏఎస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయేల్ డెల్‌సార్ట్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈసీఐఎల్ తరఫున సంస్థ జనరల్ మేనేజర్ కమోడోర్ నీరజ్ ఉదయ్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు.

ఇప్పుడు కాకపోతే..

ఎస్‌ఎల్‌బీసీ ఎప్పటికీ పూర్తి కాదు

(మొదటిపేజీ తరువాయి)

సర్వే చేయగా, సీఎం మంత్రుల బృందం మరో హెలికాప్టర్‌లో వెనకాల వెళ్లి పరిశీలించింది. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు. "తెలంగాణ కోసం పోరాడింది నీళ్ల కోసమే. కానీ ఆ ఉద్దేశాన్ని కేసీఆర్ దెబ్బతీశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు 2014 నాటికే 30 కిలోమీటర్లకు పైగా సొరంగం తవ్వకాన్ని పూర్తి చేస్తే.. తర్వాత కేవలం 2 కిలోమీటర్లే తవ్వారు. కాంగ్రెస్‌కు పేరొస్తుందని, కమిషన్లు రావనే దురుద్దేశంతో కేసీఆర్, హరీశ్‌రావు పదేళ్ల పాటు ఎస్‌ఎల్‌బీసీని పడావు పెట్టారు. అది పూర్తయి ఉంటే పైసా ఖర్చు లేకుండా 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మంది ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించే అవకాశం ఉండేది. ఎస్‌ఎల్‌బీసీకి బదులు ఏఎమ్మార్పీ ఎత్తిపోతలపై ఆధారపడటం వల్ల ఏటా రూ.500 కోట్ల చొప్పున పదేళ్లలో రూ.5వేల కోట్లు విద్యుత్ బిల్లుల భారం పడింది" అని రేవంత్ విమర్శించారు. బీఆర్ఎస్ పడావు పెట్టిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రారంభించామని, దురదృష్టవశాత్తు టన్నెల్ కూలి కొందరు కార్మికులు చనిపోయారని పేర్కొన్నారు. ఎంతో ప్రయోజనకరమైన ఈ ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలనే సంకల్పంతో 'ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే'ను ప్రారంభించామని చెప్పారు. కేంద్రంతో మాట్లాడి సొరంగాల విషయంలో సుదీర్ఘ అనుభవం కలిగిన జనరల్ హర్పాల్ సింగ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రాను డిప్యూట్ చేసుకున్నామని వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే రెండేళ్లలో టన్నెల్‌ను పూర్తి చేస్తామని రేవంత్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీని పడావు పెడితే.. మరోవైపు ఏపీ పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 80వేల క్యూసెక్కులకు పెంచుకుని, భారీగా నీటిని తరలించుకుపోతోందని గుర్తు చేశారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే శ్రీశైలం ప్రాజెక్టు నిండినప్పుడల్లా కావాల్సినన్ని నీటిని తరలించుకోవచ్చని చెప్పారు.

గత సర్కారు తీరుతో తీవ్ర నష్టం

కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్‌తో పాటు పాలమూరు- రంగారెడ్డి సహా కృష్ణానదిపై చేపట్టిన ఏ ప్రాజెక్టును కూడా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేదని రేవంత్ మండిపడ్డారు. కృష్ణానదిలో ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల్లో తెలంగాణ వాటా 299 టీఎంసీలేనని ఏపీ వాదిస్తోందని.. గత ప్రభుత్వం మతిలేక చేసిన సంతకమే దానికి కారణమని విమర్శించారు. గత ప్రభుత్వం అన్నీ తప్పులు చేసి, అప్పులు చేసి దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్న హరీశ్‌రావు చిల్లర మాటలు ఆపేస్తే మంచిదని వ్యాఖ్యానించారు.





హెలీబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

ఈ తరహా సర్వే దేశంలోనే ప్రథమం: ఉత్తమ్

తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. అత్యాధునికమైన హెలిబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సాంకేతికతతో.. టన్నెల్ నిర్మాణం తలపెట్టిన 44 కిలోమీటర్ల పొడవునా ద్వారా సర్వే చేయనున్నట్టు తెలిపారు. దేశంలో హెలిబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే నిర్వహించడం ఇక్కడే ప్రథమమని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కావాలనే ఎస్‌ఎల్‌బీసీ పనులను పక్కనపెట్టారని ఆరోపించారు. కాగా, నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ నుంచి కాపాడటానికి ఎస్‌ఎల్‌బీసీ ఎంతో కీలకమని, ఎంత ఖర్చయినా సరే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ నుంచి ప్రారంభమయ్యే మూసీ నదిని కూడా పరిశుభ్రం చేస్తామని, ఖర్చుకు వెనకాడకుండా తమ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఈ విషయంలో జిల్లా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

ఏమిటీ 'హెలీబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే'?

ఎలాంటి తవ్వకాల అవసరం లేకుండానే విద్యుదయస్కాంత తరంగాల సాయంతో భూమిలో కొంత లోతు వరకు రాళ్లు, మట్టి, నీళ్లు, ఇతర అంశాల పరిస్థితి ఎలా ఉందో గుర్తించడానికి హెలికాప్టర్ సాయంతో చేపట్టే ప్రక్రియనే 'హెలిబార్న్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ జియో ఫిజికల్ సర్వే' అంటారు. హెలికాప్టర్‌కు బిగించిన పరికరాల్లోని ట్రాన్స్‌మిటర్ విద్యుదయస్కాంత తరంగాలను భూమివైపు విడుదల చేస్తుంది. ఆ తరంగాలు భూమి పొరలోకి చొచ్చుకెళ్లినప్పుడు.. ప్రతిస్పందనగా మట్టి, రాళ్లు, నీళ్లు, ఇతర అంశాల్లో విద్యుదయస్కాంత తరంగాలు ఉత్పత్తి అవుతాయి.వాటిని హెలికాప్టర్‌లోని రిసీవర్ గ్రహించి, విశ్లేషిస్తుంది. ఇప్పుడు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పొడవునా ఈ సర్వే చేసి.. మట్టి, రాళ్లు, నీళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయనేది గుర్తిస్తారు. అందుకు అనుగుణంగా టన్నెల్ పనులు కొనసాగిస్తారు.

కొడంగల్ నియోజకవర్గ పాఠశాలల్లో.. ఇక అక్షయ పాత్ర మధ్యాహ్న భోజనం

» ప్రస్తుతం అల్పాహారాన్ని అందిస్తున్న సంస్థ

» 14న గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌కు భూమిపూజ

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇక నుంచి మధ్యాహ్న భోజనాన్ని కూడా అందించేందుకు 'అక్షయపాత్ర' ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఇప్పటి వరకు ఉదయం అల్పాహారాన్ని మాత్రమే ఈ సంస్థ అందిస్తుండగా తాజాగా మధ్యాహ్న భోజనం అందించేందుకు కూడా సిద్ధమైంది. భోజనం తయారీకి అవసరమైన వంటగదికి ఈ నెలలో భూమి పూజ చేయనున్నారు. కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో అక్షయపాత్ర ఫౌండేషన్ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మించనుంది. దీనికి నవంబరు 14న భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ సంస్థ ప్రతినిధులు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. గతేడాది డిసెంబరు నుంచి కొడంగల్‌లోని 312 పాఠశాలల్లో దాదాపు 28 వేలమంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్న అక్షయ పాత్ర సంస్థ.. ఇక నుంచి మధ్యాహ్న భోజనం కూడా అందించనుంది.

బీఆర్ఎస్‌కు 11 ఎకరాల భూమి కేటాయింపుపై సమాధానం ఇవ్వండి

» ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో అత్యంత ఖరీదైన 11 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకు బీఆర్ఎస్‌కు కేటాయించడంపై సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేట గ్రామంలోని సర్వే నెంబర్లు 239, 240లో దాదాపు రూ. 1100 కోట్ల విలువ జేసే 11 ఎకరాల భూమిని కేవలం రూ.3.41 కోట్లకు బీఆర్ఎస్‌కు కేటాయిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కేటాయింపును కొట్టివేయాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ సంస్థతోపాటు, ఏ వెంకట్రాంరెడ్డి అనే న్యాయవాది వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై సోమవారం చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరడంతో ధర్మాసనం సమ్మతించింది. ప్రభుత్వ కౌంటర్ కోసం విచారణను 3వారాలపాటు వాయిదా వేసింది.

'స్థానిక' ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

» ఈ నెల 24 నాటికి నిర్ణయం తెలియజేయండి

» ఆరు నెలలకు మించి స్థానిక సంస్థలు ఖాళీగా ఉండొద్దు

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

» రిజర్వేషన్లు 50% మించకుండా ఎన్నికలు నిర్వహించవచ్చని మరోసారి సూచన



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల పదవీకాలం ముగిసిన ఆరు నెలల్లోపే ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(3) స్పష్టంగా పేర్కొంటోందని, అంతకు మించి ఖాళీగా ఉంచడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది నిర్ణయం తీసుకుని, ఈ నెల 24 నాటికి తమకు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) నిలిపేయడాన్ని సవాల్ చేస్తూ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ మండలం కొత్త కొమ్ముగూడానికి చెందిన సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో 9ను మాత్రమే హైకోర్టు నిలిపివేసిందని, ఎన్నికలను ఆపేయాలని ఏమీ చెప్పలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయినా ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎస్ఈసీ నిలిపివేయడం సరి కాదని, ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. "స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని మాకు తెలుసు. కానీ రాజ్యాంగం నిర్దేశించిన గడువును కూడా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ అనుసరించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల గడువు ముగిశాక ఆరు నెలలకు మించి ఖాళీగా ఉంచడానికి వీలుండదు" అని ధర్మాసనం పేర్కొంది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచించిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ నెల 24 నాటికి నిర్ణయాన్ని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ అదే రోజుకు విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హోంబలె ఫిల్మ్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



దీక్షిత్ శెట్టి




ప్రమాద స్థలంలో సహాయక చర్యలు


దుర్ఘటన జరిగిన వెంటనే కంకరను తొలగిస్తూ బస్సులో చిక్కుకున్న వారిని బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

టిప్పర్.. టెర్రర్

(మొదటిపేజీ తరువాయి)

మితిమీరిన వేగం కారణంగానే ఈ ఘోర ప్రమాదం సంభవించింది. చేవెళ్లకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మీర్జాగూడ గ్రామ శివారులో మూల మలుపు వద్ద గుంతను తప్పించేందుకు కుడివైపునకు వచ్చిన టిప్పర్ అనేక కుటుంబాల్లో విషాదానికి కారణమైంది. తాండూరు నుంచి సోమవారం తెల్లవారు జామున బయలు దేరి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు (టీఎస్ 34టీఏ 6354) వికారాబాద్‌ను దాటింది. మరోవైపు హైదరాబాద్ పటాన్‌చెరు సమీపంలోని ఇస్నాపూర్ నుంచి కంకర లోడ్‌తో టిప్పర్ వికారాబాద్ ప్రాంతానికి వస్తోంది. 40 టన్నుల కెపాసిటీ ఉన్న టిప్పర్‌కు 55 టన్నుల మేర బాడీకి మించి కంకరను పోశారు. దానికితోడు ప్రమాదానికి కాస్త ముందు టిప్పర్ పలు వాహనాలను వేగంగా దాటేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బస్సును ఢీకొనగానే టిప్పర్ వెనుక లోడ్ ఉన్న భాగం కంకరతో సహా ముక్కలైన బస్సు క్యాబిన్‌లోకి ఒరిగిపోయింది. క్యాబిన్ మొత్తం కంకర గుట్టగా మారిపోయింది. ప్రమాద తీవ్రతకు బస్సు కుడిభాగం మొత్తం ధ్వంసం కాగా, టిప్పర్ ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో బస్సులో డ్రైవర్ వెనుక భాగంలో ఉన్న ఆరు లైన్లలో సీట్లలో కూర్చున్న వారంతా దాదాపు చనిపోయారు. వీరి మీద టిప్పర్‌లోని కంకర అంతా కుప్పగా పడిపోవడంతో బస్సులోనే ప్రాణాలు వదిలారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు 72 మంది ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది. కొందరు సీట్లు లేక నిలుచొని ఉన్నారు. తెల్లవారుజాము కావడంతో ప్రయాణికుల్లో అనేక మంది నిద్రపోతున్నారు. 6:40 గంటల సమయంలో ఒక్కసారిగా బస్సు భారీ శబ్దంతో కుదుపునకు గురి కావడంతో ఎవరికీ ఏం జరిగిందో అర్థం కాలేదు. కళ్లు తెరిచి చూసే సమయానికి పక్క సీట్లలో ఉన్న వారు ఏమయ్యారో తెలియదు. బస్సు నిండా కంకర, దుమ్ము. అనేక మంది కంకర కింద పడి చనిపోగా, కొంతమంది అద్దాలు పగలగొట్టి బయట పడ్డారు. ఇంతలో బస్సు వెనుక నుంచి, ముందు నుంచి వాహనాల్లో వస్తున్న వారు, పొలాల వద్ద ఉన్న వారు పలువురిని రక్షించారు. డ్రైవర్‌తో కలిపి బస్సులో మొత్తం 18 మంది అక్కడికక్కడే చనిపోయారు. మరో 34 మంది గాయపడ్డారు. ప్రమాద ఘటనలో టిప్పర్ డ్రైవర్ కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుల్లో 13 మంది మహిళలు, 40 రోజుల వయసుగల ఒక శిశువు ఉన్నారు. మృతుల్లో వికారాబాద్ జిల్లా వాసులు 15 మంది ఉండగా ఇద్దరు హైదరాబాద్, ఒకరు కర్ణాటక, మరొకరు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు. గాయపడిన వారిలో 14 మందిని చేవెళ్ల పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీలో, 12 మందిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మరో 8 మందిని హైదరాబాద్‌కు తరలించారు. చేవెళ్ల ఆసుపత్రిలో క్షతగాత్రులకు వైద్య సేవలు అందించేందుకు గాంధీ ఆసుపత్రి నుంచి హుటాహుటిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంత్ నేతృత్వంలో ముగ్గురు డాక్టర్లను పంపినట్లు గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి తెలిపారు.

ఒక రోజు సెలవు కోసం వచ్చి

ఒక్క రోజు సెలవు కోసం హైదరాబాద్ నుంచి సొంతూరుకు వచ్చిన అనేక మందిని టిప్పర్ రూపంలో మృత్యువు కాటేసింది. మరో గంటన్నరలో హైదరాబాద్ చేరుకోవాల్సిన వాళ్లు తనువు చాలించారు. బస్సులో 30 మందికి పైగా విద్యార్థులు, ఉద్యోగులే ఉన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ సెలవులకు స్వగ్రామాలకు వస్తుంటారు. ఆదివారం సెలవు కావడంతో సొంత ఊర్లకు వచ్చారు. తిరిగి సోమవారం ఉదయమే



హైదరాబాద్‌కు వచ్చి చదువులకు, విధులకు వెళతారు. అందుకే సోమవారం ఉదయం లేదా సెలవు మర్నాడు ఈ బస్సు రద్దీగా ఉంటుంది.

హాహాకారాలు... ఆక్రందనలు

ప్రమాదంలో గాయపడిన వారంతా బస్సు నుంచి బయటపడేందుకు హాహాకారాలు, ఆక్రందనలు చేశారు. రోడ్డుపై ఇతర వాహనాల్లో వస్తున్న వారితో పాటు పొలాల వద్ద ఉన్న వారు వచ్చి కొందరిని రక్షించారు. పోలీసులకు ఫోన్ చేసి జేసీబీ యంత్రాలు తెప్పించారు. బస్సును కొందరు తమ వద్ద ఉన్న ఆయుధాలతో అద్దాలు పగలకొట్టి ప్రయాణికులను కాపాడారు. ఏదో విధంగా కంకర తొలగించి కొందరిని గాయాలతో బయటకు తీసుకొచ్చారు. కంకర తొలగించే సమయంలో ఊపిరాడక చనిపోయిన వారి శవాలు ఒకొక్కటిగా బయటపడ్డాయి. సగం కంకరలో ఇరుక్కు పోయిన వారు కాపాడాలని కేకలు వేస్తుండడం అందరినీ కంటతడి పెట్టించింది. నడుంలోతు కంకరలో కూరుకుపోయిన తోల్కొట్ట సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్ టీచర్ జయసుధను స్థానికులు కాపాడారు. కేరెల్లికి చెందిన ఆమె వికారాబాద్‌లో బస్సు ఎక్కారు. ఆమెతో పాటు రావాల్సిన మరో నలుగురు టీచర్లు ఈ బస్సు మిస్ అయ్యారు. ఇలా ఆ నలుగురు కూడా ప్రాణాలు దక్కించుకున్నారు. క్షతగాత్రులే ఎక్కువగా ఉండటంతో మొదట ప్రమాద తీవ్రత తెలియలేదు. కంకర కింద శవాల గుట్ట బయటపడడంతో అధికారులు, స్థానికులు విస్తుపోయారు.

అతి వేగమే ప్రమాదానికి కారణం

టిప్పర్ అతి వేగం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. టిప్పర్ వెనుక వస్తున్న వారు కూడా ఇదే విషయాన్ని అక్కడ చెప్పారు. బస్సు పరిమిత వేగంతోనే వస్తోందని, టిప్పర్ వాయువేగంతో వచ్చి మలుపు దగ్గర అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీ కొట్టి దానిపై పడిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుల సంఖ్య అధికంగా ఉండడానికి టిప్పర్‌లో అధిక లోడ్‌తో ఉన్న కంకరే కారణమని తేల్చారు. కంకర ప్రయాణికులపై కుప్పగా పడటమే ఎక్కువ ప్రాణ నష్టానికి కారణమైంది. దాదాపు ఎనిమిది మంది కంకర కింద కూరుకుపోయి ఊపిరాడక చనిపోయారని పోస్టుమార్టం చేసిన వైద్య సిబ్బంది ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వారి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, దీన్ని బట్టి ఊపిరాడకే చనిపోయినట్లుగా భావిస్తున్నామని చెప్పారు. టిప్పర్ కంకర తీసుకుని ఉదయం 4:30 గంటలకు సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ నుంచి బయలుదేరింది. టిప్పర్‌లో 55 టన్నుల కంకర లోడ్ చేసినట్లు తెలిసింది. టిప్పర్ బాడీపైకి కంకర ఉండడంతో బస్సుపై టిప్పర్ పడగానే ఒకేసారి కుప్పగా కంకర బస్సుపై పడిపోయింది. బస్సులో ఉన్న అనేక మంది దానికింద పడి ఊపిరాడక నిమిషాల్లోనే ప్రాణాలు వదిలారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు అరగంటలోపే బయటకు తీసినప్పటికీ అప్పటికే కొందరు ప్రాణాలు విడిచారు.


కంకరను తొలగిస్తున్న దృశ్యం

మృతుల వివరాలు

దస్తగిరి బాబా(31) (బస్సు డ్రైవర్)	బషీరాబాద్, వికారాబాద్ జిల్లా
కల్పన(42)	బోరబండ, హైదరాబాద్
తారిబాయ్(45)	దన్నారమ్ తండా, వికారాబాద్
గుర్రాల అఖిల (23)	యాలాల్, వికారాబాద్ జిల్లా
బచ్చన్ నాగమణి(55)	భాన్నారం గ్రామం, కర్నాటక
గోగుల గుణమ్మ (60)	బోరబండ, హైదరాబాద్
మాగళ్ల హనుమంతు(44)	దౌల్తాబాద్, వికారాబాద్
మహ్మద్ ఖలీద్(43)	తాండూరు, వికారాబాద్
తబస్సుమ్ జహాన్(38)	తాండూరు, వికారాబాద్
ఈడిగ నందిని(22)	తాండూరు, వికారాబాద్
ఈడిగ సాయి ప్రియ(18)	తాండూరు, వికారాబాద్
ఈడిగ తనూషా(20)	తాండూరు, వికారాబాద్
కిష్టాపూర్ వెంకటమ్మ(21)	తాండూరు, వికారాబాద్
లక్ష్మీ(40)	యాలాల్, వికారాబాద్
షీలా(20)	తాండూరు, వికారాబాద్
జహీరా ఫాతిమా(40 రోజుల చిన్నారి)	తాండూరు, వికారాబాద్
కుడుకుంట బెండప్ప(42)	యాలాల్, వికారాబాద్
ముస్కాన్ బేగం (21)	తాండూరు, వికారాబాద్
అక్షయ్ ధన్యా కామ్లే(24)(టిప్పర్ డ్రైవర్)	నాందేడ్, మహారాష్ట్ర



ప్రమాదానికి 45 నిమిషాల ముందు మారిన డ్రైవర్లు

ప్రమాదానికి దాదాపు 45 నిమిషాల ముందు వరకు యజమానే టిప్పర్‌ను నడిపినట్లు తెలిసింది. టిప్పర్ యజమాని లక్ష్మణ్‌ది మహబూబ్‌నగర్ జిల్లా బాలాపూర్. భార్య లచ్చిరామ్ నాయక్ పేరు మీద టిప్పర్ కొన్నాడు. అతని దగ్గర మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బీజేవాడి గ్రామానికి చెందిన ఆకాశ్ ధన్యా కామ్లే టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి ఆదివారం రాత్రి నుంచి కంకర టిప్పర్ నడుపుతున్నారు. సోమవారం ఉదయం 4:30కి ఇస్నాపూర్‌లోని ఓ క్రషర్‌లో కంకర లోడ్ నింపుకున్న తర్వాత అక్కడి నుంచి శంకర్‌పల్లి వరకు లక్ష్మణ్ నడిపించాడు. తనకు నిద్ర రావడంతో డ్రైవింగ్ నుంచి తప్పుకొని ఆకాష్‌కు డ్రైవింగ్ అప్పజెప్పాడు. ప్రమాద సమయంలో యజమాని నిద్రిస్తున్నట్లు సమాచారం. 45 నిమిషాల పాటు నడిపిన ఆకాశ్ మీర్జాగూడ మూల మలుపు దగ్గర ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఆకాశ్ మద్యం మత్తులో ఉన్నాడా? అనేది తేల్చేందుకు అతడి రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. బస్సు కండక్టర్ రాధ ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో తీవ్ర గాయపడిన లక్ష్మణ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మొదట వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. తలకు బలమైన గాయం కావడం, చెవుల్లో నుంచి రక్తం రావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వెంట పోలీసులు కూడా వెళ్లారు. ప్రమాదానికి దారితీసిన కారణాల గురించి పోలీసులు టిప్పర్ యజమాని లక్ష్మణ్‌ను ఆరా తీసినట్లు తెలుస్తోంది.


బస్సులో లోపల కంకరలో చిక్కుకుని కాపాడాలంటూ రోదిస్తున్న ప్రయాణికులు


కంకర కింద కూరుకుపోయి మృతిచెందిన ఓ మహిళ చేయి

19 మంది ప్రాణాలు తీసిన గుంత?

ఘోర ఘటనకు మూలమలుపు మీద ఉన్న గుంతే కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. చేవెళ్ల నుంచి వికారాబాద్ వైపు వెళ్లే రోడ్డుకు ఎడమవైపు గుంత ఉంది. టిప్పర్ డ్రైవర్ మలుపులో ఉన్న గుంతను చివరిక్షణంలో గుర్తించి వాహనాన్ని కాస్త కుడివైపు తిప్పాడు. ఈ క్రమంలో ఓవర్ లోడ్‌తో ఉన్న టిప్పర్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. తమవైపు దూసుకు వస్తున్న లారీ నుంచి తప్పించుకునేందుకు బస్సు డ్రైవర్‌కు ఎలాంటి మార్గం అక్కడ లేదు. అప్పటికే రోడ్డు చివరలో వెళుతోంది. కొన్నాళ్లుగా గుంత అలానే ఉంది. మరమ్మతులు చేసి ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదు. మలుపులోని గుంత ఇంత మంది ప్రాణాలు పోవడానికి కారణమైంది. మూలమలుపు, ఇరుకు రోడ్డు, రోడ్డుపై ఉన్న గుంతలతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు కూడా ఇదే భావిస్తున్నారు.



ట్రాఫిక్ జామ్

చేవెళ్ల ప్రమాదంతో వికారాబాద్-హైదరాబాద్ మధ్య ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఇరువైపులా దాదాపు 8 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దాంతో పోలీసులు వికారాబాద్ వెళ్లే వాహనాలను శంకర్‌పల్లి మీదుగా మళ్లించారు. వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను ఎన్కేపల్లి మీదుగా మళ్లించారు. సంఘటన స్థలానికి అదనపు డీజీ మహేశ్ భగవత్ సహా పలువురు ఉన్నతాధికారులు వచ్చారు.


ప్రమాదంలో ముగ్గురి బిడ్డలను కోల్పోయిన ఓ తల్లి ఆవేదన





తీరని శోకం..

హృదయవిదారకం

కన్నవారిని కోల్పోయిన చిన్నారులు.. బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులు.. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు.. నిండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపిన మీర్జాగూడ బస్సు ప్రమాద దుర్ఘటన జరిగినచోట సోమవారం ఉదయం కనిపించిన హృదయవిదారక దృశ్యాలివి! వైద్యం కోసం కొందరు.. బతుకుతెరువు కోసం మరికొందరు.. చదువుకోవడానికి ఇంకొందరు.. ఇలా రకరకాల కారణాలతో ఒకే గమ్యానికి బయల్దేరి.. దారి మధ్యలోనే మరలిరానిలోకాలకు తరలిపోయినవారి విషాదగాథలు.. తృటిలో ఈ ప్రమాదాన్ని తప్పించుకుని ప్రాణాపాయం నుంచి బయటపడ్డవారి భావోద్వేగాలు..

అమ్మానాన్నలను కోల్పోయి..

అనాథలైన ఇద్దరు బాలికలు.. ఆస్పత్రికి వెళ్తొస్తామంటూ

బయల్దేరిన తల్లిదండ్రులు మరణించడంతో కన్నీరుమున్నీరు



తాండూరు,యాలాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని ఇద్దరు బాలికలు.. సోమవారం బస్సుప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు! యాలాల మండలం హజీపూర్ గ్రామానికి చెందిన కుడుగుంట లక్ష్మి(43), బందెప్ప కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండడంతో.. భర్త బందెప్ప ఆమెను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తాండూరులో బస్సెక్కాడు! ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు. వీరికి ఇద్దరు కుమార్తెలు.. శిరీష, భవాని ఉన్నారు. విగతజీవులుగా మారిన తల్లిద్రండులను చూసి ఇద్దరూ కన్నీరుమున్నీరుగా విలపించారు. కన్నవారిని కోల్పోయి హృదయవిదారకంగా రోదిస్తున్న ఆ ఇద్దరినీ చూసినవారి గుండెలు తరుక్కుపోయాయి!

అమ్మ పొత్తిళ్లలో నిద్రిస్తూ..

శాశ్వతనిద్రలోకి!

బస్సు ప్రమాద మృతుల్లో 40 రోజుల

పసికందు, ఆ చిన్నారి తల్లి, తాత

ముద్దులు మూటగట్టే మనవరాలికి ఉయ్యాల వేడుక నిర్వహించి.. కూతుర్ని అత్తవారింటిలో దిగబెట్టడానికి బయల్దేరాడా తండ్రి! కానీ గమ్యం చేరేలోగానే బస్సు ప్రమాదంలో ముగ్గురూ దుర్మరణంపాలయ్యారు. తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన ఖాలిద్ కుమార్తె సాలిదా బేగం 40 రోజుల క్రితం పాపకు జన్మనిచ్చింది. దీంతో ఖాలిద్.. బంధువులను పిలిచి ఉయ్యాల వేడుక నిర్వహించడంతోపాటు రెండు రోజుల క్రితం చిల్లా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపకు జోరాఫాతిమాగా నామకరణం చేశారు. సోమవారం ఉదయం ఖాలిద్ తన కూతురిని అల్లుడి వద్ద దిగబెట్టేందుకు మనవరాలితో కలిసి హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరారు. కానీ మార్గమధ్యంలోనే మృత్యువు వారిని కబళించింది. ఆదమరచి అమ్మ ఒడిలో నిద్రిస్తున్న జోరాఫాతిమా.. అసలేం జరుగుతోందో తెలుసుకునేలోపే సాహిదాబేగం, ఖాలిద్.. ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు!



రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డలు మృతి చెందగా పక్కపక్కనే పడుకోబెట్టిన దృశ్యం



తాండూరు డిపో నుంచి బయల్దేరుతున్న ప్రమాదానికి గురైన బస్సు

పది రోజుల క్రితమే ఈ బస్సుకు డ్రైవర్‌గా చేరి!

- ప్రమాదంలో మృత్యువాత పడ్డ దస్తగిరి బాబా
- గతంలో బస్సు బ్రేకులు ఫెయిలైనా చాకచక్యంగా
- నడిపి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన దస్తగిరి

తాండూరు/బషీరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదానికి గురైన ఆర్టీసీ అద్దె బస్సు తాండూరులో సోమవారం ఉదయం 4.40గంటలకు బయలుదేరింది. నాలుగేళ్లుగా తాండూరు డిపో పరిధిలో నడుస్తున్న ఈ అద్దె బస్సుకు బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామానికి చెందిన దస్తగిరి బాబా(45) డ్రైవర్‌గా ఉన్నారు. అతడి కుటుంబం 20 ఏళ్లుగా తాండూరులో నివాసం ఉంటోంది. మొదట్లో దస్తగిరి బాబా టిప్పర్ లారీ డ్రైవర్‌గా పని చేశారు. ఐదేళ్లుగా ఆర్టీసీ పరిధిలోని అద్దె బస్సులను నడుపుతున్నారు. ప్రస్తుతం ప్రమాదానికి గురైన బస్సుకు డ్రైవర్‌గా పది రోజుల క్రితమే చేరారు. సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. గతంలో వికారాబాద్ వద్ద బస్సు బ్రేకులు ఫెయిల్ అయినప్పటికీ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులు కాపాడిన అనుభవం దస్తగిరికి ఉంది.

భర్త, పిల్లల కళ్ల ఎదుటే..

- కంకరలో కూరుకుపోయి మహిళ దుర్మరణం



తబస్సుమ్ బేగం (ఫైల్)

తాండూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు భర్త, ముగ్గురు పిల్లలతో బయల్దేరిన మహిళ.. వారి కళ్ల ఎదుటే కంకరలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. తాండూరు పట్టణం విశ్వంబరి కాలనీకి చెందిన తబస్సుమ్ (35) టైలరింగ్ చేస్తూ, ఆమె భర్త మజీద్ బేకరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తబస్సుమ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో.. హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చూపించుకునేందుకు అందరూ కలిసి బయల్దేరారు. సోమవారం ఉదయం తాండూరులో బస్సెక్కారు. కానీ, అదే ఆమెకు చివరి ప్రయాణమైంది. ప్రమాదం తాకిడికి బస్సులోకి వచ్చిపడ్డ కంకరలో కూరుకుపోయి తనువు చాలించింది.

బతుకు తెరువు కోసం బయల్దేరి..

- ఒక మహిళ మృతి.. ప్రాణాపాయస్థితిలో మరొకరు
- నిత్యం వారితోనే వెళ్లే మరో ఇద్దరు మహిళలు

వేరే బస్సు ఎక్కడంతో తప్పిన ప్రాణాపాయం



తారీ బాయి (ఫైల్)

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం బస్సులో వెళ్లి ఓ మహిళ ప్రాణాలు పోగొట్టుకోగా, మరో మహిళ ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో ఉంది. నిత్యం వారితోపాటే వెళ్లే మరో ఇద్దరు మహిళలు.. వేరే బస్సు ఎక్కడంతో ప్రాణాపాయం తప్పింది!! వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ధన్నారం తండాకు చెందిన తారీబాయి(45), బుజ్జిబాయి, లక్ష్మి, లలిత.. గండిపేట సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేసేందుకు నిత్యం వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంటారు. రోజూ నలుగురూ కలిసి వెళ్లేవారు. కానీ సోమవారం అందుకు భిన్నంగా.. తారీబాయి, బుజ్జిబాయి మాత్రమే వికారాబాద్ ఆర్టీసీ డిపో ముందు బస్సు ఎక్కారు. దారిలో జరిగిన ప్రమాదంలో తారీబాయి అక్కడే మృతి చెందగా బుజ్జిబాయి తీవ్రంగా గాయపడింది.

వేకువ జామునే గమ్యస్థానానికి చేరుకోవాలని!



చేవెళ్ల ఆస్పత్రిలో మృతదేహాల వద్ద బంధువుల రోదనలు

ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్‌తో వెళ్లడం వల్లే..

పటాన్‌చెరు రూరల్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): . ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారం నుంచి బయలుదేరింది. ఇక్కడి బేతేల్ ఎస్ఎంఎస్ క్వారీలో కంకర లోడ్ చేసుకుని బయలుదేరిన టిప్పర్.. కాసేపట్లో గమ్యస్థానానికి చేరుతుందనగా బస్సును ఢీ కొట్టింది. సాధారణంగా ఈ తరహా టిప్పర్‌లో 30టన్నులు తీసుకెళ్లాల్సి ఉండగా.. ఓవర్ లోడ్‌తో టిప్పర్ బయలుదేరినట్లు తెలిసింది. వాస్తవానికి లక్డారంలో పెద్ద ఎత్తున క్రషర్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి వందల సంఖ్యలో టిప్పర్లు వేకువజామునే బయలుదేరి అధికారులు విధులకు హాజరు కాకముందే తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఓవర్ స్పీడ్‌తో వెళ్తుంటాయి. ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ వల్లే తాజా ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సంగారెడ్డి మండలం హనుమాన్ తండాకు చెందిన టిప్పర్ యజమాని హనుమంతు సైతం ప్రమాద సమయంలో టిప్పర్‌లోనే ఉన్నారు. ప్రమాదంలో డ్రైవర్ మృత్యువాత పడగా, టిప్పర్ యజమానికి గాయాలయ్యాయి. కాగా, ప్రమాద వార్త తెలియగానే లక్డారంలోని క్రషర్ల యజమానులందరూ తాళాలు వేసి వెళ్లిపోయారు.



భార్యతో హనుమంతు (ఫైల్)

రైలు మిస్సయిందని బస్సెక్కితే..

- కుమారుణ్ని ఆసుపత్రిలో చూపించడానికి బయల్దేరి అనంతలోకాలకు



స్వల్ప గాయాలతో బయటపడిన కుమారుడు అశోక్

దౌల్తాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుణ్ని హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చూపించేందుకు బయల్దేరిన ఓ తండ్రి దారిలోనే దుర్మరణం పాలయ్యాడు. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన యం.హనుమంతుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తన కుమారుడు అశోక్‌ను హైదరాబాద్‌లోని ఈఎన్‌టీ ఆస్పత్రిలో చూపిద్దామని తాండూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అప్పటికే రైలు వెళ్లిపోవడంతో తాండూరులో బస్సు ఎక్కాడు. దారిలో జరిగిన ప్రమాదంలో హనుమంతు మృతి చెందగా కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

అయ్యో.. బిడ్డల్లారా..

బస్సు ప్రమాదంలో దుర్మరణంపాలైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు

బంధువుల పెళ్లికి వచ్చి వెళ్తుండగా విషాదం

హృదయవిదారకంగా రోదిస్తున్న తల్లిదండ్రులు



రోదిస్తున్న తండ్రి ఎల్లయ్యాగౌడ్

నవ్వుతూ తుళ్లుతూ తిరిగే ముగ్గురు అక్కాచెల్లెళ్లు.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలయ్యారు! పదిహేను రోజుల క్రితం జరిగిన సొంత అక్క పెళ్లిలో సందడి చేసిన ఆ ముగ్గురూ.. ఆ పెళ్లికి వేసిన పందిరి తీయకముందే ప్రాణాలు కోల్పోయారు!! నాలుగు రోజుల క్రితం జరిగిన బంధువు పెళ్లికి వచ్చి తిరిగి వెళ్తూ కన్నవారికి శాశ్వతంగా దూరమైపోయారు! జిల్లాలోని యాలాల మండలం పేర్కంపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎల్లయ్య గౌడ్‌కు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. వీరిలో పెద్ద కుమార్తె అనూషకు గత నెల 17న పెళ్లి జరిగింది. మిగతా ముగ్గురు కుమార్తెలు.. నందిని (డిగ్రీ మొదటి సంవత్సరం), సాయిప్రియ (డిగ్రీ మూడో సంవత్సరం), తనూష(ఎంబీఏ) హైదరాబాద్‌లో చదువుతున్నారు. అక్టోబరు 30న సమీప బంధువు పెళ్లి జరగడంతో.. ముగ్గురు అక్కాచెల్లెళ్లూ తాండూరు వచ్చారు. సోమవారం ఉదయం తెల్లవారు జామున తిరిగి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాదవార్త తెలుసుకుని పరుగుపరుగున అక్కడికి చేరుకున్న ఎల్లయ్యగౌడ్ దంపతులు.. తమ కుమార్తెలు ఇక లేరని తెలుసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. శవపరీక్ష అనంతరం యాలాల మండలం పేర్కంపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



గాయపడిన కండక్టర్‌ను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

అంతా క్షణాల్లోనే జరిగిపోయింది: కండక్టర్ రాధ

చేవెళ్ల, మొయినాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఘోర ప్రమాదం నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడ్డ బస్సు కండక్టర్ రాధ జరిగిన సంఘటనను గుర్తు చేసుకుని బోరున విలపించారు. చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. "ఎదురుగా టిప్పర్ చాలా వేగంగా రావడం నేనూ గమనించాను. అప్పటికే డ్రైవర్ బస్సును కిందకు దింపే ప్రయత్నం చేశారు. అలా చేయకపోయి ఉంటే ఇంకా చాలా మంది చనిపోయేవారు. ఒక్క క్షణంలోనే అంతా ఛిద్రమైపోయింది. తర్వాత ఏం జరిగిందో నాకు గుర్తు లేదు. తల నుంచి రక్తం కారుతుండడంతో చున్నీతో నేనే కట్టు కట్టుకున్నా." అని పేర్కొన్నారు.

ఎక్స్‌కవేటర్ తగిలి చేవెళ్ల సీఐకి గాయం

చేవెళ్ల, మొయినాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదం తర్వాత సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ కాలుకు గాయమైంది. బస్సులోని క్షతగాత్రులను బయటకు తీసే క్రమంలో ఎక్స్‌కవేటర్ సీఐ కాలుకు తగలడంతో రక్తగాయాలయ్యాయి. దీంతో వెంటనే ఆయన్ను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

వెల్లివిరిసిన మానవత్వం

సహాయక చర్యల్లో పాల్గొన్న స్థానికులు

మీర్జాగూడ ప్రమాద ఘటనలో క్షతగాత్రులను రక్షించేందుకు స్థానికులు, ఇతర వాహనాదారులు మానవత్వంతో స్పందించారు. మీర్జాగూడకు చెందిన వెంకటరెడ్డి, ఆలూరు ఉపసర్పంచ్ వెంకటేష్, ఖానాపూర్‌కు చెందిన అశోక్‌రెడ్డితో పాటు మరికొందరు స్థానికంగా తమకు ఉన్న పరిచయాలతో 5 ఎక్స్‌కవేటర్లను రప్పించారు. ప్రమాద స్థలికి ఆ వాహనాలు చేరుకునేసరికే ప్రాణాలతో ఉన్న వారందరినీ కాపాడి, ఆస్పత్రులకు తరలించారు. కంకరలో కూరుకుపోయిన వారినిఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు రక్షించారు. బాధితులను హుటాహుటిన చేవెళ్ల ఏరియా ఆస్పత్రి, పీఎంఆర్ వైద్యశాల, వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. వెనుక వచ్చిన బస్సులో ఉన్న కానిస్టేబుల్ వనజ.. సీపీఆర్ చేసి కొందరి ప్రాణాలు కాపాడారు. కాగా, ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించేందుకు కొందరు శ్రమిస్తుంటే మరికొందరు మాత్రం వీడియోలు తీసుకోవడంలో బీజీగా ఉన్నారని బాధిత మహిళ ఒకరు వాపోయారు.

ఆ బస్సులో వెళ్లి ఉంటే నా ప్రాణాలు పోయేవి...



నేను సైబరాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా. రోజూ వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తాను. తాండూరు నుంచి వచ్చే బస్సులోనే హైదరాబాద్‌కు వెళ్తాను. ఈ రోజు తాండూరు బస్సులో ఎక్కువ మంది ప్రయాణికులు ఉండడంతో.. దాంట్లో కాకుండా, తర్వాత వచ్చిన బస్సులో ఎక్కాను. నేను తాండూరు బస్సులో ఎక్కి ఉంటే.. నా ప్రాణాలూ పోయేవి. ఆ బస్సును టిప్పర్ ఢీకొన్న సమయంలో.. మా బస్సు కూడా అక్కడే ఉంది. ప్రమాదం జరగగానే వెంటనే మా బస్సు దిగి అక్కడికి వెళ్లి చూశాను. పరిస్థితి భయానకంగా కనిపించింది. ప్రయాణికులు కంకర కింద కుప్పలుతిప్పలుగా పడి ఉన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేసి.. అంబులెన్స్‌ల్లో ఎక్కించి ఆసుపత్రులకు పంపించాం.

- వనజ, పోలీస్ కానిస్టేబుల్, వికారాబాద్

చేవెళ్ల ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

చేవెళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 19 మంది బంధువులు, కుటుంబ సభ్యులు చేవెళ్ల ఆస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మృతి చెందిన తమ వారిని తలచుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు. దీంతో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో రోదనలు మిన్నంటాయి. ప్రమాద వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన ప్రముఖులు, ఉన్నతాధికారులు సైతం విషాదంలో మునిగిపోయారు. ఆస్పత్రిలో ఎక్కడ చూసినా హృదయ విదారక దృశ్యాలే కనిపించాయి. యాలాల్ మండలం హజీపూర్ గ్రామానికి చెందిన దంపతులు బందప్ప, లక్ష్మి మృతి చెందడంతో అనాథలైన వారి ఇద్దరు కూతుళ్లు శివలీల, భవాని ఆస్పత్రి వద్దకు చేరుకుని రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కలచివేసింది. గచ్చిబౌలిలో ఎంబీఏ చదువుకుంటున్న యువతి అఖిల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తాండూరు పటణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్యగౌడ్ ముగ్గురు కుమార్తెలు సాయిప్రియ, తనూష, నందిని.. ప్రమాదంలో మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతుల బంధువులను పోలీసులు, ప్రజాప్రతినిధులు సైతం ఓదార్చారు.



మృతదేహాలను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

సెల్‌ఫోన్ కోసం ఇంటికి వచ్చి..

కాలేజీకి వెళ్తూ యువతి మృత్యువాత



గుర్రాల అఖిలారెడ్డి(ఫైల్)

తాండూరు, యాలాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కూతుర్ని బాగా చదివించి ప్రయోజకురాలిని చేయాలనుకున్న తల్లిదండ్రుల ఆశలను.. బస్సు ప్రమాదం రూపంలో మృత్యువు చిదిమేసింది! యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమార్తె అఖిలారెడ్డి నాగపూర్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి ప్రస్తుతం గచ్చిబౌలి ఐబీఆర్ఎం కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. తల్లి సెల్‌ఫోన్ కొనిస్తానని చెప్పడంతో.. రెండు రోజులు సెలవుపై ఇంటికి వచ్చింది. అమ్మ కొనిచ్చిన సెల్‌ఫోన్ తీసుకుని.. సోమవారం ఉదయం బస్సులో కాలేజీకి బయలుదేరి దారిలోనే దుర్మరణం చెందింది. అఖిలారెడ్డికి లక్ష్మీనారాయణపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

వెనక వచ్చే బస్సు ఎక్కమనడంతో.. తృటిలో తప్పించుకున్న పది మంది

వారంతా హైదరాబాద్‌లో రకరకాల ఉద్యోగాలు చేసుకునేవారు! ఎక్కువ మంది టీచర్లే!! సోమవారం ప్రమాదానికి గురైన బస్సును.. వికారాబాద్ జిల్లా మన్నెగూడలో ఎక్కాల్సినవారు. కానీ, అప్పటికే బస్సు కిక్కిరిసిపోవడంతో.. వెనక ఇంకో బస్సు వస్తోందని, ఆ బస్సు ఎక్కాలని కండక్టర్ వారికి సూచించాడు. దీంతో వారు తర్వాత వచ్చిన బస్సు ఎక్కారు. తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

పక్కనున్నవారు మరణించినా..

ప్రమాదం జరిగిన బస్సులో డ్రైవర్ వెనుక వైపు.. మొదటి ఐదు వరసల్లో కూర్చున్నవారంతా మరణించారు. 6వ నంబర్ వరుసలో ముగ్గురు ఉండగా.. వారిలో వినయ్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన పక్కన కూర్చున్న ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో చనిపోయిన ముగ్గురు అక్కచెల్లెళ్లు ఆయన ముందు సీట్లోనే కూర్చోవడం గమనార్హం.

వెనక సీట్లలో కూర్చోవడంతో.. ఫ్యామిలీ సేఫ్

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో జరిగిన ఓ వేడుకకు హాజరయ్యేందుకు కుటుంబ సమేతంగా హైదరాబాద్ నుంచి తాండూరుకు వచ్చిన ఓ కుటుంబం.. బస్సు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయట పడింది. రాజధాని హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్‌కు చెందిన సయ్యద్ షఫీ, అబ్దుల్లా, ఖాజావలి.. అన్నదమ్ములు. వీరు తమ కుటుంబ సభ్యులతో కలిసి (మొత్తం 11 మంది) సోమవారం తాండూరు నుంచి హైదరాబాద్ బయలుదేరారు. బస్సులో ముందు సీట్లన్నీ భర్తీ కావడంతో వెనక సీట్లలో కూర్చోవడంతో వీరంతా గాయాలతో బయటపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



బస్సు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

- ఘటనపై స్వయంగా ఆరా తీసిన రేవంత్
- అత్యంత దురదృష్టకరం: ప్రధాని, రాష్ట్రపతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

చేవెళ్ల బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదం తనను కలచివేసిందని, అక్కడి దృశ్యాలు బాధ కలిగించాయని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం తరఫున సాయం అందించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాద స్థలికి వెళ్లాలని అందుబాటులో ఉన్న మంత్రులను కోరారు.క్షతగాత్రులను వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అంబులెన్స్‌లు, వైద్య సిబ్బందిని రంగంలోకి దింపడంతో పాటు సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆర్టీసీ ఎండీ, రవాణా శాఖ కమిషనర్, అగ్నిమాపకశాఖ డీజీ, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాదంపై స్వయంగా ఆరా తీసిన సీఎం.. అప్పటికప్పుడు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించారు. సహాయం కోసం 9912919545/ 9440854433 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్రపతి ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాద ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.7 లక్షలు

క్షతగాత్రులకు రూ.2లక్షల పరిహారం: మంత్రి పొన్నం

రూ.2లక్షలు, రూ.50వేల చొప్పున ప్రకటించిన పీఎంవో

హైదరాబాద్/పరిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.7లక్షలు(ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు, ఆర్టీసీ తరఫున రూ.2లక్షలు), క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని పేర్కొన్నారు. సమాచారం తెలియగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ప్రమాద స్థలికి బయలుదేరి వెళ్లిన ఆయన.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం శ్రీధర్‌బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. క్షతగాత్రుల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, వారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సు, టిప్పర్ కండీషన్, వేగానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రవాణాశాఖ ముఖ్య అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి పొన్నం అత్యవసర సమావేశం నిర్వహించారు. రోడ్లపై బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలు జరిగే ప్రాంతాల)ను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు దాడులు చేయడం కాకుండా.. నిరంతర ప్రణాళిక ఉండాలని సూచించారు. బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ ద్వారా రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడినవారికి రూ.50వేలు అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం ప్రకటించింది.

బస్సు ప్రమాదంపై రాజకీయం సరికాదు:దుద్దిళ్ల

హైదరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంపై రాజకీయం చేయడం సరికాదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని ఓ ప్రకటనలో న్నారు. ప్రతి దాన్నీ రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు అలవాటైందని, దీన్ని వారి విచక్షణకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. రోడ్డు విస్తరణ పనుల్లో ఎలాంటి అలసత్వం లేదని, ఆయా పార్టీల నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఎన్జీటీలో కేసు వేయడం వల్ల రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయని, ఆ విషయం తెలిసీ తమపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు.

యంత్రాంగం పనితీరు భేష్!

చేవెళ్లకు డిప్యూటీ సీఎం సహా పలువురు మంత్రులు

సహాయక చర్యలపై స్థానికుల ప్రశంసలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

మీర్జాగూడ ఘోర రోడ్డు ప్రమాదం వార్త తెలియగానే సర్కారు అప్రమత్తమైంది. ఆగమేఘాల మీద ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టిన పోలీసు, రెవెన్యూ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికార యంత్రాంగానికి స్థానికుల ప్రశంసలు లభించాయి. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడటంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా ఇతర మంత్రులను ప్రమాద స్థలానికి పంపారు. హైదరాబాద్ నుంచి అంబులెన్సులు, ఇతర వైద్య సిబ్బందిని భారీగా తరలించారు. స్వల్ప గాయాలైన వారిని చేవెళ్లలోని మహేందర్ రెడ్డి వైద్య కళాశాల, వికారాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రులకు.. తీవ్ర గాయాల పాలైన వారిని వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. బాధితులకు అవసరమైన అన్ని బ్లడ్ గ్రూపుల రక్తం సిద్ధం చేశారు. చేవెళ్లకు చేరుకున్న మంత్రులు బాధితులను పరామర్శించి.. మార్చురీకెళ్లి మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. మరోవైపు, ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో ఆధార్ కార్డుల సాయంతో మహిళా మృతులను అధికారులు గుర్తించారు. కానీ పురుషులు, కర్ణాటక మహిళ, ఆధార్ లేని మహిళను గుర్తించడం కష్టమైనా.. చివరకు వివిధశాఖల సమన్వయంతో గుర్తించి బాధితులకు అప్పగించారు. అయితే, ఎక్కువ మంది మృతులుండటంతో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం ఆలస్యమవుతుందని.. మృతదేహాలను ఉస్మానియాకు తరలించాలన్న అధికారుల యత్నాలపై స్థానిక ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. దీంతో క్షతగాత్రులకు చికిత్సతోపాటు మృతదేహాలకు చేవెళ్లలోనే పోస్టుమార్టం నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం హైదరాబాద్ నుంచి 46 వైద్య బృందాలను ఆగమేఘాలపై తరలించింది. చేవెళ్ల, ఉస్మానియా, తాండూరు, వికారాబాద్ బోధనాస్పత్రుల ఫోరెన్సిక్ వైద్యులతో మధ్యాహ్నం 2 గంటలకే పోస్టుమార్టం పూర్తి చేశారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయ్యే వరకూ మార్చురీ వద్దే ఉన్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పనితీరుకు అభినందనలు లభించాయి. 19 మృతదేహాలను బాధిత కుటుంబాలకు అప్పగించేందుకు ఒక్కో అంబులెన్స్‌లో ఒక్కో అధికారి చొప్పున అధికారులను గ్రామాలకు పంపి ప్రశంసలందుకున్నారు.

ప్రమాదంలో 'పంతొమ్మిది'

- ఏపీ, తెలంగాణ, రాజస్థాన్‌లలో దుర్ఘటనలు
- ప్రతి చోటా 19 మంది దుర్మరణం

అమరావతి, నవంబరు 3: వరుసగా ప్రమాదాలు... బాధిత కుటుంబాలనే కాదు, ఇతరులనూ కలచివేసిన విషాదాలు! ప్రతి ప్రమాదంలో 19 మంది చొప్పున మరణించారు! గత నెల 24వ తేదీన కర్నూలు నగర సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. అంతకుముందే ప్రమాదానికి గురై రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఢీకొనడం... దానిని అలాగే ఈడ్చుకుంటూ వెళ్లడంతో మంటలు చెలరేగి 19 మంది సజీవ దహనమయ్యారు. ఇక... సోమవారం తెలంగాణలోని చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును కంకర టిప్పర్ ఢీకొనడంతో 19 మంది చనిపోయారు. సోమవారమే... రాజస్థాన్‌లో ఒక తాగుబోతు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు 19 మంది బలైపోయారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు.

రాకాసి రహదారి!

జాతీయ రహదారి 163 మార్గంలో ప్రమాదకరంగా 46 కిలోమీటర్ల రోడ్డు

- తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ఇరుకైన రహదారి
- ఇప్పటికే వందల్లో ప్రమాదాలు.. మృతులు
- తాజా ఘటనలో 19 మంది దుర్మరణం
- రోడ్డు విస్తరణకు ప్రభుత్వాల నిర్ణయం
- రోడ్డుపై ఉన్న మర్రిచెట్లకు హాని అంటూ.. ఎన్‌జీటీలో పర్యావరణ ప్రేమికుల పిటిషన్
- ఏళ్ల తరబడి రహదారి విస్తరణకు ఆటంకం
- తాజాగా పనుల ప్రారంభానికి ఎన్జీటీ ఓకే
- ఇంతలోనే ప్రమాదం



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో భాగంగా ఉన్నా.. అదో ఇరుకైన రోడ్డు. పైగా, రోడ్డుపై ఎన్నో గుంతలు.. గతుకులు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణ నుంచి కర్ణాటక ప్రాంతానికి వెళ్లే మూడు అత్యంత కీలకమైన రహదారుల్లో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ఒకటి. ఎన్‌హెచ్-163గా పిలుస్తున్న ఈ రహదారిపై నిత్యం ప్రయాణం చేసేవారు దీనిని రాకాసి రహదారిగా పేర్కొంటున్నారు. ఏ మలుపు వద్ద ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో... ఎక్కడికక్కడ గుంతలు పడిన రోడ్డుపై ఎక్కడ పడిపోతామోనన్న భయం వెంటాడుతూనే ఉంటోందని వాపోతున్న పరిస్థితి. ఐటీ కారిడార్ ప్రాంతంలోని తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి మొయినాబాద్, చేవెళ్ల మీదుగా పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్, ఇతర ప్రాంతాలకు ఇది ప్రధాన రహదారి. ముఖ్యంగా తెలంగాణ పోలీసు అకాడమీ వద్ద ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ నుంచి మన్నెగూడ వరకు ఉన్న రోడ్డు ఏళ్ల తరబడిగా విస్తరణకు నోచుకోకపోవడంతో ఇరుకుగా ఉండి చాలా చోట్ల మూల మలుపులు ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ, ప్రాణాలు పోతున్నాయి. ఇప్పటికే అనేక ప్రమాదాల్లో 250 మంది దాకా ప్రాణాలు కోల్పోగా 600 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రభుత్వాలు ప్రయత్నించినా.. ఇందుకు రోడ్డు వెంట ఉన్న మర్రిచెట్లను తొలగించాల్సి ఉండటంతో పర్యావరణ ప్రేమికులు అడ్డు తగిలారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)లో వారు పిటిషన్లు వేయడంతో ఏళ్ల తరబడి జాప్యం జరిగింది.

ఎన్‌జీటీ అనుమతి ఇచ్చినా..

రోడ్డు విస్తరణకు ఎన్‌జీటీ ఇటీవలే అనుమతి ఇచ్చినా.. పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగానే మరో ఘోర ప్రమాదం సంభవించింది. ఏకంగా 19 మందిని బలి తీసుకుంది. జాతీయ రహదారి 163 మార్గంలో హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు సుమారు 46 కిలోమీటర్ల మేర ఉన్న ఇరుకు రోడ్డులో ఈ ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారి-163 ఛత్తీస్‌గఢ్‌లోని భోపాలపట్నం వద్ద ప్రారంభమై.. తెలంగాణలోని వరంగల్- హైదరాబాద్- మన్నెగూడ- చేవెళ్ల- కొడంగల్ మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు ఉంటుంది. ఈ మధ్యలో తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ఇరుకుగా ఉంటుంది. అంతేకాకుండా రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ గుంతలు పడ్డాయి. 46 కిలోమీటర్ల దూరంలో ఏకంగా 290 గుంతలు.. వీటిలో చిన్నగుంతలు 265 ఉండగా, పెద్ద గుంతలు 25 ఉన్నాయి. వీటితోపాటు 66 ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. ప్రమాదకరమైన ఈ రహదారిని విస్తరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. విస్తరణ బాధ్యతను భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఆ వెంటనే 2022 మార్చి 17న పనులను ఓ కంపెనీకి అవార్డు చేశారు. 2022 మే 9న ఒప్పందం కుదిరింది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 18 నుంచి మన్నెగూడ వరకు సుమారు 46 కి.మీ మేర 4 వరసలతో రోడ్డు విస్తరణ కోసం రూ.920 కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. 18 అండర్‌పాస్‌లు, 2 బైపాస్ రోడ్లతో చేపట్టే రోడ్డు విస్తరణకు సుమారు 145 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. అన్నీ అనుకున్నట్టు జరిగితే 2024 నవంబరు 27న పనులు మొదలై 2026 నవంబరు నాటికి పూర్తికావాలి. ఇది ఎన్‌హెచ్‌ఏఐకి, పనులు దక్కించుకున్న కంపెనీకి మధ్య జరిగిన ఒప్పందం.

మర్రిచెట్లకు హాని కలుగుతుందని..!

రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన మార్గం మధ్యలో 75 ఏళ్ల వయసు కలిగిన దాదాపు 915 మర్రిచెట్లు ఉన్నాయి. రహదారి విస్తరణతో ఈ మర్రిచెట్లకు హాని కలుగుతుందంటూ పలువురు పర్యావరణ ప్రేమికులు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో 2022లోనే పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌తోనే రోడ్డు విస్తరణ విషయంలో పీటముడి పడింది. దాంతో 2022 నుంచి ఎన్‌జీటీలో కేసు నడుస్తోంది. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ పలు వివరాలను ట్రైబ్యునల్‌కు సమర్పిస్తూ వచ్చింది. చివరగా ఈ ఏడాదిలో ఇచ్చిన సమగ్ర వివరాలతో ట్రైబ్యునల్ సంతృప్తి చెందింది. ఫలితంగా అక్టోబరు 31న పిటిషన్‌ను వెకేట్ చేస్తూ.. పనులను త్వరగా మొదలుపెట్టాలంటూ తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం విస్తరణ చేయాల్సిన రోడ్డుపై ఉన్న మొత్తం 915 మర్రిచెట్లలో 150 చెట్లను వేరే చోటకు (ట్రాన్స్ లొకేషన్) మార్చనున్నారు. మిగిలిన వాటిని అలాగే ఉంచి ఆ చెట్లకు ఇరువైపులా రోడ్డు నిర్మించేలా ఎన్‌హెచ్‌ఏఐ డి జైన్‌ను రూపొందించింది. ఈ వివరాలను ట్రైబ్యునల్‌కు నివేదించింది. తాజాగా ట్రైబ్యునల్‌లో కేసు వెకేట్ కావడంతో పనులు కూడా మొదలుపెట్టేలా సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే ఈ రోడ్డు విస్తరణకు 2022లోనే ఓ నిర్మాణ సంస్థతో ఒప్పందం కుదరడంతో.. పనులు ప్రారంభించేందుకు ఎలాంటి ఇబ్బందుల్లేవని, పనులు మొదలుపెట్టిన తరువాత 24 నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒప్పందం ప్రకారం పనులు పూర్తయ్యాక రహదారి నిర్వహణను 15 ఏళ్లపాటు సంబంధిత కంపెనీయే పర్యవేక్షించనుంది.

విషాదానికి బాధ్యులెవరు?

చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం జరిగిన బస్సు ప్రమాదం.. రహదారి విస్తరణ జరగకపోవడం, మరమ్మతులు చేయకపోవడం చోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు. విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చినా మర్రిచెట్లకు హాని కలుగుతుందన్న కారణంగా పనులకు అడ్డంకి ఏర్పడిందని అంటున్నారు. ఫలితంగా ఏళ్ల తరబడి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, జనం ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు బాధ్యులెవరని బస్సు ప్రమాద బాధిత కుటుంబాలు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పర్యావరణంతోపాటు ప్రజల ప్రాణాలు కూడా ముఖ్యమే కదా అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన గ్రానైట్ లారీ.. ఒకరి మృతి

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- దెబ్బతిన్న బస్సులు.. ప్రయాణికులు సురక్షితం
- ఆటో బోల్తా... 8 మంది కూలీలకు గాయాలు

తొర్రూరు రూరల్/ఇబ్రహీంపట్నం/మునగాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం జరిగిన మూడు వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామంలో జరిగింది. కరీంనగర్ నుంచి ఏపీలోని కాకినాడకు గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ నాంచారిమడూర్‌లో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంట్లో ఉన్న తాడూరు లక్ష్మి (70) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మరో ప్రమాదంలో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితాల రామచంద్రాపురంలో ఓ ఆటో వెనుక టైరు పేలడంతో అది అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మహిళా కూలీలకు గాయాలయ్యాయి. మునగాల మండలం కృష్ణానగర్‌కు చెందిన మహిళా వ్యవసాయ కూలీలు మిర్చి ఏరేందుకు ఖమ్మం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో ముందువెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతినగా.. ప్రయాణికులకు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలోని శేరిగూడ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఏపీలోని పొదిలి డిపోకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో శేరిగూడలో నిర్మాణంలో ఉన్న ఓ బ్రిడ్జి వద్ద ఈ ఘటన జరిగింది. ఎలాంటి సూచిక బోర్డులు లేకుండా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రయాణికులకు పరిహారమేది

సేఫ్టీ సెస్ పేరిట వసూలు చేస్తున్న ఆర్టీసీ.. ప్రతి ప్రయాణికుడి నుంచి రూ.1 వసూలు

- అయినా ప్రయాణికులకు దక్కని బీమా ధీమా
- బాధిత కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు



హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)కు చెందిన బస్సుల్లో ప్రయాణిస్తూ అనుకోకుండా ప్రమాదం జరిగితే.. బాధిత కుటుంబాలకు ఎటువంటి భరోసా లేకుండా పోతోంది. బస్సు ప్రమాదాల్లో ప్రయాణికులు మరణించడం ఒక విషాదమైతే.. బాధిత కుటుంబాలకు పరిహారం అందించడమన్నది ప్రహసనంగా మారింది. ఆర్టీసీలో ప్రయాణికులకు బీమా లేకపోవడమే ఇందుకు కారణం. ప్రమాదాలు జరిగి ఎవరైనా మృతి చెందితే.. అప్పటికప్పుడు ఎంతో కొంత పరిహారం చెల్లిస్తున్నారు. అది కూడా పెనువిషాదం జరిగితే రూ.5 లక్షలు, పెద్దగా వెలుగులోకిరాని ఘటనల్లో రూ.2 లక్షలు, రూ.3 లక్షలు మాత్రమే ఉంటోంది. అదే సమయంలో ఆర్టీసీ మాత్రం సేఫ్టీ సెస్ పేరుతో ప్రతి ప్రయాణికుడి నుంచి రూ.1 వసూలు చేస్తుంది. కానీ, బీమా విషయంలో ప్రయాణికుడికి ధీమా కల్పించేందుకు మాత్రం ఆ సొమ్మును వినియోగించడం లేదు. అదే రైల్వేలో అయితే ప్రతి ప్రయాణికుడికీ కచ్చితంగా రూ.8 లక్షల బీమా ఉంటుంది. ప్రమాదవశాత్తూ రైలు ప్రమాదం జరిగి చనిపోతే రూ.8 లక్షల బీమా పరిహారం వస్తుంది. దాంతోపాటు ప్రభుత్వం చెల్లించే పరిహారం బాధిత కుటుంబానికి అందుతుంది. బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వడంలో ఆర్టీసీకీ ప్రణాళిక ఉండాలని అనేక సంఘటనలు చెబుతున్నా.. సంస్థ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రయాణికులకు ఎలాంటి బీమా సదుపాయం కల్పించడం లేదు. ఘోర ప్రమాదంలో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్న సమయంలో పరిహారం ప్రకటించి చేతులు దులుపుకొంటున్నారు. నాడు కొండగట్టు ఘాట్‌రోడ్డులో బస్సు బోల్తాపడి 65 మంది ప్రయాణికుల మృతి, పలువురు గాయపడిన సందర్భంలో మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడ్డవారికి రూ.2.50 లక్షలు పరిహారంగా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పరిహారం కోసం బాధిత కుటుంబాలు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. తాజా ప్రమాదంలోనూ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడ్డవారికి రూ.2 లక్షలు పరిహారం ప్రకటించింది. అయితే ఈ పరిహారాన్ని పేరుకు ప్రభుత్వం ప్రకటించినా.. ఆ మొత్తం ఆర్టీసీ నుంచే చెల్లిస్తారు. ఇలా పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ప్రభుత్వం స్పందించి పరిహారం ప్రకటిస్తున్నా.. తరచూ జరిగే ప్రమాదాల్లో ఒకరు, ఇద్దరు మృతి చెందితే వారికి అందే పరిహారం కూడా నామమాత్రంగానే ఉంటోంది. ఫలితంగా అయిన వారిని కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా లేకుండా పోతోంది.

ప్రయాణికుల నుంచి సేఫ్టీ సెస్ వసూలు..

తరచూ ఎక్కడో ఒకచోట జరుగుతున్న ప్రమాదాల కారణంగా మృతుల కుటుంబాలు, బాధితులకు అందించే పరిహారాన్ని ఆర్టీసీ ప్రయాణికుల నుంచే వసూలు చేస్తోంది. గతంతో పోలిస్తే ఆర్టీసీ ప్రమాదాల సంఖ్య పెరగడం, పరిహారం చెల్లింపు సంస్థకు ఆర్థికభారంగా మారడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతి లక్ష కిలోమీటర్లకు 0.6 శాతంగా ఉన్న ప్రమాదాల తీవ్రత.. ఐదేళ్లుగా క్రమంగా పెరుగుతోంది. 2022లో ప్రతి లక్ష కిలోమీటర్లకు 0.7 శాతానికి పెరిగింది. 2022లో ఆర్టీసీ బస్సు ప్రమాదాల్లో మృతి చెందినవారి కుటుంబాలు, గాయపడ్డ వారికి సంస్థ 24.21 కోట్ల పరిహారం చెల్లించింది. ఇలా ఏటా పరిహారం చెల్లింపు ఆర్టీసీకి అదనపు భారంగా మారడంతో ప్రయాణికుల నుంచే ఆ మొత్తాన్ని రాబడుతోంది. ఇందుకోసం ప్రతి ప్రయాణికుడి నుంచి సేఫ్టీ సెస్ పేరుతో డబ్బులు వసూలు చేస్తోంది. 2022 మార్చిలో అప్పటి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఇందుకు సంబంధించి సర్క్యులర్ జారీ చేశారు. అప్పటి నుంచి గత నాలుగేళ్లుగా ఈ సేఫ్టీ సెస్‌ను వసూలు చేస్తున్నారు. అయితే ఈ విషయం బస్సు టికెట్‌పై ప్రత్యేకంగా ఎక్కడా పేర్కొనరు. అన్ని ఆర్టీసీ బస్సుల్లో సగటున ప్రతి రోజూ 6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ లెక్కన రోజూ రూ.6 లక్షల చొప్పున ఏడాదికి రూ.21.90 కోట్లు ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారు.ప్రమాదాలు జరిగి మృతి చెందినవారి కుటుంబాలతోపాటు గాయపడ్డ వారికి పరిహారాన్ని ఈ మొత్తం నుంచే చెల్లిస్తున్నారు.

కిక్కిరిసిన ప్రయాణాలు..

ప్రమాదంలో ప్రాణాలు!

ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి జనంతో సమస్యలు

- కొండగట్టు ప్రమాదం తర్వాతా పాఠాలు నేర్వని ఆర్టీసీ

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో ప్రయాణం సురక్షితమని ఆ సంస్థ చెబుతున్నా.. ప్రయాణికులకు భద్రతకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంటోంది. పరిమితికి మించిన ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు భారీగా ప్రాణనష్టానికి కారణం అవుతున్నాయి. బస్సుల సీట్ల సామర్థ్యం 40-45 వరకు ఉంటే.. 60 నుంచి 120 మంది ప్రయాణికులు ఉంటున్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఘాట్ రోడ్డులో 2018లో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 70 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. దుర్ఘటన సమయంలో బస్సులో 108 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆ ఘోర ప్రమాదం తర్వాత కూడా ఆర్టీసీ పాఠాలు నేర్వలేదు. తాజాగా సోమవారం ఉదయం చేవెళ్ల సమీపంలో జరిగిన ప్రమాద సమయంలోనూ బస్సులో 72 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇటీవల జగిత్యాల నుంచి నిర్మల్‌కు 150 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అధిక బరువు కారణంగా టైర్లు ఓడిపోయి రోడ్డుపై కుప్పకూలడం గమనార్హం.

సరిపడ బస్సులు లేకపోవడంతోనే..

హైదరాబాద్ సిటీ బస్సులతోపాటు జిల్లా సర్వీసులలోనూ నిత్యం పరిమితికి మించి ప్రయాణికులు ఉంటున్నారు. ప్రయాణికుల రద్దీ మేరకు ఆర్టీసీ బస్సుల్ని సమకూర్చుకోకపోడం, వచ్చిన బస్సు వదిలేస్తే మరో బస్సు ఎప్పుడు వస్తుందోనన్న ఆందోళనతో ఎక్కువ మంది ఎక్కుతుండటమే దీనికి కారణం. బస్సు డ్రైవర్, కండక్టరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా కూడా ప్రయాణికులు వినకపోవడమూ కారణమే. గతంలో ఆర్టీసీ బస్సుల్లో నిత్యం 45-50 లక్షల మంది ప్రయాణించేవారు. ఇప్పుడు సగటున 60లక్షల మందికిపైగా ప్రయాణిస్తున్నారు. కానీ ఆ మేరకు ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగలేదు. ఉన్నవాటిలో చాలా బస్సులు పాతబడిపోయాయి. కొత్త బస్సులు సమకూర్చుకోవడంపై ఇటీవల ఆర్టీసీ దృష్టి సారించినా అది నత్తనడకనే సాగుతోంది. ఆర్టీసీ బస్సులు ఢీకొనడం, ఇతర ప్రమాదాలకు సంబంధించి 2024-25లో 754 ప్రమాదాలు జరగ్గా 315 మంది మరణించారు, 704 గాయపడ్డారు. 2025-26 సెప్టెంబరు నాటికి 374 ప్రమాదాల్లో 154 మృతిచెందగా 413 మంది గాయపడ్డారు.



ఒకే ఒక్క బస్సు సీజ్..

తెలంగాణవ్యాప్తంగా నిత్యం వందల సంఖ్యలో బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికుల్ని తరలిస్తున్నారు. తరచూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ రవాణా శాఖ ఆర్టీసీపై ఒకేఒక్క కేసు నమోదు చేయడం గమనార్హం. జూలైలో జగిత్యాల నుంచి 112 మందితో పెగడపల్లికి వెళ్తున్న ఓ బస్సును రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి నిబంధనలు పాటించడం లేదని సీజ్ చేసారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులపై నమోదైన, సీజ్ చేసిన కేసు ఇదొక్కటే.

ఊపిరాడకనే చాలా మంది మృతి: ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి

టిప్పర్ అతివేగమే చేవెళ్ల వద్ద బస్సు ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ అతివేగంగా ఢీకొట్టడంతో బస్సు ముందు భాగంతోపాటు ఎడమవైపు పూర్తిగా ధ్వంసమైందని.. టిప్పర్‌లోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక ఎక్కువమంది మృతి చెందారని వివరించారు.

స్పోర్ట్స్

విజయ గీతాలాపనలో..

వరల్డ్‌కప్ గెలిచిన ఆనందంలో భారత మహిళా ఆటగాళ్లు డీవై పాటిల్ మైదానంలో అంతులేని సంబరాల్లో మునిగారు. దీంట్లో భాగంగా కోచ్ మజుందార్‌తో కలిసి పిచ్ దగ్గరికి వెళ్లి తమ టీమ్ సాంగ్‌ను ఆలపించారు. 'సాత్ మే ఛలేంగే.. సాత్‌మే ఉఠేంగే.. హమ్ హై టీమిండియా' అంటూ సాగే ఈ పాటను చప్పట్లు చరుస్తూ వీరంతా హుషారుగా ఆలపించారు. బీసీసీఐ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

కాసుల గలగల.. వజ్రాల మిలమిల

టీమిండియాకు భారీ నజరానాలు

ముంబై: దేశ మహిళా క్రికెట్ చరిత్రలో తొలి వన్డే ప్రపంచకప్ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేనపై కాసుల వర్షం కురుస్తోంది. కప్ గెల్చినందుకు విజేతకు ఐసీసీ అందించే రూ.40 కోట్ల రూపాయలకు తోడు, బీసీసీఐ తమ వంతుగా రూ.51 కోట్లు ప్రకటించింది. జట్టు సభ్యులు, సహాయ సిబ్బంది, వారిని ఎంపిక చేసిన సెలెక్షన్ కమిటీకి కలిపి ఈ నగదు పురస్కారాన్ని అందించనున్నట్టు బీసీసీఐ సోమవారం వెల్లడించింది. ఇక, పేసర్ రేణుక సింగ్ ఠాకూర్‌కు హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోటి నగదు బహుమతిని, ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వనున్నట్టు ప్రకటించారు. అలాగే మధ్యప్రదేశ్‌లోని ఛతర్పూర్‌కు చెందిన మీడియం పేసర్ క్రాంతి గౌడ్‌కు కోటి నగదు పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామని ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు.

వజ్రాలు పొదిగిన నగలు: టీమిండియా క్రికెటర్లకు వజ్రాలు పొదిగిన నగలతో పాటు వారందరి ఇంటిపైన ఉచితంగా సోలార్ ప్యానెల్స్ అమరుస్తామని సూరత్‌కు చెందిన పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు గోవింద్ ధోలాకియా ప్రకటించారు. జట్టు సభ్యులందరిని సన్మానించి, వజ్రాల నగలను బహూకరించే అవకాశం ఇవ్వాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు గోవింద్ లేఖ రాశారు.



ఇది ఆరంభం మాత్రమే..

"వరల్డ్‌కప్‌లో చాంపియన్‌గా నిలవడంతో అంతా అయిపోలేదు. ఇది మాకు ఆరంభం మాత్రమే. ఇప్పుడు మా ముందున్న లక్ష్యం ఇలాంటి విజయాలను అలవాటు చేసుకోవడమే. ప్రస్తుత గెలుపు కోసం దశాబ్దాలుగా ఎదురుచూసి చివరకు సాధించాం. ఇక ముున్ముందు మరిన్ని పెద్ద ఈవెంట్స్ రాబోతున్నాయి. అందుకే మేమింకా రాటుదేలాలనుకుంటున్నాం."

- హర్మన్‌ప్రీత్ కౌర్

ప్రధానితో సమావేశం రేపు

న్యూఢిల్లీ: వరల్డ్‌కప్ చాంపియన్‌గా నిలిచిన భారత మహిళల జట్టు ప్రధాని నరేంద్ర మోదీని కలవనుంది. హర్మన్ నేతృత్వంలోని ఆటగాళ్లంతా ఈనెల 5న న్యూఢిల్లీలోని ప్రధాని నివాసానికి వెళ్లనున్నారు. దీంతో ప్రస్తుతం ముంబైలో ఉన్న జట్టంతా మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోనుంది.

విక్టరీ పరేడ్ లేనట్టే..

గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలిచాక భారత పురుషుల జట్టు ముంబైలో విక్టరీ పరేడ్ చేసిన విషయం తెలిసిందే. అదే రీతిన హర్మన్‌ప్రీత్ బృందానికి కూడా విజయోత్సవ ర్యాలీ ఉంటుందని అభిమానులు ఆశించారు. కానీ ప్రస్తుతానికి అలాంటి ఆలోచనేమీ లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తేల్చాడు. మంగళవారం నుంచి దుబాయ్‌లో జరిగే ఐసీసీ మీటింగ్‌పైనే ప్రస్తుతం బోర్డు దృష్టి ఉందని, ఆ తర్వాతే ఓ నిర్ణయానికి వస్తామని తెలిపాడు.



వన్డే వరల్డ్ కప్ టైటిల్ విజయంతో అంతర్జాతీయ మహిళా క్రికెట్‌పై భారత్ ఆధిపత్యం చెలాయించే స్థాయికి చేరింది. బలమైన జట్లు పోటీపడిన ప్రపంచ కప్‌లో టైటిల్ గెలవడం ఆషామాషీ కాదు. అయితే సవాళ్లను ఎదుర్కోవడం విశ్వవిజేత భారత జట్టులోని క్రికెటర్లకు కొత్తకాదు. ఎన్నో క్లిష్ట పరిస్థితులను, సమస్యలను అధిగమించి తమ క్రికెటర్ కెరీర్‌ను వారు తీర్చిదిద్దుకున్న తీరు స్ఫూర్తిదాయకం.

కష్టాలకోర్చి.. లక్ష్యాన్ని చేరి..

చాంపియన్ల త్యాగాల గాథలు

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

నాన్న కలను నెరవేర్చి..



హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన పేసర్ రేణుకా సింగ్ తండ్రికి క్రికెట్ అంటే పిచ్చి అభిమానం. తన ఫేవరెట్ క్రికెటర్ వినోద్ కాంబ్లీ పేరును అతడు తన కుమారుడికి పెట్టాడు. రేణుకకు మూడేళ్ల వయస్సులో తండ్రి మరణించాడు. తండ్రి ఆకాంక్ష మేరకు రేణుకను క్రికెటర్‌గా తీర్చిదిద్దే బాధ్యతను తల్లి సునీత, సోదరుడు వినోద్ తీసుకున్నారు. తొలుత గ్రామంలో బాలుర జట్లతో క్రికెట్ ఆడిన రేణుక..బంధువు భూపిందర్ సలహాతో ధర్మశాలలోని హిమాచల్ క్రికెట్ సంఘం మహిళల రెసిడెన్షియల్ అకాడమీలో చేరి తన క్రికెట్ నైపుణ్యాలకు పదును పెట్టుకుంది.



మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలోని గిరిజన నగర పంచాయతీ గువారాలో పుట్టింది క్రాంతి గౌడ్. ఆమె తండ్రి రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్.

నగలు కుదువపెట్టి..

ఆరుగురు పిల్లల్లో క్రాంతి చివరిది. సోదరులు టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతుండడం చూసి ఆమె ఆటపట్ల ఆకర్షితురాలైంది. క్రాంతిలో సహజసిద్ధమైన అథ్లెట్ లక్షణాలున్నాయని గమనించిన కోచ్ రాజీవ్ బిల్తారే ఆమెకు శిక్షణ ఇప్పించాలని అనుకున్నాడు. కానీ ఆడపిల్ల క్రికెట్ ఆడడమా..అని క్రాంతి కుటుంబం అందుకు అంగీకరించలేదు. అయితే క్రాంతికి తల్లి అండగా నిలిచింది. శిక్షణకు అవసరమైన డబ్బుల కోసం తన నగలు సైతం ఆమె కుదువ పెట్టింది.

కూరగాయలు అమ్మి..



స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ రాధా యాదవ్ ముంబైలో పుట్టింది. తండ్రి కూరగాయలు అమ్ముతూ జీవనం సాగించేవాడు. ఇంటి పరిసర ప్రాంతాల్లో క్రికెట్ ఆడుతుండే రాధ..కోచ్ ప్రఫుల్ నాయక్ కంటపడింది. ఆమె బ్యాటింగ్ నైపుణ్యాలను గమనించిన ప్రఫుల్..రాధ తండ్రిని ఒప్పించి తనతోపాటు బరోడా తీసుకు వెళ్లాడు. అక్కడ శిక్షణ ఇప్పించి ఆమెను జాతీయస్థాయి క్రికెటర్‌గా తీర్చిదిద్దాడు.

తండ్రి తయారు చేసిన బ్యాట్‌తో..



మొహాలీకి చెందిన అమన్‌జోత్ కౌర్ తండ్రి కార్పెంటర్. అమన్‌కు బ్యాట్‌లేదంటూ స్థానిక బాలురు కొందరు ఆమెను తమతో ఆడేందుకు నిరాకరించారు. దాంతో అమన్‌జోత్ తండ్రి స్వయంగా ఓ బ్యాట్ తయారు చేసి ఆమెకు ఇచ్చాడు. 14 ఏళ్ల వయస్సులో రాధను కోచ్ నగేశ్ గుప్తా వద్ద చేర్పించాడు. అతడి కోచింగ్‌లో అమన్ తన నైపుణ్యాలకు మరింత సొబగులు అద్దుకుంది.

ఆ త్రో మార్చేసింది..



దీప్తి శర్మ సోదరుడు సుమీత్ ఉత్తర ప్రదేశ్ జట్టు పేసర్. దాంతో అతడు ఆడే అన్ని మ్యాచ్‌లకు దీప్తి వెళ్లేది. ఓసారి తన వద్దకు వచ్చిన బంతిని బుల్లెట్‌లా దీప్తి త్రో చేయడం భారత జట్టు మాజీ క్రికెటర్ హేమలత కంటపడింది. ఆమెలో క్రికెటర్ అయ్యే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని సుమీత్‌కు హేమలత సూచించింది. అలా దీప్తి ఆటలోకి అడుగుపెట్టింది.

నానమ్మ అనారోగ్యాన్ని దాచాం



అమన్ తండ్రి

వరల్డ్‌కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ క్యాచ్‌ను అమన్‌జోత్ అద్భుతంగా పట్టేసి మ్యాచ్‌ను మనవైపు తిరిగేలా చేసింది. అయితే అమన్ టోర్నీపైనే దృష్టి పెట్టేందుకు తన నానమ్మ అనారోగ్యాన్ని కుటుంబసభ్యులు తెలియనీయలేదట. 'అమన్‌జోత్ కెరీర్ ఆరంభంలో నా తల్లి నిరంతరం తనకు మద్దతిచ్చేది. అమన్ వీధుల్లో, పార్కుల్లో ఆడేటప్పుడు వెంటే ఉండి గమనించేది. అయితే గత నెలలో ఆమెకు గుండెపోటు వచ్చింది. కొన్ని రోజులుగా చికిత్స కోసం మేమంతా ఆస్పత్రిలోనే గడుపుతున్నాం. అయితే ఈ విషయాలేమీ అమన్‌కు చెప్పకుండా దాచాం. ఇప్పుడీ విజయం తన నానమ్మ ఆరోగ్యాన్ని కుదుటపరుస్తుందని ఆశిస్తున్నాం' అని అమన్ తండ్రి భూపిందర్ సింగ్ తెలిపాడు.

నిరాదరణ నుంచి జగజ్జేతగా..

- సాధారణ బోగీల్లో ప్రయాణాలు
- సొంత బ్యాట్ కూడా లేని దుస్థితి

దేశంలో ఎక్కడ చూసినా భారత మహిళల క్రికెట్ జట్టు విశ్వకప్ సంబరాలే.. అటు చూస్తే హర్మన్‌ప్రీత్ సేనపై కాసుల వర్షం కురుస్తోంది. ఆ మాటకొస్తే.. ఈ తరం మహిళా క్రికెటర్లకు గత కొంతకాలంగా పురుష క్రికెటర్లతో సమానంగా వేతనాలు లభిస్తున్నాయి. కొందరు ఎండార్స్‌మెంట్లతో కోట్లు సంపాదన కళ్లజూస్తున్నారు. జట్టు ఎక్కడికి వెళ్లినా బిజినెస్ క్లాసుల్లో ప్రయాణిస్తూ, ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తోంది. ఇదంతా నేటి తరం క్రికెట్ అభిమానులకు మామూలుగానే అనిపిస్తుండొచ్చునేమో కానీ ఓ దశాబ్ద కాలం వెనక్కి వెళితే భారత మహిళా క్రికెటర్లు ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొన్నారో తెలుస్తుంది.

చందాలతో పర్యటనలకు..

1973 నుంచి 2006 వరకు భారత మహిళల క్రికెట్ సంఘం (డబ్ల్యూసీఏఐ) ఆధ్వర్యంలో అమ్మాయిల జట్టు నడిచేది. ఆటగాళ్ల ఎంపికను కూడా ఈ సంఘమే చూసేది. అయితే టూర్లకు వెళ్లాలంటే మాత్రం చేతిలో డబ్బుండేది కాదు. దీంతో రైళ్లలో జనరల్ బోగీల్లోనే ప్రయాణించేవారు. ఆడినందుకు మ్యాచ్ ఫీజులుండేవి కావు. అటు అంతర్జాతీయ మహిళల క్రికెట్ మండలి (ఐడబ్ల్యూసీసీ) సైతం తమ సభ్యదేశాలకు నయా పైసా ఇచ్చేది కాదు. కేవలం ఆటపై అమితాసక్తి, ప్రేమతోనే అప్పటి ప్లేయర్లు క్రికెట్ టోర్నీల్లో ఆడేవారు. ఓసారి న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి హోటళ్లలో బస చేసేందుకు డబ్ల్యూసీఏఐ దగ్గర డబ్బులు లేకపోతే.. స్థానిక భారతీయుల నివాసాల్లో సర్దుకోవాల్సి వచ్చింది. మరోసారి ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాల్సిన పరిస్థితిలో మాజీ ప్రెజెంటర్ మందిరా బేడీ సహాయపడింది. ఓ డైమండ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నందుకు తనకు లభించిన మొత్తాన్ని డబ్ల్యూసీఏఐకి ఇవ్వగా, ఆ డబ్బుతోనే విమాన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్లేయర్లను ఇంగ్లండ్‌కు పంపగలిగారు.



మిథాలీ

బ్యాట్లు కూడా పంచుకునేవారు

అప్పటి క్రికెటర్లకు సొంత కిట్ అనేది లగ్జరీ కిందే లెక్క. అందుకే బ్యాట్లను కూడా షేర్ చేసుకునేవారు. స్థానిక క్రికెట్ టోర్నీల్లో పాల్గొనేటప్పుడు ఆయా జట్ల దగ్గర మూడు బ్యాట్లే ఉండేవి. ఓపెనర్లు, వన్‌డౌన్ బ్యాటర్ ముందు వినియోగించేవారు. ఓపెనర్ అవుటైతే నాలుగో నెంబర్ ప్లేయర్ తన బ్యాట్, లెగ్ గార్డ్స్‌ను వాడేది. ఇక వీరుండే వసతి గృహాల్లో 20 మందికి కలిపి నాలుగు వాష్‌రూమ్స్‌ను వినియోగించుకునేవారు. నేలపైనే తమ సొంత దుప్పట్లు వేసుకుని పడుకునేవారు. 2005 వన్డే వరల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలిచినందుకు ప్రైజ్‌మనీ లభించినా.. ఇప్పటి మాదిరిగా ప్రోత్సాహకాలూ వారికి దక్కలేదు.

ఇదీ భారత మహిళల క్రికెట్ ప్రస్థానం

బీసీసీఐ అండతో..

2006లో భారత మహిళా క్రికెట్ జట్టు బీసీసీఐ ఆధ్వర్యంలోకి రావడంతో నెమ్మదిగా పరిస్థితులు మారుతూ వచ్చాయి. ఆరంభంలో బోర్డు కూడా సీనియర్ జట్టుపైనే దృష్టి పెట్టింది. కానీ 2017 వన్డే వరల్డ్‌కప్ సెమీస్ మహిళల క్రికెట్‌లో కీలక మలుపుగా చెప్పవచ్చు. ఆసీస్‌పై హర్మన్‌ప్రీత్ అజేయంగా 171 రన్స్ బాదడంతో జనాల దృష్టి ఒక్కసారిగా అమ్మాయిల జట్టుపై పడింది. ఆ తర్వాత స్మృతి మంధాన తన బ్యాటింగ్ మెరుపులతో మరింత ఆదరణ తెచ్చింది. అటు బోర్డు కూడా మహిళల క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకోవడం.. వీరికి కూడా డబ్ల్యూపీఎల్ నిర్వహించడంతో ఆట స్వరూపమే మారిపోయింది. తొలితరం మహిళా క్రికెటర్లు ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా ఆటపై అంకితభావంతో ముందుకు సాగారు. వారిని ప్రేరణగా తీసుకున్న ఇప్పటి ఆటగాళ్లు తమ అసాధారణ నైపుణ్యాలతో భారత మహిళల జట్టును అత్యున్నత స్థాయికి చేర్చగలిగారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

విజేతలకు సీఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్‌లో విశ్వవిజేతలుగా నిలిచిన టీమ్ ఇండియాకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకున్నారని ప్రశంసించారు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో భారత మహిళా జట్టు కొత్త అధ్యాయాన్ని నమోదుచేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారని సీఎం కార్యాలయం విడుదల చేసిన మీడియా ప్రకటనలో తెలిపింది.

హైదరాబాద్ లక్ష్యం 344

మిలింద్ సెంచరీ మిస్
హిమాచల్‌తో రంజీ



మిలింద్

నదౌన్ (హిమాచల్ ప్రదేశ్): హిమాచల్‌ప్రదేశ్‌తో గ్రూప్ 'డి' రంజీట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ ఎదుట 344 పరుగుల లక్ష్యం నిలిచింది. అయితే మూడో రోజు ఆఖరికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. అంతకుముందు హిమాచల్‌ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు ఆలౌటైంది. ఆకాశ్ వశిష్ట్ (101 నాటౌట్) రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకం సాధించడం విశేషం. చామ మిలింద్ మూడు, పున్నయ్య రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు..ఓవర్‌నైట్ 274/8తో సోమవారం, మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 278 పరుగులకు ఆలౌటైంది. కిందటి రోజు 94 పరుగులతో ఆడుతున్న చామ మిలింద్ సెంచరీని నాలుగు పరుగుల దూరంలో మిస్సయ్యాడు. కాగా..హిమాచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులు చేసింది.



ముంబైలో మహిళల ప్రపంచ కప్ ఫైనల్ సందర్భంగా ఐసీసీ అధ్యక్షుడు జై షాతో బీసీసీఐ పాలకమండలి సభ్యుడు చాముండేశ్వర్ నాథ్

సిన్నర్ @ నెం.1

రోమ్: కొన్నాళ్లుగా గ్రాండ్‌స్లామ్స్ టోర్నీల్లో చెరోటి గెలుచుకుంటున్న టెన్నిస్ స్టార్లు కార్లోస్ అల్కారజ్, జానిక్ సిన్నర్ టాప్ ర్యాంక్ విషయంలోనూ నువ్వా నేనా అన్నట్టు దూసుకుపోతున్నారు. సోమవారం ప్రకటించిన ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో అల్కారజ్ అగ్రస్థానాన్ని సిన్నర్‌కు కోల్పోయాడు. ఇప్పటిదాకా రెండో స్థానంలో ఉన్న సిన్నర్ సింగిల్స్‌లో టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అల్కారజ్ రెండో స్థానానికి పడిపోయాడు. జ్వెరెవ్, ఫ్రిట్జ్, జొకోవిచ్ వరుసగా 3, 4, 5 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

మన చరణి తిప్పేసింది



భయపడలేదు..

"లీగ్ దశలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేతిలో మనం పరాజయం పాలయ్యాం. అయితే, ఆ ఫలితాలను మనసులో పెట్టుకొని సెమీస్, ఫైనల్లో వారితో తలపడినప్పుడు ఒత్తిడికి లోనుకాలేదు. ప్రధానంగా సెమీస్‌కు ముందు.. ఎన్నో వరల్డ్‌కప్‌లు గెలిచిన ఆసీస్‌పై భారత్ గెలుస్తుందా అనే చర్చలను జట్టుగా మేము అసలు పట్టించుకోలేదు. ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్‌కు మనం వెళ్తున్నాం అనే ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాం. వారికంటే మెరుగ్గా ఆడి విజయం సాధించాం. ఇక, ఫైనల్లోనూ సొంత ప్రేక్షకుల మధ్య భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నామనే ఒత్తిడి, భయానికి లోను కాకుండా మా శక్తి వంచన లేకుండా కృషి చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం."

- శ్రీచరణి

కడప డైనమైట్ నల్లపురెడ్డి శ్రీచరణి మహిళల వన్డే ప్రపంచ కప్‌లో తన సత్తా ఏంటో నిరూపించింది. జట్టు కష్ట సమయాల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన చేతికి బంతి ఇచ్చిన ప్రతిసారి ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టి ప్రశంసలు అందుకొంది. ఇరవై ఏళ్ల వయస్సులోనే ప్రతిష్టాత్మక వరల్డ్ కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా అందులో అద్భుత ప్రదర్శన కనబర్చిన తెలుగమ్మాయి శ్రీచరణిపై ప్రత్యేక కథనం.

రాయలసీమలోని కడప జిల్లా, యర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి క్రికెట్ ప్రయాణం రాకెట్‌లా దూసుకెళ్తోంది. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్‌తో మొదలై వన్డే ప్రపంచకప్ వరకు వరుస పెట్టి అవకాశాలు దక్కించుకుంటూ ప్రతి సందర్భంలోనూ తన ఎంపిక సరైనదేనని నిరూపించుకుంది ఈ తెలుగమ్మాయి. ప్రపంచకప్‌లో చరణి మొత్తం తొమ్మిది మ్యాచ్‌లాడి 14 వికెట్లు పడగొట్టింది. మొత్తంగా 4.96 ఎకానమీతో అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసింది. వరల్డ్‌కప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల జాబితాలో దీప్తి శర్మ 22 వికెట్లతో (5.52 ఎకానమీ) అగ్రస్థానం దక్కించుకోగా, చరణి నాలుగో స్థానంలో నిలిచింది.

సీనియర్లకు దీటుగా..: విశాఖపట్నం వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 331 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో భారత బౌలర్లందరూ విఫలమైన చోట చరణి తన దమ్ము చూపించింది. ఇక చావో రేవో తేల్చుకోవాల్సిన ఫైనల్లో కూడా దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్‌తో సహా టాపార్డర్ బ్యాటర్లంతా చరణి బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఆపసోపాలు పడ్డారు.

పూజలు ఫలించాయి..



"దేశానికి తొలి మహిళల వరల్డ్‌కప్ అందించిన భారత జట్టులో మా అమ్మాయి సభ్యురాలిగా ఉండడం మా అదృష్టం. మేము చేసిన పూజలు ఫలించాయి. ఈ ప్రపంచకప్‌లో చరణి ఆట తీరు పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. దేశం మొత్తం మా బిడ్డను పొగుడుతుంటే ఆనందంగా ఉంది."

- చంద్రశేఖర్ రెడ్డి (శ్రీచరణి తండ్రి)

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

లలిత్, రిత్విక్ పరాజయం

చెస్ ప్రపంచ కప్

పనాజీ (గోవా): ఫిడే వరల్డ్‌కప్‌లో తెలుగు జీఎంలు లలిత్ బాబు, రాజా రిత్విక్ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లోని రెండు క్లాసిక్ గేమ్‌లను ఈ ఇరువురు డ్రా చేసుకోవడంతో సోమవారం టైబ్రేకర్ నిర్వహించారు. ఇందులో ఇద్దరూ పోరాడి ఓడారు. జీఎం లలిత్ బాబు (విజయవాడ) ర్యాపిడ్ రెండు గేములను కూడా డ్రా చేయడంతో తొలుత 2-2తో వామర్‌డామ్ (నెదర్లాండ్స్)తో సమంగా నిలిచాడు. ఆ తర్వాత నిర్వహించిన రెండో టైబ్రేకర్ బ్లిట్జ్‌లో ఓడి 3-5తో పోటీల నుంచి నిష్క్రమించాడు. రాజా రిత్విక్ (కరీంనగర్) ర్యాపిడ్ రెండు గేములను డ్రా చేసుకుని 2-2తో నోజర్‌బెక్ (కజకిస్థాన్)తో సమంగా నిలవగా ఆ తర్వాత జరిగిన రెండో టైబ్రేకర్ బ్లిట్జ్‌లో ఓడి 3-5తో పోటీల నుంచి తప్పుకున్నాడు. ఇతర భారత గ్రాండ్‌మాస్టర్లలో తెలుగు క్రీడాకారుడు కార్తీక్‌తో పాటు సూర్య శేఖర్ గంగూలీ, వి.ప్రణవ్, రౌనక్, ప్రాణేష్, ఇనియాన్ రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. ఇక, తొలి రౌండ్‌లో బై లభించిన స్టార్ ప్లేయర్లు గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ రెండో రౌండ్‌లో పోటీ పడనున్నారు.

కోకాపేటలో ఎకరం రూ.99 కోట్లు

- 42 ఎకరాల భూవేలానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోకాపేట, మూసాపేటల్లో 42 ఎకరాల భూమి వేలం వేయడానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌లో కోకాపేటలో ఎకరం అప్‌సెట్ విలువ రూ.99 కోట్లుగా ఖరారు చేసింది. కోకాపేటలోని నియో పోలీసు లేఔట్‌లో 27 ఎకరాలు, దాని పక్కనే గోల్డెన్ మైల్‌లో 1.98 ఎకరాలు, మూసాపేటలో 14 ఎకరాల భూమిని 24, 28, డిసెంబర్ 3,5 తేదీల్లో ఆన్‌లైన్‌లో వేలం వేయనున్నారు. గోల్డెన్ మైల్ లేఔట్‌లో ఎకరం అప్‌సెట్ ధర రూ.70కోట్లు, మూసాపేటలో ఎకరం అప్‌సెట్ విలువ 75 కోట్లుగా ఖరారు చేసింది. హెచ్ఎండీఏ అప్‌సెట్ ధర ప్రకారం ఈ స్థలాల విక్రయం ద్వారా ప్రభుత్వానికి సుమారు 5,500కోట్ల ఆదాయం వస్తుంది. ఈ-వేలంలో పలికే ధరల ప్రకారం ఖజానాకు 6,000 కోట్ల వరకూ ఆదాయం వస్తుందని అధికారుల అంచనా.

సోలార్ మహిమ... యూనిట్ విద్యుత్తు 2 పైసలే

మార్కెట్‌లో 2 పైసలు, 5 పైసలకు సాధారణంగా ఏ వస్తువు దొరకదు. కానీ సోమవారం బహిరంగ విపణిలో యూనిట్ కరెంట్ 2 పైసలకు అమ్ముడుపోయింది. ఉదయం 8:45 నుంచి 9 గంటల మధ్య బ్లాక్‌లో ఈ ధరకు 4,310 మెగావాట్ల విద్యుత్తును కొనుగోలు చేశారు. ఆ సమయంలో 15,955 మెగావాట్లను విక్రయించేందుకు డెవలపర్లు బిడ్లు వేయగా... 4310 మెగావాట్లు మాత్రమే అమ్ముడుపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 దాకా 5 పైసలకే విక్రయించారు. 1:30 నుంచి 1:45 మధ్యకాలంలో యూనిట్ 10 పైసలకు అమ్ముడవడం గమనార్హం. ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్(ఐఈఎక్స్)లో ప్రతీ 15 నిమిషాలకు ఒక బ్లాకుచొప్పున ప్రతిరోజు 90 బ్లాకులుగా కరెంట్ విక్రయాలు జరుగుతుంటాయి. రియల్ టైమ్ మార్కెట్‌లో కరెంట్ విక్రయించాలన్నా... కొనుగోలు చేయాలన్నా గంట ముందే బిడ్ వేయాల్సి ఉంటుంది. డిమాండ్ పడిపోగానే గ్రిడ్‌ను కాపాడుకోవడానికి తక్కువ ధరకే విక్రయించాల్సి ఉంటుంది. థర్మల్, జలవిద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తయ్యే కరెంటును విక్రయించే అవకాశం లేనప్పుడు ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఉదయం 8 గంటల కల్లా సౌరవిద్యుత్ ఉత్పాదన జోరుగా జరుగుతుంది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఉదయం 8 గంటల నుంచి సౌరవిద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావడంతోనే ధరల పతనం జరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏడాదిలో 120 జీసీసీలతో 1.20 లక్షల కొలువులు

- 'వాన్ గార్డ్' జీవీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాదిలో 120 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను ప్రారంభించనున్నట్లు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. తద్వారా కొత్తగా 1.2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి.. హైటెక్ సిటీలోని నాలెడ్జ్ పార్కులో ఏర్పాటు చేసిన వాన్ గార్డ్ న్యూ ఇండియా ఆఫీసు 'గ్లోబల్ వాల్యూ సెంటర్'ను శ్రీధర్ బాబు సోమవారం ప్రారంభిస్తూ జీసీసీల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్‌ల్లో యువతకు అత్యుత్తమ నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. ప్రస్తుతం విశ్వసనీయత, సమగ్రత, ఇన్నోవేషన్‌కు చిరునామాగా హైదరాబాద్ మారిందని ఆయన చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి నిర్వహణ సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్ తమ 'గ్లోబల్ వాల్యూ సెంటర్(జీవీసీ)'ను హైదరాబాద్‌లో ప్రారంభించాలని నిర్ణయించుకోవడం భాగ్య నగర సామర్థ్యానికి నిదర్శనమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, క్లౌడ్ మోడర్నైజేషన్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో వాన్‌గార్డ్ జీవీసీ ఒక హబ్‌గా సేవలు అందిస్తుందన్నారు. వాన్‌గార్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

3,366 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించండి..

- సర్కారుకు మద్యం సరఫరా కంపెనీల డిమాండ్

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు బకాయి పడిన రూ.3,366 కోట్ల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని మద్యం సరఫరా కంపెనీలు డిమాండ్ చేశాయి. బకాయిలు చెల్లించకపోతే డిమాండ్‌కు తగ్గట్లు మద్యం సరఫరా చేయలేమని ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యూఏఐ) సీఈవో సంజిత్ పాధి, బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) డైరెక్టర్ జనరల్ అనంత్ అయ్యర్ సోమవారం సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశారు. దసరా, దీపావళి సమయంలో మద్యం విక్రయాలతో ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం వచ్చినా.. సరఫరాదారులకు మాత్రం అందులో 50 శాతం కూడా చెల్లించలేదన్నారు.

మధ్యాహ్న భోజనంలో చేపల వంటకాలు!

- సీఎం రేవంత్‌తో చర్చించాక నిర్ణయం: మంత్రి వాకిటి

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేపల వల్ల కలిగే ఆరోగ్యపరమైన ప్రయోజనాలపై విస్తృత ప్రచార ప్రణాళికలు రూపొందించాలని మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. సోమవారం సచివాలయంలో చేప పిల్లల పంపిణీపై కలెక్టర్లు, మత్స్య శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొన్ని రాష్ట్రాల్లోని స్కూళ్లలో మధ్యాహ్న భోజనంలో చేపల వంటకాలు పెడుతున్నారని.. రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ నెలాఖరు వరకు చేపపిల్లల పంపిణీ పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలు జరిగాయని, ప్రస్తుతం ప్రతి చెరువు వద్ద పంపిణీ వివరాలు తెలిసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. చేపల ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ సదుపాయం పెంచాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో చేపల రిటైల్ ఔట్‌లెట్ మార్కెట్ కోసం ప్రభుత్వ స్థలాలను కలెక్టర్లు కేటాయించాలని సూచించారు

రెండు గురుకులాల ప్రిన్సిపాళ్లపై సస్పెన్షన్ వేటు

- అనుచిత ప్రవర్తన, ఆత్మహత్యాహత్నం ఘటనల్లో చర్యలు
- నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఘటనలు

దేవరకొండ/షాద్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్‌లోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటన లో ప్రిన్సిపాల్ కల్యాణిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలాత్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్టీ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి (ఆర్‌సీవో) బలరాంనాయక్ సోమవారం విలేకరులకు తెలిపారు. తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రానికి చెందిన మాధవి (10వ తరగతి) ఉపాధ్యాయురాలు మందలించారనే మనస్తాపంతో అక్టోబరు 31న డెటాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనపై విచారణ చేసిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక మేరకు ప్రిన్సిపాల్ కల్యాణిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. మరో ఘటనలో, విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించినందుకు నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ శాఖ డిగ్రీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ అయ్యారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన నాగర్‌కర్నూల్ అడిషనల్ కలెక్టర్ పి.అమరేందర్ సోమవారం ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమెను కలెక్టరేట్‌కు పరిమితం చేశారు.

గల్లా పట్టి పథకాల అమలు

సంక్షేమం ఆపడానికి నీ అయ్య సొమ్మా?.. రేవంత్‌వి ఉద్దర మాటలు.. నమ్మొద్దు

- 16 నెలల్లో కంటోన్మెంట్‌కు 16 పైసలిచ్చారా?
- తెలంగాణను అట్టర్‌ఫ్లాప్ రాష్ట్రంగా మార్చారు
- జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే ప్రభుత్వం దిగొస్తుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





జూబ్లీ హిల్స్ నియోజకవర్గ పరిధి బోరబండ డివిజన్‌లో రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే పథకాలు ఇవ్వడట. ఇవ్వకపోవడానికి నీ అయ్య సొమ్మా.. నీ అబ్బ సొమ్మా.. రేవంత్?' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపిస్తే కాంగ్రెస్ నేతల గల్లా పట్టి పథకాలు అమలు చేయిస్తామన్నారు. 'హిట్లర్ లాంటి నియంతలే పోయారు.. నువ్వెంత' అని సీఎంను ఉద్దేశించి మండిపడ్డారు. సోమవారం ఆయన బోరబండ డివిజన్‌లో రోడ్ షో నిర్వహించారు. రేవంత్ సీఎం కుర్చీ కాపాడుకునేందుకు రాహుల్ గాంధీకి నెలకు రూ.100 కోట్లు పంపుతున్నారని ఆరోపించారు. ఢిల్లీకి పంపేందుకు పైసలున్నాయి కానీ తెలంగాణ గల్లీల్లో ఉండే గరీబోళ్లకు ఇచ్చేందుకు లేవా? అని ప్రశ్నించారు. 'ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా అని రేవంత్ అంటున్నడు. రెండేళ్ల కింద అవకాశం ఇచ్చినందుకే కదా.. హైదరాబాద్‌ను ఆగం చేసినవు.. అయ్యా నీకు ఒక ఛాన్స్ ఇస్తేనే 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నరు. 700 మంది రైతులు చచ్చిపోయే పరిస్థితి తలెత్తింది. ఇందిరమ్మ రాజ్యమని వేల ఇళ్లు కూలగొట్టినవు. సున్నం చెరువులో ఉండే గరీబోళ్ల ఇళ్లు కూలగొట్టి.. మెడలు పట్టి బయటకు గెంటేశావు. రియల్ ఎస్టేట్‌ను కుప్పకూల్చావు. అగ్రభాగాన ఉన్న తెలంగాణను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లి అట్టర్‌ఫ్లాప్ రాష్ట్రంగా మార్చావ'ని విమర్శించారు. అభివృద్ధి అంటోన్న రేవంత్ రెడ్డి మాటలు నమ్మొద్దని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారన్నారు. 'సీఎం కలుస్తలేడు. పైసా ఇస్తలేడ'ని ఓ ఎమ్మెల్యే రూ.100 కోట్ల రుణం కావాలని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశారన్నారు. కంటోన్మెంట్‌లో గెలిచి 16 నెలలైనా 16 రూపాయలైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ లేదని, లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం మీ కళ్ల ముందు కనిపిస్తోందని, రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలూ అమలు చేయలేదన్నారు. జూబ్లీ హిల్స్‌లో ఓడిస్తేనే ప్రభుత్వం దిగొచ్చి.. హామీలు అమలు చేస్తుందన్నారు. కులాలు, మతాలకతీతంగా అందరూ తిరిగి కేసీఆర్ సీఎం కావాలనుకుంటున్నరన్నారు. 'ఆడపిల్ల ఏం చేస్తదనుకోవద్దు. సునీతమ్మకు అండగా నేనున్నా. విష్ణు వర్ధన్ రెడ్డి, కేసీఆర్ ఉన్నారు. పక్కనే తెలంగాణ భవన్ ఉంది. అర్ధరాత్రి ఫోన్ చేసినా.. అర్ధ గంటలో మీ ముందుంటాం. కాంగ్రెస్ గూండాల గల్లా పట్టి నిలదీస్తామ'ని కేటీఆర్ అన్నారు.

నేడు, రేపు రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్‌లు

- స్వయంగా హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- జూబ్లీహిల్స్ పరిధిలో ప్రతి ఓటరును మరోసారి కలిసేలా మీనాక్షి, మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రణాళికలు

హైదరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా ఇప్పటికే రెండు రోజుల పాటు ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. మంగళ, బుధ వారాల్లోనూ రోడ్డుషోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొననున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటలకు షేక్‌పేట్ డివిజన్‌లోని హనుమాన్ టెంపుల్ వద్ద కార్నర్ మీటింగ్, రాత్రి 8 గంటలకు రహమత్‌నగర్ డివిజన్‌లో ఎస్‌పీఆర్ హిల్స్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి హబీబ్ ఫాతిమా నగర్ వరకు రోడ్‌షో నిర్వహించనున్నారు. అనంతరం శ్రీరామ్‌నగర్ క్రాస్ రోడ్స్‌లో జరిగే కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. అలాగే, బుధవారం సైతం పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కాగా, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను మహిళా ఓటర్లకు వివరించే బాధ్యతను ఏడుగురు మహిళా ముఖ్య నేతలకు కాంగ్రెస్ పార్టీ అప్పగించింది. వీరిలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎంపీ రేణుకాచౌదరి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు పద్మావతీరెడ్డి, యశస్వినీరెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఉన్నారు. ప్రచారంలో వీరికి సహకరించేందుకు ఒక్కొక్కరికీ 9 మంది చొప్పున మహిళా నేతలను పార్టీ నియమించింది. మంగళవారం నుంచి వీరంతా నియోజకవర్గంలోని ప్రతి మహిళనూ కలవనున్నారు. కాగా, స్థానిక ఓటర్లలో చాలా మంది నియోజకవర్గం వెలుపల నివసిస్తున్నారని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ.. మరో సారి ఓటర్లందరినీ కలవాలని డివిజన్, బూత్‌ల ఇన్‌చార్జిలను ఆదేశించింది. ఈ మేరకు ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నేతలతో సోమవారం ఇందిరాభవన్‌లో పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఉప ఎన్నికలో పనితీరును బట్టే పదవుల్లో కొనసాగించేదీ.. లేనిదీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైనా.. నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేసుకుంటే కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ వారం రోజులే చాలా కీలకమని, ఇంటింటా ప్రచారం నిర్వహించాలని సూచించారు.

అన్యాయాన్ని పెంచి పోషించిన బీఆర్ఎస్: మీనాక్షి

యూసుఫ్‌గూడ: తెలంగాణలో అన్యాయాన్ని పెంచి పోషించిన బీఆర్ఎస్‌ను ప్రజలు భూస్థాపితం చేశారని, మరోసారి అలాంటి వారి మాటలు, ఆటలు సాగకుండా జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. యూసుఫ్‌గూడలోని సోమవారం నిర్వహించిన మహిళా కార్యకర్తల సమావేశంలో మంత్రి ఉత్తమ్, మీనాక్షి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పాలనలోనే న్యాయం జరిగిందన్నారు.



కార్మిక నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కాళేశ్వరం అవినీతి సొమ్ముతో... జూబ్లీహిల్స్‌లో గెలిచేందుకు బీఆర్ఎస్ యత్నం: పొంగులేటి

బోరబండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి సొమ్ముతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి రహ్మత్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడి సంపాదించిన రూ.లక్ష కోట్లను బీఆర్ఎస్ ఇప్పుడు రాజకీయాల్లో ఉప యోగిస్తోందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు చేస్తున్న పన్నాగాలు ఎట్టి పరిస్థితుల్లో సఫలం కావని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి బీఆర్ఎస్ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. ఈ మూడేళ్లే కాకుండా మరో ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమి చేసిందో ఓటర్లు గమనించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఇంత వరకు గ్రామీణ ప్రజలపై దృష్టి సారించామని, ఇకపై పట్టణ పేదలకు ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఎస్పీఆర్ హిల్స్‌లో మంత్రి పొంగులేటి సమక్షంలో 200మంది యువకులు, కార్మిక నగర్‌లో ఆటో యూనియన్ అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో 200 మంది ఆటో డ్రైవర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.



మరింత జోరుగా.. ఉత్సాహంగా!

ప్రచారంలో దూసుకెళ్తున్న మంత్రి జూపల్లి

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రచార జోరు పెంచారు. బస్తీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాల్లో సోమవారం తిరుగుతూ ఆరు గ్యారంటీలను వివరిస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఇంటింటికెళ్లిన మంత్రి జూపల్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీలు, బస్తీల్లో ప్రజలు తమకు ఘన స్వాగతం పలుకుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అధోగతి పాల్జేసిందని, పలు అరాచకాలకు పాల్పడిన బీఆర్ఎస్‌కు మరోసారి ఓటుతో బుద్ధి చెప్పాలని జూపల్లి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే జూబ్లీహిల్స్‌లో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సుల్తాన్ నగర్‌లోని కల్పతరు రెసిడెన్సీ వాసులను కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. స్పోర్ట్స్ లాంజికెల్లి జిమ్‌లో వ్యాయమం చేసి, అక్కడివారితో కలిసి షటిల్ ఆడారు. అటుపై ఎర్రగడ్డ డివిజన్‌లో రాజీవ్ నగర్ కాలనీ, జయంతి నగర్, కళ్యాణ్ నగర్ వెంచర్-3ల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి వెంట డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తదితరులున్నారు.

బీజేపీకి 10వేల లోపే ఓట్లు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాష్ట్ర మంత్రి పొన్నం సవాల్

హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి పది వేల ఓట్లు కూడా రావని ఇది కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సవాలు అని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అంతర్భాగమైన జూబ్లీహిల్స్‌లో 2023 ఎన్నికల్లో బీజేపీకి 25 వేల ఓట్లు వచ్చాయని, బీఆర్ఎస్‌తో కుమ్మక్కు కావడం వల్లే గత ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తికే ఆయన బీజేపీ టికెట్ ఇచ్చారన్నారు. మొత్తం బీజేపీ వ్యవస్థను బీఆర్ఎస్‌కు స్వాధీనం చేశారని పొన్నం ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు తీసుకున్నందుకు గురుదక్షిణ గానే జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు బీజేపీ లోపాయికారీగా మద్దతు తెలుపుతున్నట్లు చర్చ జరుగుతోందన్నారు. టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటన చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి బాటలో దేశ వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ అమలు చేసే దమ్ము బీజేపీకి ఉందా? అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రశ్నించారు.

ఓట్లు చీలి బీజేపీయే 'కింగ్'

త్రిముఖ పోరులో మాదే గెలుపు.. కేసీఆర్ మళ్లీ సీఎం అంటూ కేటీఆర్ పగటి కలలు

- కేసీఆర్ 2 గంటలు పాదయాత్ర చేసి ఓటడగాలి
- ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డీల్
- మజ్లిస్‌ను బీఆర్ఎస్, కాంగ్రెస్ పెంచి పోషించాయి
- 2, 3 వేలకు ఓటు అమ్ముకోవద్దు
- మీడియాతో చిట్‌చాట్, ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి



రాజీవ్ నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కిషన్ రెడ్డి

హైదరాబాద్/ఎర్రగడ్డ/హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో త్రిముఖ పోరులో వివిధ వర్గాల ఓట్లు చీలి బీజేపీ 'కింగ్' అవుతుందని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఓటమి భయంతోనే గత ఎన్నికల్లో పోటీ చేసిన అజారుద్దీన్‌కు ఈసారి టికెట్ ఇవ్వలేదన్నారు. అయితే ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా గెలుస్తామన్న ఆశలో ఉందని విమర్శించారు. రెండేళ్లుగా ప్రజల మధ్యకు రాని కేసీఆర్ మళ్లీ సీఎం ఎలా అవుతారని, ఈ విషయంలో కేటీఆర్ పగటికలలు కంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఓటు అడిగే ముందు కేసీఆర్ రెండు గంటల పాటు జూబ్లీ హిల్స్‌లో పాదయాత్ర చేసి, బీఆర్ఎస్ హయాంలో అక్కడ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో, జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో మెగాస్టార్ చిరంజీవి ప్రచారం చేస్తారా? అన్న ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందిస్తూ ఆయన ప్రధాని మోదీ అభిమాని అని అన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై ఒక సంస్థ నిర్వహించిన సర్వేపై ఆయన స్పందిస్తూ ఆ సర్వేను బాత్‌రూంలో నిర్వహించారా? బెడ్‌రూంలో నిర్వహించారా? అని మండిపడ్డారు. తామంతా సమష్టిగానే ప్రచారం చేస్తున్నామని, స్థానిక ఎంపీగా, తనకు కూడా పార్టీయే ప్రచార కార్యక్రమాలను నిర్దేశిస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దేనని అన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్లు అమలు చేస్తే అన్ని స్థానాల్లోనూ ఎంఐఎం పోటీ చేయడం ఖాయం. సీఎం రేవంత్‌కు ధైర్యముంటే బీసీలకు కేటాయించిన స్థానాల్లో కూడా ఎంఐఎం పోటీ చేయబోదని ప్రకటించాల'ని సవాల్ చేశారు. బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఢిల్లీలో ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. మజ్లిస్‌ను పెంచి పోషించిన బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. మజ్లిస్ ఆగడాలతో ఎంతో మంది బస్తీలు ఖాళీ చేస్తున్నారని, అలాంటి పరిస్థితి జూబ్లీ హిల్స్‌కు రాకూడదంటే బీజేపీకి ఓటేయాలని కోరారు. మజ్లిస్ నుంచి హైదరాబాద్‌ను రక్షించుకోవాలన్నారు. రెండు, మూడు వేలకు ఓట్లు అమ్ముకోవద్దని, మన పిల్లల భవిష్యత్తు, బస్తీలు, జూబ్లీ హిల్స్‌ను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ విలువైన ఓటు వృథా అయినట్లేనన్నారు. మెట్రోను తాను అడ్డుకుంటున్నట్లు తప్పుడుప్రచారం చేయడం కాంగ్రెస్ మంత్రులకు రివాజుగా మారిందని విమర్శించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీజేపీ ఇంప్లీడ్ అయిందని చెప్పారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* ***N. Rahul Kumar****. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* ***Managing Director: Vemuri Radha Krishna,*** *Founder: K.L.N.Prasad.*